



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

లౌకికవాదం, సోషలిస్టు పదాలపై ఏమి నాటకాల్రా బాబూ

సుప్రీం కోర్టు తీర్పును ధిక్కరిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నిబంధనావళి నుంచి తొలగిస్తారా !

లోపలి పేజీల్లో

గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో సిబ్బంది ఇబ్బందులు

సంపుటి 08, సంచిక: 211 | మంగళవారం | 01-07-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## బనకచర్ల ప్రాజెక్టుకు 'నో'

### తేల్చిచెప్పిన పర్యావరణ నిపుణల కమిటీ

న్యూఢిల్లీ : పోలవరం—బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయని, అనుమతులు ఇవ్వాలంటే గోదావరి జలాల పంపిణీ ట్రిబ్యూనల్ (జిడబ్ల్యుడిటి) అవార్డు పరిశీలించాల్సి ఉందని పేర్కొంది. పర్యావరణ అనుమతులకు కేంద్ర జల సంఘాన్ని సంప్రదించడం అత్యవసరమని కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టు జిడబ్ల్యుడిటి తీర్పును ఉల్లంఘించినట్లవుతుందని ఫిర్యాదులు వచ్చాయన్న కమిటీ తెలిపింది.



## మావోయిస్టులతో కేంద్రం చర్చలు ఎందుకు జరపదు?

- నక్సలైట్లను అంతం చేస్తామని అమిత్‌షా ప్రకటించడం దుర్మార్గం
- టిపిసిసి మహేష్‌కుమార్‌గౌడ్ ఆగ్రహం

ప్రజాపక్షం / హైదరాబాద్

పాకిస్తాన్‌తో భారతదేశం యుద్ధం చేస్తుండగా అమెరికా అధ్యక్షులు ట్రంప్ చెబితే ప్రధాని మోదీ మధ్యలో ఆపేసారని, వామపక్ష ఉద్యమంలో ఉన్న భారతదేశ పౌరులైన మావోయిస్టులతో సీజ్ ఫైర్ చేసి కేంద్ర ప్రభుత్వం వారితో చర్చలు ఎందుకు జరపదని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. తేదీ నిర్ణయించి మరీ తరువాయి 2లో

## పాశమైలారం పారిశ్రామిక వాడలో

# భారీ పేలుడు



### 13 మంది మృత్యువాత

మరో 34 మందికి గాయాలు, 12 మంది పరిస్థితి విషమం



- సిగాచి కెమికల్స్ పరిశ్రమలో పేలిన రియాక్టర్
- పెద్ద ఎత్తున ఎగసిపడిన మంటలు
- కూలిన భవనం
- మరికొన్నింటికి బీటలు
- పరిశ్రమల వద్ద బాధిత కుటుంబాల ఆందోళన

ప్రజాపక్షం/ సంగారెడ్డిప్రతినిధి

ఇస్నాపూర్ మున్సిపాలిటీ పాశమైలారంలోని సిగాచి కెమెకల్స్ పరిశ్రమలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారు జామున ఫ్యాక్టరీలో రియాక్టర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందారు. మరో 34మంది గాయపడ్డారు. వెంటనే స్పందించిన ఫైర్ సిబ్బంది 8 ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేశారు. క్షతగాత్రులను వివిధ ఆసుపత్రులకు తరలించారు. డిజాస్టర్ టీం రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది. ప్రమాదం సమయంలో కార్మికులు దాదాపు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. ఘటనా స్థలిలోనే ఐదుగురు మృతి చెందగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 90 మంది ఉన్నట్లు సమాచారం క్షతగాత్రుల్లో 12 మంది పరిస్థితి విషమంగా ఉంది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. పేలుడు ధాటికి కూలిన భవన శిథిలాల కింద మరికొంత మం ది చిక్కుకున్నట్లు తెలుస్తోంది. కెమికల్ ప్యాక్టరీ కావడం ఘాటైన వాసన రావటంతో స్థానిక ప్రజలు ఉక్కిరిబిక్కిరై ఇళ్ల నుంచి పరుగులు తీశారు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా మరో భవనానికి బీటలు వచ్చాయి. పాశమైలారం దుర్ఘటనలో తరువాయి 2లో



### నేడు 'సిగాచి'కి సిఎం రేవంత్‌రెడ్డి

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఒక రసాయన పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాద ఘటనలో పలువురు మరణించడం దిగ్భ్రాంతి కలిగించిందని సిఎం తెలిపారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే సిఎం స్పందిస్తూ ప్రమాదం జరిగిన తీరును అధికారులను తరువాయి 2లో



### ప్రధాని సహా పలువురి దిగ్భ్రాంతి

పాశ మైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున పరిహారం అందిస్తామని తరువాయి 2లో

## అభివృద్ధి పనులు సత్వరమే

# పూర్తిచేయండి

- వివిధ వర్గాల ప్రజల సమస్యలు పరిష్కరించండి
- ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వండి
- సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఐ నేతలు వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని సిపిఐ రాష్ట్ర నేతల బృందం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకటరెడ్డి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఎఐటియుసి సీనియర్ నాయకురాలు డాక్టర్ బివి.విజయలక్ష్మి సోమవారం హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వివిధ వర్గాల ప్రజల సమస్యలు, పలు అభివృద్ధి పనులకు సంబంధించిన తరువాయి 2లో



## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా.. రామచందర్ రావు

- నేడు అధికారిక ప్రకటన
- పార్టీకి ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా
- ఎపి బిజెపి అధ్యక్షుడిగా పివిఎన్ మాధవ్ పేరు ఖరారు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షునిగా ఎన్. రామచంద్రరావు ఎన్నికయ్యారు. మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు ఒక్కరే అధ్యక్ష ఎన్నికకు నామినేషన్ దాఖలు చేశారు. దీంతో అధ్యక్షుని ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఈ విషయాన్ని కేంద్ర అధిష్ఠానం అధికారింగా ప్రకటించాల్సి తరువాయి 2లో

## భద్రతా బలగాల రాడార్‌లో హిడ్మా?

- మావోయిస్టు అగ్రనేత నీడలో కేంద్రకమిటీ సభ్యులు సుజాత, పుల్లూరి ప్రసాదరావ్‌తో సహా 300 మంది నక్సల్స్

ప్రజాపక్షం/హైదరాబాద్



దండకారణ్యంలో మావోయిస్టు అగ్రనేత మాడ్వి హిడ్మాను భద్రతదళాలు చుట్టుముట్టినట్లు విశ్వసనీయ సమాచారం. నేషనల్ ఏరియా పార్క్ నుంచి అబూజ్‌మాడ్ కారిడార్‌లో హిడ్మా కదలికలు ఉన్నట్లు భద్రతదళాలలకు సమాచారం అందడంతో ఈ ప్రాంతాన్ని అష్టదిగ్బంధం చేసినట్లు తెలిసింది. భద్రతాదళాల రాడర్‌లోనే హిడ్మా కదలికలు ఉన్నాయని తెలుస్తుంది. హిడ్మా వెంట సుమారు 300 మంది మావోయిస్టులు ఉన్నట్లు కూడా భద్రతదళాలు పసిగట్టాయి. హిడ్మా వెంకట ఉన్న వారిలో పిఎల్‌జిఎ బెటాలియన్ 2 కమాండర్ తరువాయి 2లో


### ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాలు ఎండగట్టాలి 03




- 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు,కర్షకులు పెద్దఎత్తున భాగస్వాములవ్వాలి
- వామపక్ష నాయకుల పిలుపు
- భారత్ అసమానతల దేశంగా మారుతుందని ఆవేదన

### జస్టిస్ పిసి ఘోష్ కమిషన్‌కు కాళేశ్వరం అవకతవకల వివరాలు 12



### ప్రపంచంలో ఆర్థిక అనిశ్చితి అప్రమత్తతే మనకు రక్ష 05



ఆర్థిక స్థిరత్వమే వృద్ధికి కీలకం.. ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా వెల్లడి

### కుదిపేస్తున్న భారీ వర్షాలు.. 05

ఉత్తరాది అతలాకుతలం

హిమాచల్‌లో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం







# ప్రపంచం
WORLD NEWS

## యూరోపియన్ మీడియాపై రష్యా ప్రతీకార ఆంక్షలు

**మాస్కో :** యూరోపియన్ మీడియాపై రష్యా సోమవారంనాడు ప్రతీకార ఆంక్షలు విధించింది. యూరప్ మీడియాకు చెందిన 15 సంస్థలకు వెబ్ వనరులను అందుబాటులో ఉంచకుండా స్తంభింపజేసింది. రష్యాకు చెందిన ఎనిమిది మీడియా సంస్థలపైన, ఇన్ఫర్మేషన్ ఛానల్స్‌మీద యూరోపియన్ యూనియన్ విధించిన ఆంక్షలకు ప్రతీకారంగా తాము ఆంక్షలు పెట్టినట్లు రష్యా విదేశాంగమంత్రిత్వశాఖ ప్రకటించిందని టాస్‌వార్తాసంస్థ తెలియజేసింది. ముఖ్యంగా యూరోసియాడైలీ, ఫాండ్స్, లెంటా, న్యూస్‌ఫ్రంట్,రుబాల్టిక్,సౌత్‌ఫ్రంట్,స్ట్రాటజిక్ కల్చరల్ ఫౌండేషన్, క్రాస్నాయా జ్వెజ్దాలపై16వ విడత ఆంక్షల్లో భాగంగా నిషేధం అమలు చేశా రు. ఈ ఏడాది ఫిబ్రవరిలో యూరోపియన్ కౌన్సిల్ ఈ ఆంక్షలకు ఆమోదముద్ర వేసింది. ఐతే యూరోపియన్ యూనియన్ గనుక తన ఆంక్షలు రద్దుచేస్తే తాము కూడా ఉపసంహరించుకుంటామని రష్యా విదేశాంగశాఖ చెప్పింది.



# తిరిగి అఫ్ఘానిస్థాన్‌కు వలస ప్రజలు

## ఇరాన్ నుండి 2.30 లక్షల మంది..

**కాబూల్ :** ఇరాన్ విధించిన గడువుతేదీ దగ్గరపడుతూ ఉండటంతో ఆ దేశం నుండి ఒక్క జూన్ నెలలోనే 2.30 లక్షలమందికిపైగా అక్రమ వలస ప్రజలు తిరిగి అఫ్ఘానిస్థాన్‌కు చేరుకున్నారు.ఈసంఖ్య రాబోయే రెండు వారాల్లో మరింతగా పెరుగుతుంది. ఈ ఏడాది జనవరి నుండి దాదాపు 6.92 లక్షలమంది అఫ్ఘానిస్థాన్‌కు తిరిగి వెళ్ళిపోయారు. వీరిలో 70 శాతం మందిని ఇరాన్ ప్రభుత్వమే బలవంతంగా తిప్పిపంపింది. ఇటీవలి వారాల్లో ఇరాన్ నుండి స్వదేశం చేరుకున్న ఆఫ్గన్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఐక్యరాజ్యసమితి మైగ్రేషన్ ఏజన్సీ తెలియజేసింది. అధికారిక పత్రాలులేనివారంతా జులై ఆరోతేదీ లోపు దేశం విడిచి వెళ్ళిపోవాలని తుది గడువు నిర్దేశించినట్లు ఇంతకుముందే ఇరాన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జూన్ 1 నుండి 28వ తేదీ వరకూ 2,33,941 మందిని అఫ్ఘానిస్థాన్‌కు ఇరాన్ తిప్పిపంపిందని అంతర్జాతీయ వలసల సంస్థ అధికార ప్రతినిధి అవంద్ అజీజ్ చెప్పారు. జూన్ 21 నుండి ఎనిమిది రోజుల వ్యవధిలో రికార్డుస్థాయిలో 1,31,900 మంది ఇరాన్ వదిలివెళ్ళిపోయారని చెప్పారు. కొద్దిరోజులుగా ఇలా తిరిగి వెళ్ళిపోతున్నవారిసంఖ్యరోజుకు 30,000వేలుగా నమోదైనట్లు అధికారులు చెప్పారు. పశ్చిమ అఫ్ఘానిస్థాన్ సరిహద్దు కేంద్రం క్యాబాకు బస్సులను భారీసంఖ్యలో ఇరాన్ ప్రభుత్వం నడుపుతున్నది. ఇలా వెళ్ళిపోతున్నవారిలో వ్యక్తులు త క్కువగా ఉండగా కుటుంబాలేఎక్కువగా ఉన్నాయి. భార్యాభర్త, పిల్లలు, ఇతర సామాగ్రితో తరలివెళుతున్నారు. ప్రపంచంలో అత్యంత పేదరికదేశమైన ఆఫ్ఘానిస్థాన్ నుండి లక్షలమంది ప్రజలు ఉపాధికోసం, మనుగడకోసం ఇరాన్, పాకిస్థాన్ దేశాలలోకి అక్రమంగా చొరబడుతున్నారు. దశాబ్దాలుగా జరుగుతున్న యుద్ధ వాతావరణం నుండి గడచిన నాలుగు సంవత్సరాలుగా ఆఫ్ఘానిస్థాన్ క్రమంగా ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నది. ఆఫ్ఘానిస్థాన్ విదేశాంగమంత్రి అమిర్ ఖాన్ ముత్తాఖీ వలస ప్రజలు తిరుగుముఖం పట్టడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రెండు దేశాలమధ్య ఈ విషయంలో ఒక సమన్వయపూర్వకమైన యంత్రాంగాన్ని ఏర్పాటుచేసి హడావుడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఇరాన్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకించి ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం వల్ల ప్రజలు గణనీయంగా స్వదేశం చేరుకున్నారు. సమియుల్లా అహ్మదీ (28) అనే యువకుడు మాట్లాడుతూ మొదటిసారి తాను తన మాతృదేశం ఆఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లోకి అడుగుపెట్టానని వ్యాఖ్యానించారు. ''నేను ఇరాన్‌లోనే పుట్టాను, కానీ అక్కడ ఆఫ్ఘానిస్థాన్ ప్రజల పరిస్థితి ఎలా ఉందంటే, మీరు ఎంత మంచివారనేది ముఖ్యం కాదు, మీ దగ్గర సరైన అర్హత పత్రాలు ఉన్నాసరే మీకు ఇరానీ ప్రజలు ఎంతమాత్రం గౌరవం ఇవ్వరు'' అని ఆవేదన వ్యక్తం చేశారు.





## గాజా స్ట్రిప్‌లో బాంబుదాడులు

### ఇళ్ళు వదలిపోతున్న వందలాది పాలస్తీనా కుటుంబాలు



**గాజా :** గాజాస్ట్రిప్ వ్యాప్తంగా ఇజ్రాయెల్ భారీ ఎత్తున బాంబుల వర్షం కురిపిస్తుంటేవందలాది పాలస్తీనా కుటుంబాలు నిరాశ్రయం అవుతున్నాయి. యుద్ధం మొదలైన తర్వాత ఎన్నడూ లేనివిధంగా, ఇళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రజలు దిక్కుతోచక ఇళ్ళు వదలి ఎక్కడికో తెలియని గమ్యానికి బయలుదేరారని ప్రత్యక్ష సాక్ష్యులు చెప్పారు. గాజా నగరంలో అల్ అహ్లి ఆసుపత్రిలో పెద్దసంఖ్యలో చికిత్సలు తీసుకుంటున్న గాయపడిన రోగులు ఆసుపత్రి వదలి బయలుదేరారు.అదేసమయంలోఐదుగురుమృతదేహాలను సహాయబృందాలు స్వాధీనం చేసుకున్నాయి. సుజైయా, తుఫ్ఫాహ్, జైతౌన్ లలో గగనతలం నుండి భారీ ఎత్తున బాంబుదాడులు చేస్తుంటే ఎటూ పాలుపోని కుటుంబాలు మునుపెన్నడూలేని రీతిలో ఇళ్ళు వదలి వెళుతున్నాయి. దీనిని సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ అవుతున్నాయి. ఉత్తర గాజా నుండి ప్రజలు ఇళ్ళు వదలివెళ్ళిపోవాలని ఐడిఎఫ్ ముందుగానే ప్రకటనలు గుప్పించింది. గాజాలో శాంతి ఒప్పందం చేసుకోవాలని, సంధి చేసుకోవాలని నెతన్యాహూపై ట్రంప్ నుండి ఒత్తిడి పెరుగుతున్న తరుణంలో తిరిగి బాంబుదాడుల హోరు ఉద్ధృతమైపోయింది. ఆదివారంనాడు ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో కనీసం 81 మంది మరణించారు.



**అమెరికాకు ఇరాన్ మంత్రి షరతు**

## చర్చలు కావాలంటే నోరు అదుపులో పెట్టుకోండి

**టెహ్రాన్ :** దాడులు చేస్తామంటూ తరచుగా చేస్తు న్న ప్రకటనలు మానుకోవాలని అమెరికా ప్రభుత్వానికి ఇరాన్ విదేశాంగశాఖ డిప్యూటీ మంత్రి మాజిద్ తఖ్త్ రావంచి షరతు విధించారు. సోమవారంనాడు ఆయన అమెరికన్ వార్తాసంస్థతో మాట్లాడుతూ, తదుపరి ఇరాన్‌లో అణు చర్చలు జరపాలని అమెరికా గనుక ఆశపడుతున్నట్లయితే, ఇకమీదట ఇరాన్‌పై దాడులు చేస్తామంటూ చేసే ప్రకటనలు కట్టిపెట్టాలని కోరారు. నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. ఇరాన్‌తో త్వరలో మళ్ళీ చర్చలు ఉంటాయని ట్రంప్ నాలుగురోజుల క్రితమే ప్రకటించారు. ఈ వారంలోనే చర్చలకు తిరిగి రావాలని మధ్యవర్తుల ద్వారా ట్రంప్ ఇరాన్‌కు చెప్పారని, కానీ చర్చలు జరగాలంటే, ఇరాన్‌పై దాడుల గురించి ప్రకటనలు లేకుండా తగిన హామీ ఉండాలని, ఇంత ముఖ్యమైన అంశం మీద తన వైఖరిని ట్రంప్ స్పష్టం చేయడంలేదని తఖ్త్ రావంచి అన్నారు. జూన్ 21వ తేదీన ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు చేసి అమెరికా ప్రత్యక్షంగా యుద్ధరంగంలోకి దిగింది. ఇరాన్ ప్రతిదాడులు ప్రారంభించిన తర్వాత కాల్పుల విరమణ ప్రకటనలు ట్రంప్ నుండి వెలువడ్డాయి. ఆ తర్వాత కూడా ఇరాన్‌పై దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరికలు గుప్పిస్తూనే చర్చలకు రావాలని ఇరాన్‌పై ఒత్తిడి చేస్తున్న దశలో ఇరాన్‌మంత్రి పైవిధంగా స్పందించారు. అదేవిధంగా అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ)కు ఎలాంటి సహకారం ఇవ్వకూడదని ఇరాన్ పార్లమెంటు గడచిన బుధవారంనాడు ఒక తీర్మానం చేసింది. ఐఎఇఎ డైరెక్టర్ జనరల్ గ్రాస్సీని కూడా ఇరాన్‌లోకి అడుగుపెట్టనీయకూడదనీ, తమ అణుశుద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కేంద్రాలలో నిఘా నేత్రాల ఏర్పాటును, పర్యవేక్షణను అనుమతించకూడదని పార్లమెంటు తీర్మానించింది. ఈ దశలో ఇరాన్–అమెరికా మధ్య ఆరో విడత చర్చలపై సందేహాలు రేకెత్తుతున్నాయి.

**ఇరాన్‌కు నజరానాలిచ్చేదిలేదు : ట్రంప్**

దాడుల గురించి పదేపదే మాట్లాడకూడదంటూ ఇరాన్‌మంత్రి తఖ్త్ రావంచి షరతు విధించిన తర్వాత సోషల్ మీడియా వేదికగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందించారు. అణు చర్చలకు వచ్చిన ఇరాన్‌కు ఎలాంటి నజరానాలూ ఇచ్చేదిలేదని అన్నారు. డెమోక్రటిక్ సెనేటర్ క్రిస్ కూన్స్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ స్పందిస్తూ, ఇరాన్‌కు నజరానాలు ఇస్తున్నామని ఆయన తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇరాన్‌లో అణు కేంద్రాలపై దాడులు చేసిన తర్వాత తాను ఇంతవరకూ ఆ దేశంతో మాట్లాడలేదని, ఎలాంటి సందేశం పంపలేదన్నారు. చర్చలకు రావాలని ట్రంప్ తమకు మధ్యర్తులతో సందేశం పంపారని ఇరాన్‌మంత్రి తఖ్త్ చెప్పడాన్ని తోసిపుచ్చారు.

## రాడార్‌లో హిడ్మా..?

(మొదటి పేజీ తరువాయి)

దేవా, కేంద్రకమిటీ సభ్యులు సుజాత, పుల్లూరి ప్రసాద్ రావ్‌లు ఉన్నారని అనుమానిస్తున్నారు. దీంతో హిడ్మా టార్గెట్‌గా భద్రతాదళాలు ఆపరేషన్ ప్రారంభించారు. ఈ క్రమంలోనే నేషనల్ ఏరియా పార్క్ నుంచి అబూజ్‌మడ్ కారిడార్ వరకు భద్రతా బలగాలు బృందాలుగా విడిపోయి అడవులను జల్లెడపడుతున్నాయి. ఆపరేషన్ కర్రిగుట్టల్లో పోలీసులకు హిడ్మా దొరికినట్టే దొరికి తప్పించుకున్నారు.బీజాపూర్‌తెలంగాణ సరిహద్దులైన కర్రెగుట్ట అడవుల్లో 21 రోజుల పాటు సాగిన ఈ ఆపరేషన్‌లో మావోయిస్టు ముఖ్య నేతలు మావోయిస్టు ప్రధాన కార్యదర్శి సంబాల కేవశరావు, తెలంగాణ రాష్ట్ర కమిటి సభ్యుడు భాస్కర్, కేంద్ర కమిటి సభ్యులు గాజర్ల రవి, జోనల్ కమిటి సభ్యురాలు అరుణ, సహాయకురాలు అన్జులతో పాటు సధనపల్లి చందు, సోడి నర్సింగ్‌రావు, అల్సు, దుగ్గా వెంకల్‌ను మరణించారు. ఇన్విటేషన్ అంబూష్ పేరిట వందల మంది జవాన్ల ఊచకోతకు కారణమైన హిడ్మా కారణమని భద్రతదళాలు భావిస్తున్నాయి. అలాగే హిడ్మాపై తెలంగాణ, ఛత్తీస్ ఘఢ్ సహా పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి, విధ్వంసకర ఘటనల్లో ఆయుధాల సరఫరాలో కీలకసూత్రధారిగా గుర్తించారు. ఇతనిపై ప్రభుత్వం కోటిన్నరకు పైగా రివార్డ్ ఉంది. హిడ్మా ఆచూకీ కోసం ఏళ్లనుంచి ఎన్ఐఏ, ఎస్ఐబి, ఐబి అధికారులు గాలిస్తున్నారు.ఇప్పటికే ఏడాదిన్నరలో 550 మందికి పైగా మావోలను మట్టుబెట్టి వేలాది మంది మావోలను సరెండర్ చేసి దండకారణ్యంలో భద్రతా దళాలు ఆధిపత్యం సంపాదించాయి. సారి హిడ్మాను తమ రాడర్ నుంచి వదిలే ప్రసక్తేలేదని భద్రతాదళాలు ధీమాగా ఉన్నాయి.

ఈ క్రమంలోనే భూఉపరితలానికి 1500 అడుగుల ఎత్తులో హైరెజల్యూషన్ కెమెరా డ్రోన్లతో హిడ్మా కదలికలను భద్రతబలగాలు పసిగడుతున్నాయి.

## చర్చలు ఎందుకు జరపదు?

(మొదటి పేజీ తరువాయి)

నక్సలైట్లను అంతం చేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రకటించడం దుర్మార్గమన్నారు. జూలై 4 వ తేదీన ఎల్‌బి స్టేడియంలో జరగనున్న గ్రామస్థాయి అధ్యక్షుల సమావేశం ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ జూలై 4న జరిగే కాంగ్రెస్ గ్రామస్థాయి అధ్యక్షుల సమావేశానికి ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొంటారని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షుల నుండి, మండల, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల రాష్ట్ర స్థాయి నేతల వరకు దాదాపు 25 వేల మంది ఈ సభలో పాల్గొంటారని చెప్పారు. కేంద్రంలో ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా ఖర్గే ఇక్కడకు వస్తున్నారన్నారు. ఎల్‌బి స్టేడియంను మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఎంఎల్ఎ దానం నాగేందర్, సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు రోహిణ్ రెడ్డి, టిజిసాట్ చైర్మన్ శివసేనరెడ్డి, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ వైస్ చైర్మన్ ఫహీం ఖురేషి తదితరులు పరిశీలించారు. సమావేశానికి వచ్చే ప్రతినిధులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని, స్టేజి, పార్కింగ్, విఐపి ఎంట్రెన్స్ తదితర ఏర్పాట్లను వారు కలియతిరిగి చూశారు.

## పూర్తిచేయండి

(మొదటి పేజీ తరువాయి)

అంశాలపై సిఎంతో సిపిఐ నాయకులు చర్చించారు. గ్రామ పంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ, ఆర్‌టిసి కార్మికుల సమస్యలతో పాటు ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అబ్దుల్లాపూర్‌మెట్, చేవెళ్ల, వరంగల్, భూపాలపల్లి, మేడ్చల్ ప్రాంతాలలో ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న పేద ప్రజలకు పట్టాలు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డిని కోరారు. పంచాయతీ వర్కర్స్, ఇతర అంగన్‌వాడి, మధ్యాహ్న భోజనం, చిన్న ఉద్యోగస్తులు అందరికీ ప్రతినెల జీతాలను వెంటనే అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌టిసిలో యూనియన్ ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్య ప్రక్రియను పునరుద్ధరించాలని, నిజాం షుగర్ ఫ్యాక్టరీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదే విధంగా 800 మెగా వాట్లు, 200 మెగావాట్లు థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు, కిన్నెరసాని జూ పార్క్, నియోజకవర్గ సమస్యలపై సిఎం రేవంత్ రెడ్డికి వివరించారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని సిపిఐ నేతలకు హామీ ఇచ్చారు.

## బిజెపికి ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా

### తన అనుచరులను బెదిరించారని ఆరోపణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ బిజెపిలో కీలక పరిణామం చోటుచేసుకుంది. గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ పార్టీకి రాజీనామా చేశారు. రాష్ట్ర బిజెపి అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతున్న సమయంలోనే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ నాయకత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన ఆయన, ఇకపై బిజెపిలో కొనసాగలేనని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే.. రాష్ట్ర బిజెపి అధ్యక్ష పదవి ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజాసింగ్ సోమవారం మధ్యాహ్నం తన మద్దతుదారులతో కలిసి నాంపల్లిలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ క్రమంలో తన అనుచరులను కొందరు నేతలు బెదిరించారని ఆయన ఆరోపించా రు. ఈ పరిణామంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తనరాజీనామా లేఖను కేంద్ర మంత్రి, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి అందచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజాసింగ్ పార్టీ అధిష్టానం పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం కేంద్రంలోని పెద్దలకు ఇష్టం లేదు. అందుకే ఇలాంటి పరిస్థితులు సృష్టిస్తున్నారన్నారు. అధ్యక్షుడిని ముందే నిర్ణయించుకుని, ఎన్నిక పేరుతో నాటకాలు ఆడుతున్నారు' అని ఆయన ఆరోపించారు. 2019 నుంచి పార్టీ కోసం ఎన్నో కష్టాలు పడ్డానని, పార్టీ కోసమే తాను ఉగ్రవాదులకు టార్గెట్‌గా మారానని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి తీసుకురావడం కోసం ఎంతో కష్టపడుతున్నామని, కానీ మాకు పార్టీలోనైనా సరైన గుర్తింపు దక్కడం లేదని వాపోయారు. ఇక బిజెపిలో కొనసాగలేనని.. మీకో దండం.. మీపార్టీకో దండం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ బిజెపి అధ్యక్షుడి గా రామచందర్‌రావు ఎంపిక షాకింగ్‌కి గురి చేసిందన్నారు. తాజా పరిణామంతో తెలంగాణ బిజెపిలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడినట్లయింది.

**వారి మౌనం అంగీకారంగా భావించవద్దు : బిజెపిపై రాజాసింగ్ సంచలన ట్వీట్...** గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ బిజెపికి రాజీనామా చేసిన అనంతరం 'ఎక్స్' వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ బిజెపి నూతన అధ్యక్షుడిగా ఒక పేరు ప్రచారంలోకి రావడంతో రాజాసింగ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పార్టీకి రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డికి అందజేశారు. అనంతరం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, చాలామంది మౌనంగా ఉన్నంత మాత్రాన దానిని అంగీకారంగా భావించవద్దన్నారు. 'నేను నా ఒక్కడి గురించే మాట్లాడటం లేదు. మనల్ని నమ్మి, మన వెంట నిలిచిన లెక్కలేనంత మంది కార్యకర్తలు, ఓటర్ల తరఫున మాట్లాడుతున్నాను. వారంతా ఈరోజు తీవ్ర నిరాశకు గురయ్యారు' అని రాజా సింగ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నమ్మకంతో పార్టీ వెంట నడిచిన కార్యకర్తలు, మద్దతుదారులు ప్రస్తుతం తీవ్ర నిరాశలో ఉన్నారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## రామచందర్ రావు (మొదటి పేజీ తరువాయి)

ఉంది. ముందుగా అనుకున్నట్లే రామచంద్రరావు ఎంపికకు ఒకే ఒక్క నామినేషన్ దాఖలు అయ్యేవిధంగా పార్టీ అగ్రనాయకులు వ్యవహరించా రు. ఎమ్మెల్యే రాజాసింగ్ పోటీకి ప్రయత్నించినా, ఆ తర్వాత ఆయన విరమించుకుని, ఏకంగా పార్టీకే రాజీనామా చేశారు. తెలంగాణ బిజెపి అధ్యక్ష ఎన్నికకు పార్టీ అధిష్టానం సోమవారం నామినేషన్లు స్వీకరించింది. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఎన్నిక ఇన్‌చార్జ్‌లు నామినేషన్లు స్వీకరించారు. సాయంత్రం 5 గంటలకు నామినేషన్ దాఖలకు గడువు ముగిసింది. రామచందర్‌రావు నామి నేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపిలు డికె.అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలు పాల్గొన్నారు. నామినేషన్ దాఖలకు గడువు ముగిసే సమయానికి రామచందర్‌రావు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక లాంఛనమైంది. అధికారక ప్రకటనే మిగిలింది. ఎన్నిక షెడ్యూల్ ప్రకారం జూలై 1న రాష్ట్ర నూతన అధ్యక్షుడి పేరును పార్టీ అధిష్టానం ప్రకటించనుంది. బిజెపి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా అధ్యక్ష ఎన్నికకు నామినేషన్ దాఖ లు చేసేందుకు పార్టీ కార్యాలయానికి వచ్చారు. నాటకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన నామినేషన్ దాఖలు చేయలేదు. బిజెపి అధ్యక్ష ఎన్నిక రేసులో మొదటి నుంచి ముందు వరుసలో ఉన్న ఎంపిలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్ చివరలో వైదొలిగారు. కేంద్ర నాయకత్వంతో రామచందర్ రావు వైపు మొగ్గు చూపడంతో వీరు అధ్యక్ష ఎన్నికకు నామినేషన్ దాఖలు చేయలేదు. దీంతో వారు పెట్టుకున్న ఆశలు అడియాశలు అయ్యాయి.

**విద్యార్థి నేత నుంచి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా..** ఎన్.రాంచందర్ రావు 1959 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లో జన్మించారు. రైల్వేడిగ్రీ కళాశాలలో విద్యార్థి యూనియన్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం కార్యదర్శిగా సేవలందించారు. అనంతరం బిజెవైఎం తొలి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఎల్‌ఎల్‌బి పట్టభద్రుడైన ఆయన హైకోర్టు న్యాయవాదిగా చేస్తున్నారు. బిజెపి లీగల్ సెల్ కన్వీనర్‌గా, జాయింట్ కన్వీనర్‌గా సేవలందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బిజెపి అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా కూడా పనిచేశారు. 2015 నుంచి 2021 వరకు పట్టభద్రుల ఎమ్మెల్సీగా పనిచేశారు.

### ఎపి బిజెపి అధ్యక్షుడిగా మాధవ్ పేరు ఖరారు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడి ఎంపిక కొలిక్కి వచ్చింది. అధ్యక్ష పదవికి మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ పేరును ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన.. గతంలో శాసన మండలిలో బిజెపి ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. ఆర్ఎస్ఎస్, బిజెవైఎంలో బాధ్యతలు నిర్వర్తించారు. మాధవ్.. బిజెపి సీనియర్ నేత, దివంగత చలపతిరావు కుమారుడు. ఆయన తండ్రి రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేశారు.

## పలువురి దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. కాగా ఈ ఘటనలో ఇప్పటికి 12 మంది మృతి చెందగా మరో 35 మందికి పైగా గాయపడ్డారు. అగ్ని ప్రమాదం పట్ల తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర సంఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు గవర్నర్ తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ మరియు కర్మాగారాల ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిషోర్‌తో మాట్లాడి బాధితులకు సాధ్యమైనంత సహాయం, ఉత్తమ వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఆయన సంతాపాన్ని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో చిక్కుకుని తీవ్రంగా గాయపడిన కార్మికుల ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడం బాధాకరమని అన్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికార యంత్రాంగాన్ని కోరారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులను ఆదేశించారు.

**సిపిఐ విచారం...** సంగారెడ్డి జిల్లా, పాశమైలారంలో సిగాచి రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో 12 మంది మరణించడం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరంలో ఎగిరి పడటమంటే పేలుడు ఎంత తీవ్రంగా ఉన్నదో అర్థమవుతుందన్నారు. ఈ ఘటనలో అనేక మంది క్షత్రగాత్రులయ్యారని, వారందరికీ ప్రభుత్వం నుండి ఉచిత చికిత్స అందించాలని కోరారు. చనిపోయిన కుటుంబాలకు, క్షత్రగాత్రులకు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని డిమాండ్ చేశారు.మృతి చెందిన వారికి సంతాపాన్ని, వారి కుటుంబాలకు సానుభూతిని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవాలనిసాంబశివరావు కోరారు.

## సిఎం రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

వివరాలు అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని సంబంధిత అధికారులకు సిఎం ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను కాపాడటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, గాయపడిన వారికి అత్యవసర వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సిఎం తెలిపారు. కాగా రియాక్టర్ పేలి ప్రమాదం జరిగిన సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు పాశమైలారం పారిశ్రామిక వాడలో సీగాచి కెమికల్స్ పరిశ్రమను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంగళవారం సందర్శించనున్నారు. ఉదయం 9 గంటలకు ఘటనాస్థలిని సందర్శించి ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తారు. అనంతరం పేలుడులో మరణించిన కార్మిక కుటుంబాలను సిఎం కలిసి ఓదార్చనున్నారు. పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కూడా సిఎం రేవంత్‌రెడ్డి పరామర్శించనున్నారు. ఇదిలా ఉండగా, క్షేత్రస్థాయిలో జరుగుతున్న సహాయక చర్యలను ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు అక్కడున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు అక్కడ జరుగుతున్న సహాయక చర్యలపై ముఖ్యమంత్రి డిజిపి, సిఎస్‌తో సమీక్ష నిర్వహించారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న సహాయక చర్యలను నిరంతరాయంగా కొనసాగించేందుకు, వాటిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వం తరఫున ఒక కమిటీని ఏర్పాటు చేశారు. సిఎస్ రామకృష్ణారావు అధ్వర్యంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ సిఎస్, లేబర్ డిపార్టుమెంట్ పిఎస్, హెల్త్ సెక్రెటరీ, ఫైర్ సర్వీసెస్ అడిషనల్ డిజిపి ఈ కమిటీలో సభ్యులుగా నియమించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలను సిఫారసు చేసే బాధ్యతలను ఈ కమిటీకి అప్పగించారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

## భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

గాయపడి ధ్రువ ప్రణామ్ హాస్పిటళ్లలో చికిత్స పొందుతున్న క్షత గాత్రులను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పరామర్శించారు. బాదిత పేషంట్ల ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లు మంత్రికి వివరించారు. బాదితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఇందుకు అయ్యే ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని డాక్టర్లకు మంత్రి సూచించారు. ట్రీట్‌మెంట్‌లో ఎటువంటి కాంప్రమైజ్ ఉండొద్దని ఆదేశించారు. బాదితుల ఆరోగ్యం కుదట పడే వరకు హాస్పిటల్స్‌లోనే ఉండి వారికి అవసరమైన వైద్య సహాయక సేవలు అందించాలని జిల్లా డిఎంహెచ్ ఓను ఇతర మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్లను మంత్రి ఆదేశించారు. చికిత్స పొందుతున్న వారి కుటుంబ సభ్యులను హాస్పిటల్ వద్ద మంత్రి పరామర్శించి వారిని ఓదార్చారు . జరిగిన ఘటన అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. బాదిత కుటుంబాలకు అండగా ఉంటామని వారికి మంత్రి భరోసా నిచ్చారు. చికిత్స అయ్యే ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని ఎవరూ ఆందోళన చెందొంద్దన్నారు. ఈ దుర్ఘటనలో గాయపడిన మృతి చెందిన వారి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. పాశమైలారం దుర్ఘటన జరిగిన కొద్ది సమయంలోనే ప్రభుత్వ యంత్రాంగం వేగంగా స్పందించి వార్ రూం పెట్టడం జరిగిందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. బాధితులను త్వరగా ఆసుపత్రికి తరలించారని, 12 మందికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారన్నారు. వారికి శ్వాసక్రియ ఇబ్బందికరంగా ఉందని చెప్పారు. పరిశ్రమల్లో భద్రతపై త్వరలోనే ఒక కమిటీ వేస్తామని, అధిక పనిగంటలపై కార్మికులు ఫిర్యాదు చేస్తే లేబర్ కమిషన్ దర్యాప్తు చేస్తుందని మంత్రి వివరించారు.

**సంగారెడ్డి కలెక్టరేట్లో కంట్రోల్ రూం ఏర్పాటు ...**

పారిశ్రామిక వాడలోని సిగాచి పార్మా పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాద బాదితులకు రక్షణ చర్యలు అందించడం కోసం సంగారెడ్డి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. ప్రమాద భాదితుల వివరాలు తెలుసుకోవడానికి వారికి తక్షణ సహాయ చర్యల కోసం 08455 276155 నెంబర్ తోకూడిన కంట్రోల్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తక్షణ సహాయ చర్యల కోసం ప్రమాద భాదితుల వివరాల కోసం ఈ నెంబరులో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

**పరిశ్రమల వద్ద భాదిత కుటుంబీకులు ఆందోళన**

పటాన్‌చెరు పాశమైలారం పరిధిలోని సిగారి పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగి పది గంటలు గడుస్తున్నా అందులో పనిచేస్తున్న తమ కుటుంబ సభ్యుల ఆచూకి తెలియడం లేదని కార్మికుల కుటుంబ ఆచూకి తెలియడం లేదని కార్మికుల కుటుంబ సభ్యులు పరిశ్రమ గేటు ఎదుట అందోళనకు దిగారు. అధికారులు వెంటనే స్పందించి వారి ఆచూకి తెలపాలంటూ రోదిస్తున్నారు. కంపెనీలో ఉదయం షిఫ్ట్‌లో 140 మందికి పైగా కార్మికుల సిబ్బంది పనిచేస్తుండగా అధికారుల లెక్కల ప్రకారం కేవలం 90 మంది మాత్రమే అని వెల్లడించారు. శిథిలాల కింద పది ఉన్నట్లు చెప్తున్నా అంతకు మించిన స్థాయిలో కార్మికుల ప్రమాదంలోచిక్కుకున్నట్లు తెలుస్తోంది . బిహార్, ఛతీష్ గడ్, ఓరిస్సా, ఆంద్రాకు చెందినవారు. కావడంతో వివరాలు తెలియడం లేదు. ప్రమాద విషయం తెలిసినకార్మికుల కుటుంబ సభ్యులు తమ వారి ఆచూకి కోసం అటు ఆసుపత్రిలో వెతుకుతూ ఇటు అధికారులను ప్రాదేయపడుతున్న దృశ్యాలు అందరిని కలచి వేస్తున్నాయి. అధికారులు సమాచారం అందజేయడలో విఫలమవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గుడుపుతున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## "ప్రభుత్వ పథకాలు, సామాజిక అభివృద్ధి, సాంస్కృతిక" అంశాలకు సలహా కమిటీ ఏర్పాటు

ప్రజాపక్షం/హైదరాబాద్: "ప్రభుత్వ పథకాలు, సామాజిక అభివృద్ధి, సాంస్కృతిక" అంశాలపైన తగిన సూచనలు చేసేందుకు ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అధ్యక్షులుగా 20 మందితో సలహా కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిటీ సభ్యులుగా రచయితలు, కవులు, కళాకారులు, ప్రముఖులు, విద్యా వేత్తలు ఉన్నారు. కాగా సలహా కమిటీకి తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక భాష డైరక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణను కన్వీనర్‌గా నియమించారు. ఈ మేరకు పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా సాంస్కృతిక ప్రచారం, సామాజిక పరిస్థితులను ఈ కమిటీ అధ్యయనం చేసి, ప్రభుత్వానికి పలు సలహాలు, సూచనలు ఇవ్వనుంది. **సభ్యులు:** డాక్టర్ జి. వి.వెన్నెల, ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల, సుద్దాల అశోక్ తేజ, బి.నర్సింగ్‌రావు, జయరాజ్, పల్లే నర్సింహ, సంగిశెట్టి శ్రీనివాస్, ప్రొఫెసర్ కోయి కోటేశ్వర్ రావు, డాక్టర్ పసునూరి రవీందర్, దరువు ఎల్లన్న, అంతడుపుల నాగరాజు, ఏపూరి సోమన్న, తదితరులు ఉన్నారు.

# ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాలు ఎండగట్టాలి

- 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు పెద్దఎత్తున భాగస్వాములవ్వాలి
- వామపక్ష నాయకుల పిలుపు భారత్ అసమానతల దేశంగా మారుతుందని ఆవేదన



ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం అవలభిస్తున్న ఉద్యోగ, కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాల ను నిరసిస్తూ 10 కేంద్ర కార్మిక సంఘా లు, జాతీయ స్థాయి స్వతంత్ర సమాఖ్యల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. ముఖ్యంగా అనేక త్యాగాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కుదించి 4 లేబర్ కోడ్ల రూపంలో అమ లు చేసేందుకు సిద్ధమైన బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు ఈ సమ్మెలో కార్మికులు, కర్షకు లు ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని వారు కోరా రు. సిపిఐ)ఎంరాష్ట్ర కార్యాలయం ఎన్‌బి భవన్‌లో సోమవారం వామపక్షా పార్టీల ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ల పల్లి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కళవేణి శంకర్, సిపి(ఐ) ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ(ఎం–ఎల్) మాస్ లైన్ సెక్రటేరియట్ సభ్యులు ఎం.హన్మేశ్, సిపిఐ(ఎం–ఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు సాదినేని వెంకటేశ్వరరావు, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనం సుధాకర్, సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేశ్ రాజా,ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి సి.హెచ్.మురహరి మాట్లాడారు.

ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పాలకులు విధానాల కారణంగా దేశంలో సంపద అంతా కొద్ది మంది చేతుల్లో పోగు పడి పోవడంతో సంపన్న భారత్, పేదల భారత్‌గా రెండు భాగాలుగా వీడిపోయి అసమానతల దేశంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.దేశ సంపదలో 10 శాతం సంపద మాత్రమే 80 శాతం ప్రజల వద్ద ఉండగా, 40 శాతం సంపద 10 శాతం మంది చేతులో కేంద్రీకృతమై ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా కార్మిక వర్గ శ్రమను పెట్టుబడిదారులు రాజ్యాంగ బద్దంగా లూటీ చేసే అవకాశం ఏర్పడుతోందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో అవుట్ సోర్సింగ్ పేరుతో 70 శాతానికి కాంట్రాక్టు విధానంలో పనిచేయిస్తూ శ్రమ దోపిడికి పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వమే కాదు రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆదే విధానాలను అవలభిస్తోందని విమర్శించారు. ఆర్థిక వృద్ధిలో దేశంలో ప్రపంచంలో నాల్గో స్థానంలో ఉందని గొప్పలు చెబుతున్న పాలకులు, ప్రజల కొనుగోలు సూచికలో 164 వ స్థానం, ఆకలి సూచికలో 101 వస్థానంలో ఎందుకు ఉందో సమాధానం చెప్పాలన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతూ కోట్లాది మంది కార్మికులకు కనీస వేతనాలు కూడ అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం విధానాలను ఎండగడుతూ ఈనెల9వ తేదీనతలపెట్టిన స్వారత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

జాన్ వెస్లీ మాట్లాడుతూ కార్మికుల సమ్మె చేసే హక్కును కాలరాస్తు 8 గంటల పనివిధానాన్ని మెల్లమెల్లగా 12 గంటలకు పెంచుతూ కార్మికుల హక్కులను పూర్తిగా యాజమన్యాలకు అప్పగించడంలో భాగంగా కార్మిక చట్టలను కుదించి 4 లెబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా కార్మిక వర్గానికీ కేంద్ర ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తోందన్నారు. అదేవిధంగా ఉపాధి హామి చట్టం అమలుకు రూ.2లక్షల కోట్లు అవసరం కాగా, కేవలం రూ.20వేల కోట్లను మాత్రమే కేటాయించడం ద్వారా ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర పనుతోందని, వీటన్నింటికి వ్యతిరేకంగా ఈ నెల 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్ని కేంద్ర ప్రభుత్వానికి ఓ హెచ్చరిక పంపాలని కోరారు.

హమ్మేష్, వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ దేశంలో లాభాల బాటలో పయనించడమే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పులిస్తూ పూర్తిగా ఆర్థిక పరిపుష్టితో ఉన్న ఎల్ఐసి రంగ సంస్థలో 10 శాతం విక్రయించడమంటే దేశ సంపదను ప్రైవేట్ శక్తులకు దోచి పెట్టడమేనన్నారు. ఇలాంటి అనేక ప్రజా వ్యతిరేఖ విధానాలను తిప్పికొట్టేందుకే నిర్వహించబోతున్న సార్వత్రిక సమ్మె కు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నాయని తెలిపారు.




# 'సమగ్ర సాంస్కృతిక విధానం' తేవాలి

## ప్రజానాట్య మండలి రాష్ట్ర సదస్సులో పలువురు వక్తల విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్ : మనిషి జీవన విధానం, ఆలోచనలు, ఆచారాలు, అలవాట్లు, కట్టుబాట్లు, మతం, సంప్రదాయాలు, కళ సాహిత్యాలు, భాష అన్ని అంశాల సమగ్ర స్వరూపమే సంస్కృతి అని, దీనిని చాటి చెప్పేందుకు సమగ్ర సాంస్కృతిక పాలసీని ప్రభుత్వం ప్రకటించాలని పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో 'సమగ్ర సాంస్కృతిక విధానం ప్రకటించాలి' అని డిమాండ్ చేస్తూ రాష్ట్రస్థాయి కవులు, కళకారుల సదస్సును నిర్వహించారు. తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టిజెఎస్ అధ్యక్షులు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ఇప్టా సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.టి.నరసింహ కళవేణ శంకర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా, ఉపాధ్యక్షులు ఉప్పలయ్య, లక్ష్మీ నారాయణ, అరసం కార్యదర్శి రాపోలు సుదర్శన్, అరసం రాష్ట్ర నాయకులు కెవిఎల్, నళిని, కాంగ్రెస్ సాంస్కృతిక శాఖ రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సమాజాన్ని మరింత ప్రగతి పథం వైపు తీసుకువెళ్లడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజన్యాటమండలి పనిచేయాలన్నారు. 1943లో ముంబాయిలో ఆవిర్భవించిన ఇప్టా నాటి నుంచి నేటి వరకు 'కళ కళ కోసం కాదు. ప్రజల కోసం' అనే నినాదంతో సమాజాన్ని సరైన మార్గంలో నడిపించేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రజల కష్టాల నుంచి పుట్టినవే ప్రజా కళలని, ఆ కళాల ద్వారా ప్రజల కష్టాలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లడం కూడా సంస్కృతిలో ఓ భాగమన్నారు. సమాజంలోని అభ్యుధయవాదులంతా కమ్యూనిస్టు భావజాలం కలవారేనని, వారి కళలతో, గళాలతో ఈ సమాజాన్ని చైతన్యవంతం చేశారని, చేస్తున్నారని అన్నారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ భావ వ్యాప్తిలో సాంస్కృతిక రంగానిదే కీలక పాత్ర అన్నారు. ప్రజలను జాగృతపరచడంలో ప్రజానాట్యమండలి నాటి నుంచి కీలక పాత్ర పోషించిందని, దానిని అదేవిధంగా కొనసాగించాలన్నారు. సమాజంలో విష సంస్కృతి పెచ్చరిల్లిపోతున్న నేపథ్యంలో కవులు, కళాకారులకు వ్యక్తీకరించే సంస్కృతిలో సృజనాత్మకత చాలా కీలకమని, దానిపైనే ప్రజా చైతన్యం ఆధారపడి ఉంటుందన్నారు. కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ దేశంలో సాంస్కృతిక విధానం ఉండాలని ఎప్పటి నుంచో ఇప్టా పోరాడుతోదని, రాష్ట్రంలో కూడా ఈ విధానంకోసం తెలంగాణ ప్రజానాట్యమండలి నడుం బిగించడం హర్షణీయమన్నారు. మనిషి పుట్టిన వెంటనే ఆట పాట పుట్టిందని, వారసత్వంగా వచ్చిన జనపద కళారూపాలకు పరిరక్షించుకునేందుకు సాంస్కృతిక పాలసీ ఎంతో ఉపయోగపడనుందన్నారు. అంతకు ముందు రాష్ట్రంలో సమగ్ర సాంస్కృతిక విధానం ప్రకటించాలని వివిధ కళా రంగాలకు చెందిన కళాకారులకు అన్ని సంక్షేమ పథకాలను లింక్ చేస్తూ ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీచేయాలని తదితర అంశాలతో తీర్మానాన్ని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రవేశపెట్టగా సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ వినతి పత్రాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి అందజేయనున్నట్లు పల్లె నర్సింహ్మా తెలిపారు.

## కమ్యూనిజాన్ని అంతం చేయలేరు : డాక్టర్ కె.నారాయణ



ప్రజాపక్షం/హైదరాబాద్ :నక్సలైట్లతో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్.కె. నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నక్సలైట్లను భౌతికంగా అంతమొందించగలరేమో కానీ ఆ భావాజాలాన్ని ఎవరూ అంతం చేయలేరన్నారు. ఇది దేశ రాజకీయ, సామాజిక అంశాలతో కూడిన అంశమని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నారాయణ ఓ వీడియో విడుదల చేశారు. 2026 మార్చి చివరి నాటికి నక్సలిజాన్ని అంతం చేస్తామన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు.




## ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో
# 2న చలో అమెరికా రాయబార కార్యాలయం ముట్టడి

ప్రజాపక్షం/హైదరాబాద్: భారతీయులపై అమెరికా దుర్మార్గపు చర్యలను ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈనెల 2న చలో అమెరికా రాయబార కార్యాలయం ముట్టడించనున్నట్లు ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ తెలిపారు. ఈ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం ఖైరతాబాద్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విధానాలు దేశానికి ప్రమాదకరమని, దేశాన్ని తిరోగమన దిశలో తీసుకెళ్లే విధానాలను అనుసరిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వత్తాసు పలుకుతూ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రతిష్టను దిగజార్చే చర్యలను దేశ పౌరులు తిప్పికొట్టాలన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల భారత్ –పాక్ యుద్ధాన్ని తానే ఆపానని చెప్పడం చూస్తే, మన దేశ ప్రతిష్టను మోదీ తాకట్టు పెట్టాడనడానికి ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. భారత పౌరులపై అమెరికా దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నా ప్రధాని అభ్యంతరం చెప్పక పోవడం సిగ్గుచేటన్నారు. మోదీ, ట్రంప్ వల్ల ఆయా దేశాలకు ఒరిగిందేమి లేదని వారు ఉద్ఘాటించారు. అందుకే ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చామని, రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద ఎత్తున యువజన సంఘ శ్రేణులు పాల్గొంటారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ ఖైరతాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు, కార్యదర్శి కాంపల్లి కళ్యాణ్, భగత్ సింగ్, నేతలు వంశీ,శేఖర్, బీమేష్, సుధాకర్, మధు, బాలరాజ్,రామ్ నాయుడు, నాగరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ మూకలకు అడ్డా బిఆర్‌ఎస్ కార్యాలయం

## ఎఐసిసి కార్యదర్శి ఎస్ఎ. సంపత్‌కుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్: "బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. నేరస్తులకు, రౌడీ మూకలకు అడ్డాగా మారింది. రాష్ట్రాన్ని విచ్చిన్నం చేసే కుట్రలు బిఆర్‌ఎస్ కార్యాలయం




నుంచే జరుగుతున్నాయి. బిఆర్‌ఎస్ కార్యకలాపాలు అక్కడి నుండి తరలించాలి. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన బిఆర్‌ఎస్ భవన్‌ను స్వాధీనం చేసుకోవాలి" అని ఎఐసిసి కార్యదర్శి ఎస్.ఎ. సంపత్‌కుమార్ అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత అభివృద్ధి తెలంగాణ సంప్రదాయం పెంపొందిస్తారని ఆనాడు ప్రభుత్వం భూమి కేటాయించిందని, అయితే గత 20 ఏళ్లలో బిఆర్‌ఎస్ భవన్‌లో ఏమి జరిగిందనే దానిపై ఆధారాలు సిద్ధం చేశామన్నారు. రాజకీయ పార్టీగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రజలకు చేరవేస్తారని ఆనాడు ప్రభుత్వం ఇచ్చిందని, కానీ నియమనిబంధనలకు విరుద్ధం గా బిఆర్‌ఎస్ భవన్‌లో కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. బిఆర్‌ఎస్ భవన్‌లో టివి ఛానెల్ నడిపించి యాంకర్ మరణాలకు కారకులు అవుతున్నారని పోలీసు కథనాలు స్పష్టం చేస్తున్నాయ ని, జర్నలిస్టు స్వేచ్ఛ మృతికి సంతోష్‌రావు సన్నిహితుడు పూర్ణ చందర్ కారణమని, తెలంగాణ ప్రభుత్వం రాయితీలను వెనక్కి తీసుకుని స్థలం స్వాధీనం చేసుకోవాలన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ ఖాతాలోకి కోట్లాది రూపాయల నిధులు ఏ రకం గా వచ్చాయనే విషయాన్ని ప్రభుత్వం తేల్చాలన్నారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డికి రాజకీయ పరిజ్ఞానం సైతం తక్కువేనన్నారు.

## గుడిసెలు లేకుండా చేయటమే
# ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

ప్రజాపక్షం/హైదరాబాద్: ఇందిరమ్మ ఇండ్లను నిర్మిం చడం ద్వారా రాష్ట్రంలో గుడిసెలు అనేవి లేకుండా చేయాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్వరాష్ట్రంలో సొంత ఇంటి కోసం నిరుపేదలు కన్న కలలు గత ప్రభుత్వ నిర్వాకంతో కలగానే మిగిలిపోయిందని ఆరోపించారు. నిరుపేదలకు గృహ వసతి కల్పించడంలో భారతదేశంలోనే తెలంగాణ రాష్ట్రం తలమానికంగా నిలిచేలా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. 'ఇందిరమ్మ ఇండ్ల'పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణంలో కొన్ని జిల్లాల పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉందని సూచించారు. దేశంలో ఏ ప్రభుత్వం కూడా రూ.5లక్షలతో ఇండ్లను నిర్మించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసే ఇండ్లతో సంబంధం లేకుండా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామన్నారు. పేదవాడికి మరింత చేయూతనివ్వాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలమేరకు ఒక్కో ఇంటికి 40 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తున్నామని వివరించారు.



ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున రూ.22,500 కోట్లతో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఇప్ప టి వరకు 3 లక్షల ఇండ్లను మంజూరు చేశామని వివరించారు. ఇందు లో 1 లక్షా 23 వేల ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ బిల్లులకోసం లబ్దిదారులు ఎదురు చూడాల్సిన పరిస్థితి లేకుండా ప్రతి సోమవారం నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లోకే నిధులను జమచేస్తున్నట్లు ఆయన పునరుద్ఘాటించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ కొలిక్కి వచ్చిన నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలని, ఇందుకు అవసరమైన స్థలాలను గుర్తించాలని, వీలైనంత త్వరలో పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని మంత్రి పొంగులేటి అధికారులకు సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ, తదితర పట్టణాలలో కూడా ఇదే విధానాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# హెచ్ఐవి బాధితులకు 'చేయూత పెన్షన్' మంజూరు

ప్రజాపక్షం/హైదరాబాద్: హెచ్ఐవి బాధితులు కొత్తగా నమోదు చేసుకున్న 14,084 మందికి 'చేయూత పెన్షన్'ను ప్రభుత్వం మంజూరు చేసింది. 2022 ఆగస్టు తర్వాత హెచ్ఐవి కేటగిరీలో కొత్తగా పెన్షన్లు మంజూరు కాలేదు. తాజాగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టిజి ఎస్ఎసిఎస్) ఆధ్వర్యంలో కొత్తగా నమోదై న 14,084 మందికి, వారి అర్హతలను నిర్ధారించిన అనంతరం సెర్ఫ్ ద్వారా పెన్షన్లు మంజూరయ్యాయి. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క సోమవారం 14,084 మంది హెచ్ఐవి బాధితులకు కొత్తగా చేయూత పెన్షన్లు మంజూ రు చేస్తూ దస్త్రంపైన సంతకం చేశారు. ఈ పెన్షన్లు జూలై నెల నుంచి లబ్ధిదారులు అందునున్నాయి. హెచ్ఐవి బాధితులు పూర్తి స్థాయిలో పనిచేయలేని స్థితిలో ఉండటంతో పాటు, వారిపై నెల నెలా అధికంగా వైద్య ఖర్చులు పడుతున్నా యి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పేదరికంతో బాధపడుతున్న హెచ్ఐవి బాధితుల జీవిత నాణ్యతను మెరుగుపరిచేందుకు చేయూత పథకం కింద ఈ సాయం అందించనున్నారు. ఇప్పటికే 34,421 మందికి నెలకు రూ.2016 చొప్పున పెన్షన్ అందుతోంది. ఇందుకు రాష్ట్రం నెలవారీగా రూ.6.93 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ నూతన లబ్ధిదారులకు ఈ ఆర్థిక సంవత్సరానికి అంచనా వ్యయం రూ.28.40 కోట్లు కాగా, కావాల్సిన నిధులు ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్నాయని అధికార వర్గాలు స్పష్టం చేశాయి.

ఇప్పటికే 4020 మంది డయాలసిస్ పేషెంట్లకు ఈ మద్యే పింఛన్ మంజూరు చేయగా.. తాజాగా హెచ్ఐవి బాధితులకు పింఛన్ మంజూరు చేయడంతో ఈ వర్గాలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపాయి.

**జిల్లాల వారీగా అర్హుల సంఖ్య:** హైదరాబాద్‌లో 3,019, నల్లగొండలో 1,388, ఖమ్మంలో 954, సూర్యాపేటలో 931, కరీంనగర్‌లో 833, ఆదిలాబాద్‌లో 482, భద్రాద్రి కొత్తగూడేంలో 556, హన్మకొండలో 825, జగిత్యాలలో 306, జనగాంలో 228, కామారెడ్డిలో 702, మహబూబ్‌నగర్‌లో 452, నిజామాబాద్‌లో 528, పెద్దపల్లిలో 567, సంగారెడ్డిలో 1242, సిద్దిపేటలో 527, వికారాబాద్‌లో 544. అయితే జయశంకర్ భూపాలపల్లి, గద్వాల్, మంచిర్యాల, మెదక్, ములుగు, నాగర్కర్నూల్, నారాయణపేట, నిర్మల్, రంగారెడ్డి తదితర జిల్లాల్లో కొత్తగా ఏ ఒక్కరు కూడా నమోదు కాలేదని అధికారులు తెలిపారు.

# బిఆర్‌ఎస్‌ను బద్నామ్ చేసేందుకే కుట్ర

## మాజీమంత్రి జగదీష్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన కర్మ తమకు పట్టలేదని, ఫోన్ ట్యాపింగ్ కేసు పనికి మాలిన కేసు అని, కాంగ్రెస్ ప్రభుత్వంలోని తప్పులను కప్పి పుచ్చుకునేందుకే బిఆర్‌ఎస్‌ను బద్‌నామ్ చేసేందుకు కుట్రకు పాల్పడుతోందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి ఆరోపించారు. పోలీస్ డ్రెస్ వేసుకుని దొంగ వచ్చిన్నట్టుగా, మిలిటరీ డ్రెస్ వేసుకుని ఉగ్రవాది వచ్చినట్టుగా మీడియా ముసుగు వేసుకుని తమను కాలుస్తున్నారని మండిపడ్డారు. ఆధారాలు లేకుండా వార్తలు రాసి తమ వ్యక్తిగత హననానికి పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ మాజీ ఎంపి లింగయ్య యాద వ్, ఎంఎల్‌సి కోటి రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎలు భాస్కర్ రావు, భిక్షమయ్య గౌడ్‌తో కలిసి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం, ఆంధ్రా నుంచి తెలంగాణ విడిపోవడం ఇష్టంలేని వాళ్ళు కెసిఆర్‌పైన కక్ష కట్టారని కెసిఆర్, కెటిఆర్ పైన ఒక పథకం ప్రకారమే మీడియా హౌజ్‌లు కుట్రపూరితమైన కథనాలను ప్రసారం చేస్తున్నాయని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ విషయాలు అధికారికంగా ఎక్కడైనా వెల్లడించారా? అని ప్రశ్నించారు. మహాన్యూస్‌పై దాడి జరిగిందని ఎవరికీ తెలియ క ముందే చంద్రబాబు స్పందించారని, ఆయన ముందస్తు ప్రణాళిక ఏమిటో దీనిని బట్టి అర్థమవుతోందన్నారు. ఇష్టమొచ్చినట్టు రాసి ఇదే జర్నలిజం అంటే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# రాహుల్ ఆలోచనలనే కేంద్రం అమలు చేస్తోంది

## రాజ్యసభ ఎంపి రేణుక చౌదరి

ప్రజాపక్షం/ఖమ్మం: రాహుల్ గాంధీ ఆలోచనలు చాలా గొప్పగా ఉంటాయని, అందుకే కేంద్రం రాహుల్ ఆలోచనలను అమలు చేస్తోందని రాజ్యసభ ఎంపి రేణుక చౌదరి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన విజయవంతం కావడంతో మోదీ దేశవ్యాప్తంగా చేసేందుకు ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారని, ప్రజాపాలనను చూసి ఓర్వలేని బిఆర్‌ఎస్ విమర్శలు చేస్తోందన్నారు. ఖమ్మం ఆడబిడ్డనైన నేను జిల్లాను ఎక్కడికీ వెళ్లలేదని, త్వరలో తన సత్తా ఏంటో చూపిస్తానన్నారు. ఎంతమంది మంత్రులున్నా రేణుక కూడా జిల్లాలో ఉంటుందని స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ నేతలకు పోలీసులు కల్పిస్తున్న ఎస్కార్ట్స్‌ను విరమించుకోవాలని అన్నారు. తెలంగాణాలో కవిత పర్యటనకు డబ్బులు ఎక్కడ్నుంచి వస్తున్నాయని, ఆమె వెనుకాల ఉన్నది ఎవరో తేలాలని అన్నారు. పహల్గాం ఉగ్ర దాడి చేసిన నలుగురుని ఇప్పటివరకు పట్టుకోక పోవడం ముమ్మాటికీ కేంద్ర వైఫల్యమే అన్నారు. సీజ్ ఫైర్‌తో పాకిస్తాన్ చర్చలు చేసిన కేంద్రప్రభు త్వం మావోయిస్టులతో చర్చలకు ఎందుకు ముందుకు రావడం లేదన్నారు.

ప్రక్క దేశాలైన నేపాల్, చైనాలతో శత్వం పొంచి ఉందని, దీనిని కేంద్రం అరికట్టడం లేదన్నారు. ఈ అంశాలన్నింటినీ పార్లమెంట్‌లో చర్చిద్దామంటే సమావేశాలు నిర్వహించడం లేదన్నారు. కేంద్ర వైఫల్యాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండగడుతుందనే ఉద్దేశ్యంతోనే పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడం లేదన్నారు. కేంద్రం కుట్రతో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం తో తెలంగాణకు అన్యాయం జరిగితే ఊరుకోబోమన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఇఇ, సర్కిల్-30, బేగంపేట్, సికింద్రాబాద్ జోన్.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

NIT No. 17/EE-30/SDZ/GHMC/2025-26, తేది: 28.06.2025 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారంలో ప్రచురితమైనది. వివరాలకు https://tender.eprocurement.gov.inలో లాగ్ఇన్ అయి చూడవచ్చు. ఈవెంట్ల తేదీల వివరాలు క్రింది విధముగా: **పని పేరు:** 2025 బోనాలు సందర్భంగా మహంకాళి ఆలయం - 1 పనిలో కార్మికులను నిమగ్నం చేయడం. **అంచనా విలువ:** రూ.0.96లక్షలు, **బిడ్స్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం / బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం:** 01.07.2025న మ.12.00గం.ల నుండి 04.07.2025న మ.12.05గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఇ.ఇ., సర్కిల్-30, జిహెచ్ఎంసి, సికింద్రాబాద్. సెల్ నెం. 7331181426 / 7995468066. **సంప్రదించవలసిన అధికారి చిరునామా:** శ్రీ సుబ్రమణ్య SVRNRD, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ - 30, బేగంపేట, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, బేగంపేట.

DIPR R.O. No. : 4392-PP/CL/ADVT/1/2025-26, Date: 30-06-2025

ప్రజాపక్షం
మంగళవారం, 01 జులై

# అమిత్ షా వితండవాదం

“ఆయుధాలు చేతబట్టిన వారితో చర్చలు జరపరాదన్నది మా విధానం. ఆయుధాలు విసర్జించండి–లొంగిపోండి. మీరు లొంగిపోకపోతే 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని తుద ముట్టించాలని మేము నిర్ణయించాం. ఆదివాసీలు, పోలీసులను చంపుతున్న నక్సలైట్లను చంపవద్దా”. ఇదీ కేంద్ర హోంశాఖ మాత్యులు అమిత్ షా పునరుద్ఘాటన. జాతీయ పసుపు బోర్డు ప్రారంభోత్సవానికై ఆదివారం నిజామాబాద్ ఆరుదెంచిన అమాత్యులు అక్కడ సభలో ప్రసంగిస్తూ పై విధంగా సెలవిచ్చారు. ఒక విధంగా అది సందర్భ రహిత ప్రస్తావన. పసుపు బోర్డు కోసం నిజామాబాద్ ప్రాంత రైతులు నాలుగు దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం ఫలించిన వేళ, హోంమంత్రి ఆ బోర్డు వల్ల రైతులకు కలిగే మేళ్ల గూర్చి, నరేంద్రమోదీ ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న పథకాల గూర్చి ఎంతైనా చెప్పుకోవచ్చు. వ్యవసాయాన్ని కార్పొరేటీకరించేందుకు మోదీ ప్రభుత్వం తెచ్చిన మూడు చట్టాలకు వ్యతిరేకంగా దేశ రైతాంగం ఢిల్లీ–పంజాబ్ సరిహద్దులో దాదాపు రెండు సంవత్సరాల పాటు సాగించిన ఎడతెగని ఆందోళన పర్యవసానంగా మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా తొలిసారి రైతులకు క్షమాపణలు చెప్పి ఆ చట్టాలను ఉపసంహరించుకుంది. ఆ సందర్భంగా పంటలకు మద్దతు ధరలకు చట్టబద్ధ రక్షణ (లీగల్ గ్యారెంటీ) ఇవ్వాలన్న రైతుల డిమాండ్ పట్ల సానుకూలత వ్యక్తం చేసింది. అయితే ఎగనామం పెట్టింది. ఆ డిమాండ్ సాధనకై రైతులు ఏడాదిన్నరగా తిరిగి ఆందోళన చేస్తున్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎట్టకేలకు చర్చలతో సాగతీత తప్ప నిర్దిష్ట చర్యలకు హామీ లేదు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ జాతీయ రైతు కమిషన్ సిఫారసు ప్రకారం మద్దతు ధరలు నిర్ణయించి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని 2014 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి మ్యానిఫెస్టోలో చేసిన వాగ్దానం తామరాకుపై రాతలాగే ఉంది. గడిచిన 11 సంవత్సరాల్లో–అనగా నరేంద్ర మోదీ ‘అచ్ఛేదిన్’ పాలనలో కార్పొరేట్ల ఆదాయం ఎన్ని వందల రెట్లు పెరిగిందో, రైతుల ఆదాయం ఎన్ని రెట్లు పెరిగిందో పోల్చి చెబితే బిజెపి–ఆర్ఎస్ఎస్ పాలన ఎవరి బాగుకు కంకణం కట్టుకుందో అర్థమవుతుంది. తప్పులు ఒప్పుకునే అలవాటు పాలక పార్టీకి లేదు కాబట్టి గొప్పలే చెప్పుకోవచ్చు. పసుపు బోర్డు ద్వారా పసుపు రైతులకు గిట్టుబాటు ధర ఎలా సమకూరుతుందో, అది రైతు సంక్షేమానికి ఎలా దోహదం చేస్తుందో చెప్పుకోవచ్చు.

కానీ మావోయిస్టుల ఏరివేతకు ఉద్దేశించిన ‘ఆపరేషన్ కగార్’ను విరమించి వారి నాయకులతో ప్రజాస్వామ్యయుతంగా చర్చలు జరపాలన్న డిమాండ్ తెలంగాణలో ఎక్కువగా వినిపిస్తున్నందున, తమ ఊచకోత వైఖరిని సమర్థించుకోవడానికి అమిత్ షా నిజామాబాద్ వేదికను ఉపయోగించుకున్నారు. నక్సలైట్ల హింసలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులు, ఆదివాసీల కుటుంబాలకు ఏమి జవాబు చెబుతారని నక్సలైట్లతో చర్చలు జరపాలని కోరే వారిని ఆయన ప్రశ్నించారు. ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధిని నక్సలైట్లు దశాబ్దాలుగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కాబట్టి లొంగిపోయి జనంలో కలవడమా లేక ప్రాణాలు కోల్పోవడమా? ఎంచుకోవాల్సింది నక్సలైట్లేనని అన్నారు.

ఇక్కడ రెండు అంశాలు ప్రశ్నించదగినవి. కేంద్ర ప్రభుత్వం ఈశాన్య భారత్‌లో అనేక తిరుగుబాటు గ్రూపులతో చర్చలు జరుపుతున్నది. నాగాలతో దశాబ్దాలుగా చర్చలు సాగుతున్నాయి. తాజాగా మణిపూర్‌లో తిరుగుబాటు శక్తులతో చర్చలు జరుపుతున్నది. వారందరికీ ‘ఆయుధాలు విసర్జిస్తేనే చర్చలు’ అని షరతు పెట్టారా? ముందుగా ఆయుధాలు విడనాడటమంటే లొంగిపోవటమే కదా! ఇక మావోయిస్టుల డిమాండ్లపై చర్చల అవసరమేముంటుంది? పరస్పర అవగాహన నిమిత్తం మధ్యవర్తుల ద్వారా ప్రాథమిక చర్చలు జరగాలి. ప్రధాన డిమాండ్లపై చర్చలు, అంగీకారాల్లో భాగంగా ఆయుధాల విసర్జన ఎజెండాలోకి సహజంగానే వస్తుంది. అదేమి లేకుండా ‘లొంగిపోండి లేదా చంపుతాం’ అనే విధానం రాక్షసం కాదా? ఇక రెండో అంశం, ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి. మోదీ–అమిత్ షా మార్క్ అభివృద్ధి ఆదివాసీల కోసమా, బహుళ జాతి కంపెనీల కోసమా? ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లోని ఖనిజ, అటవీ సంపదపై తొలి హక్కు ఎవరిది? ఆదివాసీలది కాదా? అటువంటి విధానమేదైనా ప్రకటించారా? లేదే! ఇక ఆదివాసీలను చంపటం–అందులో పోలీసులదే పైచేయి. ఆదివాసీలను చంపడమే నక్సలిజమైతే అది అడవుల్లో ఆదివాసీల మధ్య అర్ధ శతాబ్దం పైగా బతికేదా? ఇన్‌ఫార్మర్ల పేరుతో వారు కొందరిని చంపి ఉండవచ్చు. రాజ్యహింస, నక్సలైట్ల హింస ఇప్పుడు చర్చనీయాంశాలు కావు. భూమి, ప్రకృతి వనరులు, ఆదివాసీల అభివృద్ధి వగైరా చర్చనీయాంశాలు కావాలి. శాంతిస్థాపన అవసరం. కేంద్రం పునరాలోచించాలి.

# లౌకికవాదం, సోషలిస్టు పదాలపై ఏమి నాటకాల్రా బాబూ

## సుప్రీం కోర్టు తీర్పును ధిక్కరిస్తున్న ఆర్‌ఎస్ఎస్, బిజెపి నిబంధనావళి నుంచి తొలగిస్తారా !



ఎం.కోటేశ్వరరావు

రాజ్యాంగ పీఠికలో ఉన్న లౌకికవాదం, సోషలిస్టు అనే పదాల గురించి పునరాలోచించాల్సిన తరుణం ఆసన్నమైందని ఆర్‌ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే పిలుపునిచ్చారు. దేశంలో అత్యవసర పరిస్థితి విధించి 50ఏండ్లు గడచిన సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఒక సభలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్య క్రమాన్ని పక్కన పెట్టిన అత్యవసరపరిస్థితి కాలంలో 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ పదాలను రాజ్యాంగంలో చేర్చారని, తొలుత ఆమోదించిన దానిలో ఇవి లేవని చెప్పారు. సోషలిజం, లౌకికవాదాలను ఎన్నడూ ఆమోదించకపోవటమే కాదు తీవ్రంగా వ్యతిరేకించే ఆర్‌ఎస్ఎస్ నేత నుంచి ఇలాంటి ప్రతిపాదన రావటం ఆశ్చర్యం కాదు. కేశవానంద భారతి–కేరళ రాష్ట్రం మధ్య నడచిన వివాదం (1973) తీర్పులో రాజ్యాంగ వ్యవస్థ మౌలిక ఉపదేశంలో మౌలిక భావనలైన లౌకికవాదం, సోషలిజాలకు సంబంధించిన వాటిని మార్చటానికి వీల్లేదని ప్రవచించినట్లు సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఆ తరువాత 42వ రాజ్యాంగ సవరణ ద్వారా వాటిని నిర్దిష్టంగా చేర్చారు. ఎస్ఆర్ బొమ్మయ్–కేంద్ర ప్రభుత్వం మధ్య నడచిన వివాదం (1994)లో లౌకికవాదం రాజ్యాంగ మౌలిక అంశమని, రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు దానిని మార్చటానికి వీల్లేకుండా చేసిందని తొమ్మిదిమంది సభ్యులుగల సుప్రీంకోర్టు రాజ్యాంగధర్మాసనం తీర్పు చెప్పింది. రాజ్యాంగ పరిషత్ సభ్యులు మన రాజ్యాంగంలో ఉండాల్సిన అంశాల చర్చలో తడమని అంశం లేదంటే అతిశయోక్తి కాదు. అనేక భిన్నాభిప్రాయాలు, రాజీల తరువాత ఒక రాజ్యాంగాన్ని ఆమోదించారు. లౌకిక వాదం గురించి ఆ చర్చలో జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిందేమిటి? “లౌకిక రాజ్యం... అర్ధ సారం ఏమిటంటే ఏ ఒక్క మతమూ ఏది ఏమైనా రాజ్యం నుంచి ఎలాంటి ప్రోపకము పొందకూడదు. ఈ విషయంలో మనం ఎంతో జాగ్రత్తగా ఉండాలి. మన ఈ గడ్డమీద ఏ ఒక్కటి ఏమతమైనా అనుసరించటానికి, చెప్పటానికి మాత్రమే కాదు ప్రచారం చేయటానికి కూడా హక్కు నిరాకరించకూడదు” అన్నారు. అనటం లేని సారి ఆమోదించిన రాజ్యాంగంలో ఈ మేరకు రాజ్యాంగంలో లౌకికవాదం అనే పదమే అసలు లేనట్లు ఆర్‌ఎస్ఎస్ పెద్దలు జనాన్ని నమ్మించ చూస్తున్నారు. అనేక అంశాలను ఆర్టికల్ 25లో క్రోడీకరించారు. దానిలోని క్లాజ్ 2(ఎ)లో లౌకికవాద ప్రస్తావన ఉంది. అలాంటి దానిని సమీక్షించాలని ఆర్‌ఎస్ఎస్ చెబుతోంది. దోపిడీ రహిత సమాజం గురించి అనేక మంది ప్రతిపాదించారు, దానికి సోషలిజమని పేరు పెట్టలేదు తప్ప రాజ్యాంగం ఆదేశక సూత్రాలలో చేర్చిన అంశాల సారమదే. సోషలిజాన్ని వ్యతిరేకించేవారు ఆదేశిక సూత్రాలను కట్టుబడి ఉంటారన్న హామీ ఏముంది ?

అసలు ఆర్‌ఎస్ఎస్ రాజ్యాంగాన్ని, జాతీయ పతాకాన్ని కూడా ఆమోదించలేదు. రెండవ సర్వసంఘసంచాలక్ ఎంఎస్ గోల్వాల్కర్ తన బంచ్ ఆఫ్ థాట్స్ అనే గ్రంథంలో మనది అని చెప్పుకొనే అంశం మన రాజ్యాంగంలో ఒక్కటీ లేదని రాశారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన తరువాత ఆర్‌ఎస్ఎస్ పత్రిక ఆర్గనైజర్ 1949 నవంబరు 30వ తేదీ సంచికలో పురాతన భారత్‌లో ఉన్న రాజ్యాంగాన్ని ప్రస్తావించకుండా విస్మరించారని, శతాబ్దాల తరబడి ఆదరిస్తూ, అభిమానించిన మను స్మృతిలో వర్ణించిన మను చట్టాలను విస్మరించారని సంపాదకీయంలో ధ్వజమెత్తింది. మను కాలం నాటి రోజులు అంతరించాయని అంబేద్కర్ చెప్పారు. కానీ అంతిమంగా మనుస్మృతి మాత్రమే హిందువులకు సాధికారత ఇస్తుందని అదే ఆర్గనైజర్ పత్రిక 1950 ఫిబ్రవరి ఆరవ తేదీ సంచికలో రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి శంకర్ సుబ్బ అయ్యర్ రాసిన వ్యాసాన్ని ప్రచురించారు.

1975 జూన్ 25న ప్రకటించిన అత్యవసరపరిస్థితి 1977 మార్చి 21వ తేదీ వరకు అమల్లో ఉంది. అంతర్గత కల్లోలం, విదేశీ ముప్పు పరిస్థితుల కారణంగా రాజ్యాంగంలోని 352 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ ప్రకటించారు. రాజకీయంగా తనను వ్యతిరేకించిన వివిధ రాజకీయపార్టీలు, సంస్థలకు చెందిన 1,10,806 మందిని ఇందిరా గాంధీ జైలుపాలు చేశారు. 1971లోకసభ ఎన్నికలలో రాయబరేలీ నియోజకవర్గం నుంచి గెలిచిన ఆమె ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని సోషలిస్టు పార్టీ తరఫున పోటీ చేసిన రాజనారాయణ్ కోర్టును ఆశ్రయించారు. తొలిసారిగా మనదేశంలో ఒక ప్రధాని హైకోర్టులో దాదాపు ఐదుగంటల పాటు బోనులో నిలబెట్టి విచారించటం అదే ప్రథమం. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జగ్‌మోహన్ సిన్హా 1975 జూన్ 12న ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదని తీర్పునిచ్చారు. ఆ తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేశారు. జస్టిస్ వికార్ కృష్ణయ్యర్ ధర్మాసనం జూన్ 24న హైకోర్టు తీర్పును సమర్ధించింది. అయితే ఏ సభలో సభ్యురాలు కాకపోయినా ఆరునెలపాటు ఆమె ప్రధాని పదవిలో కొనసాగవచ్చని అవకాశం ఇచ్చారు. దాన్ని అవకాశంగా తీసుకొని మరుసటి రోజే అత్యవసరపరిస్థితిని విధించారు. 1976 నవంబరులో మాదవరావు మూలే, దత్తోపంత్, మోరోపంత్ పింగ్లే వంటి 30 మంది ప్రముఖులు తమ ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలను జైలు నుంచి విడుదల చేస్తే ప్రభుత్వానికి మద్దతు ఇస్తామని ప్రతిపాదించారు(వికీపీడియా). ఆ లొంగుబాటు పత్రం ప్రకారం 1977 జనవరిలో వారు విడుదల కావాల్సి ఉంది. దాన్ని నాటి కీలక అధికారి హెచ్‌వై శారద ప్రసాద్ ఆమోదించారు. ఇదే ఆర్‌ఎస్ఎస్ అత్యవసర పరిస్థితి వ్యతిరేకంగా పోరాడిన తీరు. అయితే కొంత మంది లొంగుబాటును వ్యతిరేకించారని కూడా చెబుతారు. నిజమేమిటో ఆర్‌ఎస్ఎస్ అధికారికంగా చెప్పాల్సి ఉంది.

నిత్యం కుహనా లౌకికవాదం అని, సోషలిజం మీద విషం గక్కుతున్నారంటే ఆచరణలో వారు రాజ్యాంగాన్ని ధిక్కరిస్తున్నట్లే. అది దేశ ద్రోహంతో సమానం. బిజెపిని కన్నతల్లి ఆర్‌ఎస్ఎస్ అన్నది జగమెరిగిన సత్యం. జనతా పార్టీ లేదా ఆర్‌ఎస్ఎస్ ఏదో ఒకదానిలో మాత్రమే సభ్యులుగా ఉండాలని ద్వంద్వ సభ్యత్వం కూడదన్న వివాదం వచ్చినపుడు ఆ సంస్థతో బంధం తెంచుకోవటానికి తాము సిద్ధం కాదని కావాలంటే జనతా పార్టీ నుంచే వైదొలుగుతామని ప్రకటించి బిజెపిని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు హోసబలే లౌకికవాదం, సోషలిజం గురించి సమీక్షించాలని ప్రతిపాదించారంటే అది బిజెపికి కూడా వర్తిస్తుంది. ముందుగా బిజెపి నిబంధనావళి నుంచి దాన్ని తొలగించవచ్చు, కానీ ఆ పని చేయకుండా మొత్తం రాజ్యాంగానికే ఎసరు పెడుతున్నారంటే దాని వెనుక ఉన్న కుట్ర గురించి వేరే చెప్పనవసరం లేదు. బిజెపి చెప్పలేని అంశాలను ఆర్‌ఎస్ఎస్ నేతల ద్వారా పలికించటం ఒక ఎత్తుగడ. జనంలో వచ్చిన స్పందన అనుకూలమా ప్రతికూలమా అని సరిచూసుకోవటం గతంలో జరిగింది, ఇప్పుడూ ఆ నాటకమే మొదలెట్టారు.

రాజకీయాలతో నిమిత్తం లేని ప్రముఖులతో ఏర్పాటు చేసే కమిటీ ద్వారా రిజర్వేషన్లను సమీక్షించాలని ఆర్‌ఎస్ఎస్ అధిపతి మోహన భగవత్ 2015లో ప్రతిపాదించారు. అది పెద్ద వివాదాన్ని రేపింది. తరువాత 2017లో మరో నేత మన్మోహన్ వైద్య భిన్న నేపథ్యంలో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు నిర్ణయించారని, అంబేద్కర్ కూడా అవి నిరవధికంగా కొనసాగటం అభిలషణీయం కాదు, ఒక పరిమితి ఉండాలని చెప్పారంటూ అంబేద్కర్ భుజం మీద తుపాకితో కాల్చాలని చూశారు. అది రాజకీయంగా బిజెపికి నష్టం అని జనంలో వచ్చిన స్పందనను చూసిన తరువాత తాము రిజర్వేషన్లను సమర్ధిస్తున్నామని, వివక్ష ఉన్నంత వరకు కొనసాగాలని పదే పదే ప్రకటనలు చేశారు. బిజెపి నేతలు అంబేద్కర్ గురించి ఇటీవలి కాలంలో ఎక్కడ లేని ప్రేమ ఒలకబోస్తున్నారు. పదే పదే ఆయన భజన చేస్తున్నారు. చిత్రం ఏమిటంటే మహాత్మాగాంధీ కాదు అసలైన మహాత్ముడు హంతకుడు గాడ్సే అని సంఘపరివార్ దళాలు నిత్యం ప్రచారం చేస్తాయి. తమ పార్టీ మౌలిక సూత్రంగా మానవతావాదం ముఖ్యమైనదిగా ఉంటుందని బిజెపి నిబంధనావళి చెప్పింది. పార్టీ జాతీయవాదం, జాతీయ సమగ్రత, ప్రజాస్వామ్యాలతో పాటు దోపిడీ రహిత సమసమాజ స్థాపన కోసం ఆర్థిక, సామాజిక సమస్యలపై గాంధీయిస్టు వైఖరిని అనుసరిస్తామని కూడా పేర్కొన్నది. సానుకూల లౌకిక వాదం అంటే సర్వధర్మ సంభవం అని మరియు విలువలతో కూడిన రాజకీయాలకు కట్టుబడి ఉన్నామని చెప్పింది. ఎక్కడా బాబాసాహెబ్ అంబేద్కర్ వాంఛించి ప్రవచించిన కులరహిత లేదా కులవివక్ష లేని సమాజం కోసం లేదా అంబేద్కర్ భావజాలానికి కట్టుబడి ఉన్నామనే మాటే లేదు. ఇదీ అంబేద్కర్ పట్ల దాని నిజవైఖరి.

> ఇక లౌకికవాదం, సోషలిస్టు పదాల గురించి బిజెపి, ఆర్‌ఎస్ఎస్ బండారం ఏమిటో చూద్దాం. వాటిని సమర్ధిస్తూ మాట్లాడిన ఆ సంస్థల నాయకులను ఎవరైనా చూశారా? భారతీయ జనతా పార్టీ నవీకరించిన(2012) నిబంధనావళి పత్రం ఇప్పుడు ఆ పార్టీ వెబ్‌సైట్‌లో అందరికీ అందుబాటులో ఉంది. మొదటి పేజీలోనే లౌకిక–వాదం, సోషలిజం, ప్రజాస్వామ్యాలకు కట్టుబడి ఉన్నట్లు రాసుకున్నారు.

నిజానికి కుల, మత రహిత సమాజం కాషాయ దళాల అజెండాలోనే లేదు. పక్కా హిందుత్వ ఛాంపియన్లమని గల్లీ నుంచి ఢిల్లీ నేతల వరకు రోజూ చెప్పటాన్ని చూస్తున్నాము. కులగణనను వ్యతిరేకించి చివరకు చేపడతామని చెప్పింది. బిజెపి ముందు రూపమైన జనసంఘం నేత దీనదయాళ్ ఉపాధ్యాయ 1965లో సమగ్రమానవతావాదం పేరుతో రాసిన గ్రంథంలో పేర్కొన్న ప్రకారం “నాలుగు కులాల(చాతుర్వర్ణ)పై మా దృక్పథం ప్రకారం అవి విరాట పురుషుని భిన్నమైన నాలుగు భాగాల(లింబ్స్‌శాఖల)తో సమానమైనవి. అవి ఒక దానికొకటి సహకరించుకొనేవి మాత్రమే కాదు. దేని ప్రత్యేకత దానిదిగా ఉండటంతో పాటు ఐక్యంగా ఉంటాయి, దేనికదే స్వతంత్రమైన గుర్తింపు, అభిరుచి కలిగి ఉంటాయి” అంటే ఉన్న మనువాద కులవ్యవస్థను కొనసాగించాలనటం తప్ప వేరే భాష్యం లేదు. 1990లో ప్రధాని విపి సింగ్ మండల్ కమిషన్ సిఫార్సుల అమలుకు పూనుకున్నపుడు ఆర్‌ఎస్ఎస్ పత్రిక ఆర్గనైజర్ సంపాదకీయంలో కులయుద్ధాలకు దారి తీస్తుందని రాశారు. పదమూడు సంవత్సరాల వయస్సులో ఆర్‌ఎస్ఎస్‌లో చేరిన దళితుడైన భన్వర్ మేఘవంశీ “నేను హిందువును కాలేను” అనే పేరుతో రాసిన పుస్తకంలో కులవ్యవస్థపట్ల ఆర్‌ఎస్ఎస్ వైఖరి గురించి అనేక అంశాలను లేవనెత్తారు. తన గ్రామానికి సంఘపరివార్ సభ్యులు వచ్చినపుడు వారికి తాను ఆహారాన్ని సిద్ధం చేయగా దాన్ని తినకుండా మూటగట్టి పారవేయటంతో ఆర్‌ఎస్ఎస్‌లో కుల తత్వం గురించి తనకు అవగతమైందని రాశారు. కొన్ని పదవుల్లో దళితులకు అవకాశం ఇవ్వరని, కేవలం ముస్లింల మీద దాడికి మాత్రమే తమను వినియోగించుకున్నారని కూడా పేర్కొన్నారు. అంబేద్కర్ గురించి నేరుగా చదివిన తరువాత బయటకు చెప్పిదానికి భిన్నంగా ప్రతిదీ సంఘపరివార్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని ముందుకు తీసుకుపోతామని బిజెపి నిబంధనావళిలో చేర్చకపోవటానికి కారణమిదే.

మనదేశంలో కులవ్యవస్థ, అంటరానితనం ఎందుకు ఉన్నదంటే కాషాయ దళాలు వెంటనే చెప్పే సమాధానం అరబ్, ఇస్లామిక్ దండయాత్రలే కారణం అంటారు. హిందూ స్వాభిమానాన్ని దెబ్బతీసేందుకు హిందూ ఖైదీలను చర్మం తీసేవారిగా, గొడ్డు మాంసం కొట్టే అంటరానివారిగా మార్చారని చెబుతారు. ఎనిమిదవ దశాబ్దం తరువాత ఇస్లామిక్ దండయాత్రలు ప్రారంభమై ఉత్తర ఆఫ్రికా, మధ్యఆసియా, మధ్యప్రాచ్యదేశాల్లో సాగాయి. పదకొండవ శతాబ్దంలో మనదేశం మీద జరిగాయి. ఇతర దేశాలలో కూడా అక్కడ ఉన్న ఏదో మతానికి చెందిన వారిని ఖైదీలుగా పట్టుకొని ఉంటారుగా వారినెందుకు అంటరానివారిగా మార్చలేదు? నరేంద్రమోదీ సర్కార్ ఎదుర్కొంటున్న సవాళ్లు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. అందుకే అంత్యవసర పరిస్థితి 50 ఏండ్ల సభ పేరుతో జనం దృష్టిని మళ్లించేందుకు రాజ్యాంగంలో సోషలిస్టు, లౌకికవాద పదాలను సమీక్షించాలన్న వివాదాన్ని రేపారు.

75 ఏండ్లు గడిచిన సందర్భంగా రాజ్యాం గం నుంచి ఆ రెండు పదాలను తొలగించాలని సుప్రీం కోర్టులో అనేక కేసులు దాఖలయ్యాయి. వాటి మీద సుదీర్ఘవిచారణ జరిపిన కోర్టు 2024 నవంబరు 25న ఇచ్చిన తీర్పులో ఆ కేసులను కొట్టివేసింది. తొలుత ఆమోదించిన రాజ్యాంగ పీఠికలో ఆ పదాలు లేవు గనుక వాటిని తొలగించాలనే వాదనలను తోసిపుచ్చింది. రాజ్యాంగబద్ధమే అని స్పష్టం చేసింది. ఆ తరువాత కూడా హోసబలే సమీక్ష చేయాలని అంటున్నారంటే ఆ తీర్పును కూడా అంగీకరించటం లేదన్నది స్పష్టం. అధికారం ఉంది గనుక ఏమైనా చేయగల సమర్థులు, ఏకంగా పార్లమెంటునే తగులబెట్టించిన హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుంటున్నవారు రాజ్యాంగానికి, న్యాయవ్యవస్థకూ ముప్పు తెచ్చినా ఆశ్చ ర్యం లేదు, జనం ఆలోచించాలి మరి !

# గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో సిబ్బంది ఇబ్బందులు



ఎస్.బాబు

భారతదేశంలో సుమారు 4,500కు పైగా గురుకులాలు ఉన్నాయి. తెలంగాణలో 1,022 గురుకులాల్లో సుమారు 6 లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అణగారిన వర్గాలైన షెడ్యూల్డ్ కులాల వారికి TSWREIS, షెడ్యూల్డ్ తెగల వారికి TTWREIS, వెనకబడిన తరగతుల కోసం MJPTS BCWREIS, మైనారిటీల సంక్షేమ పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యార్థినీ విద్యార్థుల్లో స్వయంశక్తిని పెంచడం కోసం, ఆర్థిక అసమానతలు తొలగించడం కోసం విశేష కృషిని ప్రభుత్వాలు చేస్తూనే ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మ్యూజిక్, డాన్స్, ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్లను నియమించడం జరిగింది. ఆయన కళారాధకుడు కాబట్టి లలిత కళలను ఆదరించాడు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గురుకుల పాఠశాలలలో మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే లలిత కళలకు సంబంధించిన టీచర్లను బిఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి అనుకున్న స్థాయిలో నియమించలేకపోయింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభు త్వం తెలంగాణలో పగ్గాలు చేపట్టిన తరువాత లలిత కళలైన ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, డ్యాన్స్ విద్యలకు సంబంధించిన గురువులకు గురుకులాలలో ఉద్యోగాలు కల్పించారు. గత పుష్కర కాలం నుండి ఎదురు చూస్తున్న లలిత కళలకు సం బంధించిన నిరుద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వటం హర్షణీయం.

బిఆర్ఎస్ ప్రభుత్వం మారినా వారు వదిలిన పురిటికంపు పోలేదు. ఇప్పటికీ గురుకులాల్లో వారు పెట్టిన రూల్సే అమలవుతున్నాయి. గురుకుల సొసైటీ అధికారుల మైండ్ సెట్ మారలేదు. ఒక పక్కన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురుకులాలలో చదువుతో పాటు కో కర్రికులర్ యాక్టివిటీని పెంచాలని చెబుతున్నారు. కోడింగ్‌తో పాటు విద్యార్థినీ విద్యార్థులకు లలితకళలైన సంగీత, నృత్యాలను నేర్పించాలని చెబుతున్నా, గురుకులం యాజమాన్యం మాత్రం లైబ్రేరియన్, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లను వారి వృత్తిని చేయనీయకుండా వారికి సంబంధం లేని అవుటాఫ్ డిజిగ్నేషన్ డ్యూటీ చేయించడం అత్యంత శోచనీయం. ఉదాహరణకు – మ్యూజిక్, ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్లను డిప్యూటీ వార్డెన్ ఉద్యోగం చేయాలని వేధిస్తున్నారు. ఆ టీచర్లను భయభ్రాంతులను చేస్తున్నారు. డిప్యూటీ వార్డెన్ పోస్టు విద్యార్హతలు డిగ్రీ విత్ బిఈడి కాని ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ల విద్యార్హత పదవతరగతితో పాటు సంగీతంలో పిజి/డిప్లొమా ఉండాలి. వీరికి తెలిసింది స్వరాలు, రాగాలు, కృతులు, కీర్తనలు, జానపదాలు, జావళీలు. సంస్కృతికి ప్రతీకలయిన ఈ టీచర్స్‌ని బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాల వారు డిప్యూటీ వార్డెన్ పోస్టును నిర్వహించమని ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదు. అంతేకాకుండా ఆ డిప్యూటీ వార్డెన్ పోస్టు అనేది వీరికి ప్రమోషన్ పోస్టు కూడా కాదు. లోయర్ పోస్టులో ఉన్న ఉద్యోగులను హయ్యర్ పోస్టులో ఆపరేట్ చేయటం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. ఇలా చేస్తూ అధికారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా ప్రవర్తిస్తున్నారు. ఈ మధ్యకాలంలో గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ జరిగి అనేకమంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలయ్యారు. ఆ పోస్టు గురించి ఏమీ తెలియని, అనుభవం లేని లలిత కళలకు సంబంధించిన గురువులను ఉపయోగిస్తే సొసైటీకి, అధికారులకు, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది.





తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నోటిఫికేషన్ విడుదల చేసి, డిప్యూటీ వార్డెన్ పోస్టులలో అర్హులైన వారికి ఉద్యోగ అవకాశం కల్పించాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. డిప్యూటీ వార్డెన్ పోస్టు రిక్రూట్‌మెంట్ చేయనందున ఆ బాధ్యతలను టిజిటి, పిజిటి టీచర్లు, లెక్చరర్లు నిర్వహించాల్సి వస్తుంది. ఇప్పుడది మ్యూజిక్, డాన్స్, ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్లు చేయాలని సొసైటీ యాజమాన్యం మెమో విడుదల చేయడం ఉద్యోగ ఉపాధ్యాయ వ్యతిరేక చర్యగా భావిస్తున్నారు. కొన్ని గురుకులాలలో ఈ బాధ్యతలు విద్యార్థులకు కూడా అప్పగించడం అత్యంత బాధాకరం. గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో శ్లాబులు పెచ్చులు ఊడిపోవడం, వర్షాకాలంలో శ్లాబు నుండి నీరు కారుతూ ఉండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్కూలు పరిసరాలలో తేళ్ళు, జెర్రులు, ఎలుకలు, పాములు, పందికొక్కులు యథేచ్ఛగా స్వైరవిహారం చేస్తుండడంతో సిబ్బంది, విద్యార్థులు భయభ్రాంతులవుతున్నారు. బాత్రూమ్‌లలో కూడా పాములు చేరిన సందర్భాలు కో కొల్లలు. పడుకున్న విద్యార్థులను ఎలుకలు కొరికిన సందర్భంలో ఆసుపత్రిలో చేర్పించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సంగీతం నేర్పించే టీచర్లకు టిజిటి స్కేల్ ఇస్తున్నారు. మన రాష్ట్రంలో ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లకు ఎస్‌జిటి స్కేల్ మాత్రమే ఇస్తున్నందున ఈ రాష్ట్రంలో కూడా లలిత కళలను బోధిస్తున్న టీచర్లకు టిజిటి స్కేల్ ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఒక గురుకుల ఆశ్రమ పాఠశాల కాంపౌండ్‌లో 8 గురుకుల పాఠశాలలు, కాలేజీలు నిర్వహిస్తున్నారు. సుమారు 2000 మంది విద్యార్థులు ఆ ఒక్క సముదాయంలోనే ఉన్నారు. ఈ 8 గురుకుల పాఠశాలలకు కలిపి ఒకే ప్రిన్సిపాల్ ఉండటం అత్యంత బాధాకరం. వారిపై ఎంత ఒత్తిడి, పనిభారాలు ఉంటాయో అర్థం అవుతుంది. ఇక ఉద్యోగులు అడకత్తెరలో పోకచెక్కల్లా నలిగిపోతున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే బిసి వెల్ఫేర్‌లో పని చేస్తున్న టీచర్లకు 11 శాతం హెచ్‌ఆర్‌ఏ, అదే సముదాయంలో పని చేస్తున్న జూనియర్ లెక్చరర్లకి 24 శాతం హెచ్‌ఆర్‌ఏ ఇస్తున్నారు. ఇది ప్రపంచంలో ఎనిమిదో వింత. ప్రభుత్వం ఇంతవరకు దీనిని సరిచేయకపోవటం విచారకరం. ఒకే కాంపౌండ్‌లో పనిచేసే ఉద్యోగుల మధ్య ఈ వివక్ష ఎందుకని గురుకులంలోని టీచర్లు ప్రశ్నిస్తున్నారు. ఏ టీచర్స్ యూనియన్ కూడా ఈ సమస్యను పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఇన్ని బాధలు, కష్టాలు, నష్టాలున్నా గురుకులంలోని టీచర్లు మాత్రం 97 శాతంపైనే ఉత్తీర్ణత సాధిస్తూ ప్రైవేట్ స్కూళ్ళతో పోటీ పడుతున్నారు. గురుకుల విద్యార్థులు స్పోర్ట్స్, గేమ్స్ అయిన కరాటే, ఖోఖో, కబడ్డీ, క్రికెట్ లలో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు మెడల్స్ సాధిస్తున్నారు. ఇదంతా ప్రభుత్వ సహకారంతోనే జరుగుతోంది. ఒక్కొక్క విద్యార్థిపై ప్రభుత్వం ఎంతో ధనాన్ని వెచ్చిస్తోంది. 1,022 గురుకులాల్లో 6 లక్షల మంది అణగారిన, బలహీన వర్గాల విద్యార్థులు అక్షరాన్ని ఆయుధంగా మలచుకుని బాహ్య ప్రపంచంలోకి అడుగిడుతున్నారు. ఇందులో లలితకళల విద్యార్థులు కూడా ఉన్నారు. అందువలన లలితకళలకు సంబంధించిన గురువుల చేత అవుటాఫ్ డిజిగ్నేషన్ డ్యూటీలు కాకుండా వారి వృత్తినే బోధిస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరినట్లవుతుంది. ఆ దిశగా గురుకులాల యాజమాన్యాలు చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

లలిత కళలను ఆదరిద్దాం – కళాకారులను గౌరవిద్దాం

# వైద్య కుటుంబానికి దారి దీపం డాక్టర్ బిసి రాయ్


వైద్యులు దేవుళ్లతో సమానం. అమ్మానాన్నలు జన్మనిస్తే అనారోగ్య సమయంలో ప్రాణాలు నిలుపుతూ వైద్యులు పునర్జన్మనిస్తారు. స్వచ్ఛమైన తెల్లని కోటు, ఆత్మీయ చెరగని చిరునవ్వు, మొక్కవోని నిబ్బరం, అలుపెరుగని అంకిత భావం, విసుగెరుగని వృత్తి నిబద్ధత, స్వస్థత వర్షించే స్పర్శలు, రోగుల పాలిటి దైవ హస్తాలు, ధైర్యాన్ని నూరిపోసే వాక్చాతుర్యాలు, కరుణ వంటి సుగుణాలు అనేక ఆదర్శ వ్యక్తిత్వ లక్షణాలు వైద్యులకు ఉంటాయి. వైద్యులు వేసే ప్రతి అడుగు, మాట్లాడే ప్రతి పదం, చేసే ప్రతి చికిత్స, ఇచ్చే ప్రతి సలహా లాంటివి అన్నీ రోగులకు ఆరోగ్య భాగ్యం కలిగించడానికే అంకితం అని తెలుసుకోవాలి. వైద్యుల మానవీయ సంబంధాలు, పాటించే జీవన/ వృత్తిపరమైన విలువలు, ఆధునిక వైద్య శాస్త్ర పరిజ్ఞానం, అపార త్యాగ గుణం, తన శ్రేయస్సును పక్కనపెట్టి రోగుల శ్రేయస్సుకు పాటుపడే నిస్వార్థ జీవి ఓ అసాధారణ వైద్యుడు. కరోనా లాంటి విపత్తుల సమయంలో తమ ప్రాణాలను అడ్డుపెట్టి కోట్ల మందికి పునర్జన్మను ఇచ్చిన వైద్యుల అమూల్య సేవలకు తత్సమాన్ని లేదు, వైద్యుడికి ప్రత్యామ్నాయం లేదు.



పశ్చిమ బెంగాల్ 2వ సిఎంగా సేవలు అందించిన భారత రత్న డా.బిధన్ చంద్ర రాయ్ లేదా డా. బిసి రాయ్ జయంతి (1882 జులై 1), వర్ధంతి (1962 జులై 1) సందర్భంగా భారత దేశవ్యాప్తంగా జులై 1న జాతీయ వైద్యుల దినోత్సవం (నేషనల్ డాక్టర్స్ డే) పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రఖ్యాత ఫిజీషియన్‌గా వైద్య సేవలు అందించిన బిసి రాయ్ చొరవతో ఇండియన్ మెడికల్ కౌన్సిల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్లు ప్రారంభం కావడం విశేషం. త్యాగనిరతి, వృత్తి నిబద్ధత, ప్రేమ మూర్తి అనే పదాలకు నిదర్శనం వైద్యులు మాత్రమే. 2025 జాతీయ వైద్యుల దినోత్సవం ఇతివృత్తంగా తెర వెనుక : వైద్యం చేసే వారికి నయం చేయడం అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. పేదరికం, నిరక్షరాస్యత, అధిక జనాభా, నిరుద్యోగం లాంటి ప్రధాన సమస్యలు భారతీయులకు అనారోగ్య సమస్యలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. వ్యక్తిగతంగా, కుటుంబపరంగా పలు సవాళ్లను ఎదుర్కొంటూనే, అధిక పని గంటలు పని చేస్తూ, శారీరక అలసట, మానసిక ఒత్తిడిని పక్కన పెట్టి రోగులకు వైద్యం చేయడంలోనే దృష్టిని కేంద్రీకరించే వైద్యుల మానసిక స్థితిని అర్థం చేసుకున్న వారికి డాక్టర్లపై అపారమైన ప్రేమాభిమానాలు జనిస్తాయి. పౌర సమాజ ఆరోగ్యమే ఆయనకు ఆనందానిస్తుంది. రోగులకు వ్యాధి నయం అయితే వైద్యులు అపూర్వ విజయంగా భావిస్తారు. రోగుల వేదనలు తన మనసును కలిచి వేస్తాయి. అధిక పని గంటలు, విశ్రాంతి లేని వృత్తి నిబద్ధతలను ప్రదర్శించే వైద్యులు రోగుల పాలిటి ఆపన్నహస్తాలు, ఆయురారోగ్య ప్రదాతలు. రోగాలను నయం చేయడం మాత్రమే కాకుండా ఆత్మ విశ్వాసం నింపే అద్భుత మాటలు, సకాలంలో రోగ లక్షణాలను బట్టి వైద్య చికిత్స చేయడం, దీర్ఘకాలిక రోగాలకు ఉపశమనం కల్పించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని వివరించడం, వ్యాధుల వ్యాప్తి పట్ల అవగాహన కల్పించడం, రోగాల నివారణకు మార్గాలను చూపడం, భావోద్వేగ మద్దతు ఇవ్వడం, రోగులకు తగు సూచనలు చేయడం, అత్యవసర వైద్య సేవలను అందించడం, ఆరోగ్యకర పౌర సమాజాన్ని నిర్మించడం, రోగికి మానసిక, శారీరక సాంత్వన కల్పించడం లాంటి లక్ష్యాలతో వైద్యులు అద్వితీయ అసమాన సేవలను అందిస్తున్నారు.

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మన కుటుంబ వైద్యులను కలిసి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలపడం, తగు రీతిలో డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేయడం, ప్రేమగా బహుమతులు అందజేయడం, సామాజిక మాధ్యమాల్లో వైద్య వృత్తి పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, మన ఊరు వాడల్లో వైద్యులను సన్మానించుకోవడం లాంటి పలు కార్యక్రమాలను నిర్వహించవచ్చు. భవిష్యత్తుపై ఆశలను కలిగించడం, రోగుల శ్రేయస్సుకు పాల్పడడం, రోగుల్లో విశ్వాసం నింపడం లాంటివి నిరంతరం తమ విధులుగా భావిస్తున్న ఆదర్శ వైద్యులకు వందనాలు, వారి సేవలకు శతకోటి కృతజ్ఞతలు. ప్రతి 1,000 మంది జనాభాకు ఒక వైద్యుడు, ముగ్గురు నర్సులు ఉండాలి. నేడు భారతంలో ప్రతి 1,456 మందికి ఒక వైద్యుడు, 1.7 నర్సులు మాత్రమే ఉన్నారు. మన దేశంలో వైద్యులు, నర్సుల కొరత ఉండడంతో వైద్యం అందరికీ అందడం లేదు. పొడిగించిన పని గంటలు, భావోద్వేగ సమస్యలు, శారీరక అలసట, మానసిక ఒత్తిడి, పరిమిత వనరులు, చట్టబద్దమైన సమస్యలు, విలువలతో కూడిన వృత్తి నిబద్ధతలు లాంటి సవాళ్ల నడుమ వైద్యవృత్తి ఒక చాలెంజిగ్ వృత్తిగా మారుతున్నది. రోజురోజుకు వృత్తిలో వస్తున్న సాంకేతిక మార్పులను ఆకళింపు చేసుకుంటూ ప్రాణాలను కాపాడాలనే ఏకైక లక్ష్యంతో తమ జీవితాలను ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి అంకితం చేస్తున్న వైద్యులు సదా ప్రశంసనీయులు, అభినందనీయులు.

**నేడు బిసి రాయ్ జయంతి, నేషనల్ డాక్టర్స్ డే**



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## నౌకలో భారీ అగ్నిప్రమాదం

**న్యూఢిల్లీ :** భారత్ నుంచి ఒమన్‌కు వెళ్తున్న ఓ నౌకలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈమేరకు సమాచారం అందుకున్న వెంటనే భారత నౌకాదళ సిబ్బంది రంగంలోకి దిగారు. బోట్లు, హెలికాప్టర్ సాయంతో హుటాహుటిన నౌక వద్దకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గురైన నౌకలో భారత సంతతికి చెందిన 14 మంది సిబ్బంది ఉన్నట్లు నేవీ అధికారులు తెలిపారు. ఎం.టి యీ చెంగ్ 6 అనే నౌక గుజరాత్‌లోని కాండ్లా నుంచి ఒమన్‌కు బయల్దేరింది. అందులో భారత సంతతికి చెందిన 14 మంది సిబ్బంది ఉన్నారు. మార్గమధ్యలో గల్ఫ్ ఆఫ్ ఒమన్ నౌకలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఇంజిన్ గదిలో మంటలు చెలరేగడంతో మొత్తం విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దీంతో సిబ్బంది అత్యవసర సాయం కోసం సందేశం పంపారు. సమీపంలో విధుల్లో ఉన్న ఐఎన్ఎస్ తబర్... వెంటనే అప్రమత్తమైంది. బోట్లు, హెలికాప్టర్ సాయంతో అగ్నిమాపక సిబ్బంది, పరికరాలను తరలించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంటలు చాలావరకు నియంత్రణలోకి వచ్చాయి అని భారత నౌకాదళం ట్వీట్ చేసింది.

## ప్రపంచంలో ఆర్థిక అనిశ్చితి
# అప్రమత్తతే మనకు రక్ష
## ఆర్థిక స్థిరత్వమే వృద్ధికి కీలకం.. ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా వెల్లడి



**ముంబయి :** వృద్ధి సాధనకు ఆర్థిక స్థిరత్వమే కీలకమని రిజర్వుబ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచంలో ఆర్థిక అనిశ్చిత నెలకున్న తరుణంలో నియంత్రణలతో కూడిన అప్రమత్తతే మనకు రక్షణగా ఉంటుందని చెప్పారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో వ్యవస్థాగతమైన మార్పులు విధానపరమైన జోక్యం చేసుకుని సవాళ్ళు విసురుతున్నాయని ఆయన చెప్పినప్పటికీ, ఆర్థికవృద్ధి ఊపు అందుకోవాలంటే ధరల స్థిరత్వం వంటి ఆర్థికపరమైన స్థిరత్వ పరిస్థితులు అనివార్యంగాఉండాలని చెప్పారు. జూన్ నెల ''ఆర్థిక స్థిరత్వ నివేదిక'' (ఎఫ్ఎస్ఆర్)కు మల్హోత్రా ముందుపీఠిక రాశారు. ''ఆర్థికరంగ నియంత్రణలు వినియోగదారులు,ఖాతాదారులకు రక్షణ ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నాయి, పోటీని ప్రోత్సహించేందుకు,పెరుగుతున్నసామర్థ్యానికీ,వృద్ధికి,భద్రతకు, వ్యవస్థ బ్రహ్మాండంగాపనిచేయడానికీమధ్యసరైన సమతుల్యం సాధించడంలో నవీనత్వాన్ని అందించేందుకు ఆర్థికరంగ నియంత్రణలు కట్టుబడి ఉన్నాయి'' అని జూన్ నెల ఎఫ్ఎస్ఆర్ కు రాసిన ముందుమాటలో మల్హోత్రా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకున్న తరుణంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వృద్ధికి ఒక కీలకమైన చోదకశక్తిగా ఉందని ఆయన ప్రత్యేకంగా చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విభిన్నతరహాలోపనిచేసేందుకు, దానికి కొత్త రూపాన్ని ఇచ్చేందుకు అనేక వ్యవస్థాగతమైన మార్పులు పనిచేస్తున్నాయని, సమీకృత ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో బీటలు పెరగడం కూడా ఈ మార్పులలో ఒక ప్రధానమైనదని, సాంకేతికపరమైన వైఫల్యాలు శరవేగంగా పెరగడం, ప్రస్తుతం కొనసాగుతున్న వాతావరణ మార్పులు, సుదీర్ఘంగా కొనసాగుతున్న భౌగోళికపరమైన విద్వేషాలు వంటివన్నీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సరికొత్త మార్పులకు దారితీస్తున్నాయని మల్హోత్రా తన ఎఫ్ఎస్ఆర్ ముందుమాటలో రాశారు. ''ప్రపంచంలో నెలకున్న పైన పేర్కొన్న ప్రస్తుత పరిస్థితులన్నీ ముందస్తు ఆర్థిక అంచనాలను సంక్లిష్టం చేశాయి. అందువల్ల ఈ అస్తవ్యస్థ అనిశ్చిత పరిస్థితుల్లో ముందుకు వెళ్ళేందుకు కేంద్ర బ్యాంకులు, ఆర్థిక రంగ నియంత్రణలు అప్రమత్తంగా ఉండటం, పొదుపు చర్యలు పాటించడం, లాఘవంగా, చురుగ్గా వ్యవహరించడం అనివార్యం తద్వారా మాత్రమే ప్రతిదేశం తమ తమ ఆర్థిక వ్యవస్థలను సంరక్షించుకోగలుగుతాయి'' అని రాశారు. ధరల స్థిరత్వం వంటి ఆర్థిక స్థిరత్వాన్ని కూడా మల్హోత్రా ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ స్థిరత్వానికి కొన్ని తప్పనిసరి పరిస్థితులు చుట్టూ ఉండి సహకరించాలిసి ఉంటుందని, భారత్ వంటి శక్తిమంతమైన వృద్ధికి ఊపు ఇవ్వడానికి అవి మాత్రమే సరిపోవన్నారు. ఈ యావత్ వ్యవస్థనూ సంరక్షించే బాధ్యతల్లో ఉన్న మల్హోత్రా, ఆర్థిక వ్యవస్థ బ్రహ్మాండంగా పనిచేయాలంటే స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని మాత్రమే ప్రోత్సహిస్తే సరిపోదనీ, ఆర్థిక సేవలను కూడా చాలా సమర్థవంతంగా అందించవలసి ఉంటుందని పేర్కొన్నారు.''వృద్ధి బ్రహ్మాండంగా దూసుకుపోవాలంటే దేశీయ వృద్ధి చోదక శక్తులు బలంగా ఉండాలి, స్థూల ఆర్థిక మౌలిక సూత్రాలను, పొదుపు విధానాలను బలంగా పాటించాలి, అంతేకాకుండా వాతావరణ సంబంధమైన అంశాలు కూడా వృద్ధిని దిగజార్చే ప్రయత్నాలు చేస్తాయి'' అని హెచ్చరించారు. ద్రవ్యోల్బణానికి సంబంధించిన దార్శనికదృక్పథం గురించి కూడా ఆయన తన ముందుమాటలో వివరించారు. ''మరోవైపు ద్రవ్యోల్బణం కూడా మన పట్ల కనికరం చూపించింది, రిజర్వుబ్యాంకు లక్ష్యాలను సాధించడంలో ఒత్తిడులను తట్టుకుని నిలబడటానికి వీలుగా ద్రవ్యోల్బణం మనకు గొప్ప విశ్వాసాన్ని ఇచ్చింది'' అని పేర్కొన్నారు. దేశీయంగా ఆర్థిక వ్యవస్థ అదేపనిగా మెరుగుపడుతోందనీ, మూలధన నిల్వలు బలంగా ఉన్నాయని వాటి మద్దతుతోపాటు రుణాల బకాయిలకు సంబంధించి ఎగవేసిన మొండి రుణఖాతాలు కూడా తక్కువగా ఉన్నాయనీ, లాభాలు బలంగా ఉన్నాయని ఎఫ్ఎస్ఆర్ ముందుమాటలో మల్హోత్రా రాశారు. గడచిన ఏప్రిల్ నెలలో అమెరికా ప్రకటించిన భారీ సుంకాలను కూడా ఆయన ప్రస్తావిస్తూ, భౌగోళిక రాజకీయ అపాయాలు ఇంకా ఉద్ధృతస్థాయిలోనే కొనసాగుతున్నాయని చెప్పారు. ఏప్రిల్ నెలలో ఆర్థిక మార్కెట్లలో అపాయాలు పెరిగాయని, ప్రపంచ ప్రముఖ పరిణామాల తర్వాత ఆర్థిక మార్కెట్లు స్థిరపడ్డాయని అన్నారు. ప్రభుత్వ రుణాలు, అత్యధికంగా ఉన్న ఆస్తుల ధరలలో దిద్దుబాట్ల వల్ల కూడా అపాయాలు పొంచి ఉన్నాయని మల్హోత్రా పేర్కొన్నారు.



# కుదిపేస్తున్న భారీ వర్షాలు..
### ఉత్తరాది అతలాకుతలం
### హిమాచల్‌లో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం

**సిమ్లా:**భారీ వర్షాలు ఉత్తరాదిని ముంచెత్తుతున్నాయి. ముఖ్యంగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లను కుదిపివేస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయి. సోమవారం వర్షం వల్ల నష్టాలు, భవనాలు కూలిపోవడం, కొండచరియలు విరిగిపడటం, రోడ్డు దిగ్బంధనాలు వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఉదయం సిమ్లా శివారులోని భట్టకుఫేర్‌లో ఐదు అంతస్తుల భవనం కూలిపోగా, రాంపూర్‌లోని మేఘావృతంలో ఒక షెడ్ నుండి అనేక ఆవులు కొట్టుకుపోయాయి. చమియానా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్లే దారిలో ఉన్న మథు కాలనీ వద్ద భవనం మునిగిపోయింది, అయితే ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. జిల్లా యంత్రాంగం ప్రమాద తీవ్రతను ముందుగానే గ్రహించి ఖైదీలను ఇప్పటికే తరలించింది. సోమవారం ఉదయం 8.15 గంటల ప్రాంతంలో భవనం కూలిపోయిందని యజమాని రంజనా వర్మ తెలిపారు. నాలుగు లేన్ల రహదారి నిర్మాణం భవన నిర్మాణాన్ని ప్రమాదంలో పడేసిందని, అయితే దాని భద్రతను నిర్ధారించడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. చమియానా గ్రామ పంచాయతీ అప్ ప్రధాన్ యశ్పాల్ వర్మ తెలిపిన ప్రకారం గత సంవత్సరం భవనంలో పగుళ్లు ఏర్పడగా, కైత్లిఘాట్–ధల్లి నాలుగు లేన్ల రహదారిని నిర్మిస్తున్న కంపెనీ అధికారులు భవనం సురక్షితంగా ఉందని హామీ ఇచ్చారు. భవనాలు ప్రమాదకరంగా మారుతున్నందున పనులను నిలిపివేయాలని పంచాయతీ కంపెనీకి లేఖ రాసిందని వర్మ చెప్పారు. అయితే, వారు నిర్మాణ కార్యకలాపాలను కొనసాగించడంతో భవనం కూలిపోయిందన్నారు. కాగా, రాంపూర్‌లోని సర్పారా గ్రామ పంచాయతీలోని సికాసేరి గ్రామంలో మూడు ఆవులు, రెండు దూడలు సహా రెండు గోశాలలు, ఒక వంటగది, నివాసంలోని ఒక గది మేఘాల విస్ఫోటానికి కొట్టుకుపోయాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడిన తర్వాత, నాలుగు లేన్ల సిమ్లా–చండీగఢ్ జాతీయ రహదారిపై ఐదు చోట్ల రాళ్ళు కూలిపోయాయి. దీంతో ట్రాఫిక్‌ను ఒకే లేన్‌కు మళ్లించారు దీనివల్ల తీవ్రంగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడ్డాయి. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేయగా, భారీ వర్షాలు సాధారణ జీవితానికి అంతరాయం కలిగించినప్పటికీ, పాఠశాలలు తెరిచి ఉన్నాయి. ప్రజలు నదులు, నాలాలకు దూరంగా ఉండాలని, నదులు, నాలాలను దాటవలసి వస్తే తమ పిల్లలను పాఠశాలలకు పంపవద్దని తల్లిదండ్రులను కోరుతూ సోలన్ డిప్యూటీ కమిషనర్ మన్ మోహన్ శర్మ హెచ్చరిక జారీ చేశారు. చంబా, కాంగ్రా, కులు, మండి, సిమ్లా, సోలన్, సిర్మౌర్ సహా ఏడు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో రానున్న 24 గంటల్లో మోస్తరు నుంచి అధిక వరద ప్రమాదం ఉందని వాతావరణ శాఖ సోమవారం ఉదయం హెచ్చరించింది. బుధవారం హిమాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని, జూలై 6 వరకు కొండ ప్రాంతంలో వర్షపాతం ఉంటుందని అంచనా వేసింది. పాలంపూర్, బైజ్‌నాథ్, సుందర్‌నగర్, మురారి దేవి, కాంగ్రా, సిమ్లా దాని పరిసర ప్రాంతం జుబ్బర్‌హట్టిలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. ఆదివారం సాయంత్రం నుండి 123 మి.మీ వర్షపాతం నమోదు కాగా, పండోహ్ అత్యధిక వర్షపాతం నమోదైంది. తర్వాత మండి 119.4 మి.మీ, మురారి దేవి 113.2 మి.మీ, పాలంపూర్ 83 మి.మీ, ఘుమార్ 65.4 మి.మీ, భరారి 65.2 మి.మీ, కసౌలి 64 మి.మీ, నదౌన్ 63 మి.మీ, స్లాప్పర్ 62.8 మి.మీ, ధరంపూర్ 56.6 మి.మీ, సుజన్‌పూర్ తీరా 53 మి.మీ. వర్షపాతం కురిసింది. జూన్ 20న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుండి 29 వరకు వర్ష సంబంధిత ఘటనలలో రాష్ట్రంలో 20 మంది ప్రాణాలు కోల్పోయారని, నలుగురు వ్యక్తులు గల్లంతయ్యారని రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్ తెలిపింది.

### చార్‌ధామ్ యాత్ర పునఃప్రారంభం

ఉత్తరాఖండ్‌లో వరదల కారణంగా నిలిచిపోయిన చార్‌ధామ్ యాత్ర సోమవారం పునఃప్రారంభమైంది. 24 గంటల నిషేధాన్ని ఎత్తివేసినట్లు అధికారులు ప్రకటించారు. ఉత్తరకాశీ జిల్లాలో కుంభవృష్టి కారణంగా యమునోత్రి జాతీయ రహదారిలోని సిలాయ్ బైండ్‌లో ఆదివారం కొండచరియలు విరిగిపడిన విషయం తెలిసిందే. దీంతో నిర్మాణంలో ఉన్న ఓ హోటల్ కుప్పకూలింది. ఈ ఘటనలో గల్లంతయిన ఏడుగిరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

## భూటాన్‌లో భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ

**న్యూఢిల్లీ :** భూటాన్‌తో ఇప్పటికే ఉన్నటువంటి సన్నిహిత ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ సోమవారం ఆ దేశంలో నాలుగురోజుల పర్యటనను ప్రారంభించారు. వ్యూహాత్మకంగా ఉన్నటువంటి డోక్లాం పీఠభూమి చుట్టూ మౌలికసదుపాయాలను చైనా బలోపేతం చేసేందుకు అవిశ్రాంత ప్రయత్నాలు సాగిస్తున్న నేపథ్యంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ చేపడుతున్న పర్యటన ప్రాముఖ్యతను సంతరించుకుంది. భూటాన్ రాజధాని థింపూలో జనరల్ ద్వివేదీ భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగేల్ వాంగ్‌చుక్‌ను కలువనున్నారని, అంతేకాకుండా భూటాన్ మిలిటరీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ బటూ షేరింగ్‌తో కూడా విస్తృత చర్చలు జరుపుతారని అధికారులు చెప్పారు. ప్రాంతీయ భద్రతా పరిస్థితులు శరవేగంగా మారుతున్న నేపథ్యంలో ఆర్మీ చీఫ్ జూన్ 30 (సోమవారం) నుంచి జులై 3 వరకు పర్యటిస్తున్నారు.

## తొక్కిసలాటపై సిఎం రాజీనామా చేయాలి : కాంగ్రెస్

**న్యూఢిల్లీ/భువనేశ్వర్ :** ఒడిశాలోని పూరీలోని శ్రీ గుండిచా ఆలయం సమీపంలో జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు వ్యక్తులు మరణించిన నేపథ్యంలో ఘటనపై కాంగ్రెస్ స్పందించింది. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంఝి, ఉప ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఈ విషాదానికి బాధ్యత వహిస్తూ, న్యాయ విచారణ జరిపించాలని పేర్కొంది. రథయాత్రకు హాజరైన బిలియనీర్ గౌతమ్ అదానీకి బిజెపి సర్కార్ ప్రజల కంటే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించింది. ఒడిశా పవిత్ర ఉత్సవాన్ని సాధారణ భక్తుల ఖర్చుతో బిలియనీర్లు, స్నేహితులు, కెమెరా సిబ్బంది కోసం ఒక ప్రైవేట్ కార్యక్రమంగా రాష్ట్ర ప్రభుత్వం మార్చిందని పేర్కొంది. ఢిల్లీలోని కాంగ్రెస్ ఇందిరా భవన్ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎంపి సప్తగిరి ఉలక, పార్టీ నాయకుడు అరబింద దాస్ మాట్లాడారు. రథయాత్ర కేవలం ఒక కార్యక్రమం కాదని, 1,200 సంవత్సరాల నాటి జీవన సంప్రదాయమన్నారు. ప్రజల జీవితాల్లో ఇంత ప్రాముఖ్యత కలిగిన పండుగను బిజెపి ప్రభుత్వం ధ్వంసం చేసిందన్నారు. పూరిలో ఏమి జరిగినా అది బిజెపి నిజమైన స్వభావాన్ని వెల్లడిస్తుందని, రాజకీయ ప్రయోజనం కోసం ఒక కార్యక్రమంగా మార్చడం ఏటమిని ప్రశ్నించారు. శారదబలి సమీపంలో జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయపడ్డారు. ఒక మహిళా జర్నలిస్టుతో సహా చాలా మంది క్రూరమైన పోలీసు చర్యకు గురయ్యారు, విఐపిలు పరిమితం చేయబడినవలయాలలోస్వేచ్ఛగాతిరుగుతున్నారనివారు ఆరోపించారు. మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షల పరిహారం, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 25 లక్షల పరిహారం అందించాలన్నారు. రథయాత్ర ముగింపును సూచిస్తూ దేవతలు ప్రధాన ఆలయానికి తిరిగి వచ్చిన నీలాద్రి బిజే తర్వాత 10 రోజుల్లోపు పూరీ సిట్టింగ్ జిల్లా జడ్జి నేతృత్వంలో కోర్టు పర్యవేక్షణలో న్యాయ విచారణ ప్రారంభించాలని ఉలక డిమాండ్ చేశారు.

## పథకం ప్రకారమే విద్యార్థినిపై అత్యాచారం
### దర్యాప్తులో తేలినట్లు పోలీసుల వెల్లడి


**కోల్‌కతా:**పశ్చిమబెంగాల్‌లోనిసౌత్‌కోల్‌కతాలా కాలేజీలో విద్యార్థిని(24)పై ఓ పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్లు విద్యాసంస్థ ప్రాంగణంలోనే అత్యాచారం చేసిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. తాజాగా పోలీసులు ఈ కేసులో కీలక విషయాలు వెల్లడించారు.అరెస్టైన ముగ్గురు నిందితులు ముందస్తు పథకం ప్రకారమే న్యాయ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ముందు నుంచే విద్యార్థినులను వేధించిన చరిత్ర వారికి ఉందని వెల్లడించారు. విద్యార్థినులను వేధించి రికార్డు చేసిన దృశ్యాలతో వారిని తరచూ బ్లాక్ మెయిల్ చేసేవారని తెలిపారు. అత్యాచారానికి గురైనవిద్యార్థినినికళాశాలలోఅడుగుపెట్టినతొలిరోజే వేధించారన్నారు. బాధితురాలిపై హత్యాచారానికి ముందు ఆమెను లైంగికంగా వేధించి.. రికార్డు చేసిన దృశ్యాలతో బ్లాక్‌మెయిల్ చేయాలని చాలా రోజులుగా కుట్ర పన్నినట్లు తెలిపారు. అత్యాచారానికి సంబంధించిన వీడియోలు ఫుటేజ్‌లను ఎవరికైనా షేర్ చేసి ఉంటారారా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు. ముగ్గురు నిందితులఫోన్‌లుస్వాధీనంచేసుకొని.. వారి నివాసాలలో సోదాలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. స్టూడెంట్స్ యూనియన్ రూమ్, వాష్ రూమ్, గార్డ్స్‌రూమ్ నుంచి ఘటనకు సంబంధించి కీలక ఆధారాలను సేకరించినట్లు తెలిపారు. న్యాయ విద్యార్థిని అత్యాచార కేసులో ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్ర (31) కళాశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడని తెలుస్తోంది.నన్ను పెళ్లి చేసుకుంటావా అని ప్రతి అమ్మాయితో సంభాషణను మొదలుపెట్టేవాడని నిందితుడి జూనియర్లు చెబుతున్నారు. అత్యాచారానికి గురైన యువతిని అలానే వేధించేవాడని తెలిపారు. అతడి అకృత్యాలను భరించలేక చాలామంది యువతులు కాలేజీకి రావడమే మానేసినట్లు తెలిపారు. విద్యార్థినులను ఫోటోలు తీసి వాటిని గ్రూపుల్లో పోస్టు చేసేవాడని,మార్ఫింగ్ చేసి మిత్రులకు పంపించేవాడని మోనోజిత్‌పై ఆరోపణలు వస్తున్నాయి. మహిళలపై వేధింపులు, భౌతిక దాడులు, బలవంతపు వసూళ్లు వంటి పలు ఫిర్యాదులు అతడిపై వెల్లువెత్తాయి.

# ఘర్షణలొద్దు.. అభివృద్ధి 'ఇంజన్' పునరుద్ధరించండి
### స్పెయిన్ ఎయిడ్ సదస్సులో ఆంటోనీ గుటెర్రెస్

**మాడ్రిడ్ :** సంఘర్షణల ప్రపంచంలో సర్వత్రా పేదరికం పెరుగుతోందనీ, అందువల్ల వాటికి స్వస్తిచెప్పి అభివృద్ధి ''ఇంజన్''ను పునరుద్ధరించాలని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు. స్పెయిన్‌లో సోమవారం ఐక్యరాజ్యసమితి సహాయ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడుతూ, ప్రపంచం ఇప్పుడు సంఘర్షణతోనూ, వాతావరణ సమస్యలతోనూ, అసమానతలతోనూ తల్లడిల్లిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధికోసం పెట్టుబడులు అనే అంశంపై నాలుగవ అంతర్జాతీయ సదస్సు స్పెయిన్ దక్షిణప్రాంత నగరం సెవిల్లేలో ప్రారంభమైంది. జులై మూడోతేదీ వరకూ ఈ సదస్సు జరుగుతుంది. డజన్లసంఖ్యలో ప్రపంచ నాయకులు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. దశాబ్దకాలంలో పెట్టుబడులు, దారిద్ర్యం, అసమానతలు, స్త్రీ పురుష సమానత్వం వంటి విషయాలపై చర్చించడం ఇదే మొదటి సారి. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ ఉన్నతస్థాయీ వ్యూహాత్మక సదస్సులో అమెరికాతప్ప అనేక దేశాలు పాల్గొంటున్నాయి. ఇప్పటివరకూ అమెరికా ఈ సదస్సుకు ప్రధాన సహాయకురాలుగా ఉండేది. ధనిక దేశాలు ఖర్చులు తగ్గించుకుంటున్నాయనీ, పొదుపు చర్యలు పాటిస్తున్నాయనీ, విద్య,వైద్యం వంటి రంగాలపై ఖర్చులు తగ్గిస్తున్నాయనీ గుటెర్రెస్ ఈ సదస్సును ప్రారంభిస్తూ చెప్పారు. అమెరికాకు చెందిన ధనవంతులైన దాతలు, వితరణశీలురు తమ దానాలను తగ్గించారని, వారు ఖర్చులు తగ్గించుకున్నారని, ప్రపంచంలో ఘర్షణల కారణంగా తమ ఖర్చుల విధానాల తీరుతెన్నులు, ప్రాధాన్యతలలో మార్పులు తీసుకువచ్చారన్నారు. భారీ రుణ భారాల కారణంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో వైద్యం, విద్య,ఆరోగ్యరంగాలకు కేటాయింపులలో కోతలు పడుతున్నాయన్నారు. అందువల్ల పెట్టుబడులకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆంటోనీ గుటెర్రెస్ ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు.ప్రపంచవ్యాప్తంగా సంఘర్షణల కారణంగా ఆర్థిక వ్యవస్థలు మందగించి వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగాయనీ, బడ్జెట్ కేటాయింపులలో సహాయ చర్యలకు నిధులు తగ్గిపోయాయనీ, అసమానతలతో, వాతావరణ మార్పుల సమస్యలతో ప్రపంచం అతలాకుతలం అవుతోందన్నారు. అంతర్జాతీయ ప్రపంచం నిర్దేశించుకున్న 2030వ సంవత్సరంనాటికి సాధించాల్సిన లక్ష్యాలను చేరుకోవాలంటే ప్రతి సంవత్సరం నాలుగు ట్రిలియన్ డాలర్లకంటే ఎక్కువ పెట్టుబడులను సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. టీకాలు వేయని పిల్లల సంఖ్య పెరుగుతోందనీ, స్కూళ్ళకు వెళ్ళకుండా మానేసి పనుల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోందనీ, అనేక కుటుంబాలు ప్రపంచవ్యాప్తంగా ఆకలితో అలమటిస్తున్నాయని చెబుతూ ఈ దశలో ప్రపంచం తన గమనాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందని గుటెర్రెస్ చెప్పారు.



# కర్ణాటకలో సిఎం మార్పుపై హైకమాండ్‌దే నిర్ణయం : ఖర్గే



**బెంగళూరు:** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కాంగ్రెస్ నాయకులు బహిరంగంగా చర్చిస్తున్న నేపథ్యంలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. అటువంటి అంశాలపై నిర్ణయం పూర్తిగా పార్టీ హైకమాండ్‌దేనని, అనవసరమైన సమస్యను సృష్టించకూడదని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అక్టోబర్‌లో ముఖ్యమంత్రి పదవి మార్పు జరుగుతుందని రాష్ట్రంలోని కొంత మంది కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారనే మీడియా ప్రశ్నలకు ఖర్గే సమాధానమిచ్చారు. సిఎం మార్పు నిర్ణయం హైకమాండ్ చేతిలో ఉందన్నారు. హైకమాండ్‌లో ఏమి జరుగుతుందో ఎవరూ చెప్పలేరని, ఆ నిర్ణయం హైకమాండ్‌కే వదిలివేశామని, తదుపరి చర్య తీసుకునే అధికారం హైకమాండ్‌కు ఉందన్నారు. కానీ అనవసరంగా, ఎవరూ సమస్యను సృష్టించకూడదని ఆయన ఇక్కడ విలేకరులతో అన్నారు. 2023లో, దక్షిణాది రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టినప్పుడు, సిద్ధరామయ్య, డికె శివకుమార్ చెరో 2.5 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలిస్తారనే ఊహాగానాలు వచ్చాయి, భ్రమణ ఫార్ములా ప్రకారం, పార్టీ ఇప్పటివరకు ధృవీకరించలేదు లేదా తిరస్కరించలేదు. ప్రస్తుతం, సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా, శివకుమార్ డిప్యూటీగా ఉన్నారు. ఇదిలా ఉండగా, అధికార పార్టీలో అసంతృప్తి సంకేతాలు, నాయకత్వ మార్పు గురించి ఊహాగానాలు కొనసాగుతున్న నేపథ్యంలో, బెంగళూరులో ఉన్న కర్ణాటక కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జ్ రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా ఇక్కడ పార్టీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. ఆయన పర్యటనపై ఖర్గే మాట్లాడుతూ సుర్జేవాలా బెంగళూరుకు వచ్చారని, ఆయన నివేదిక, సేకరించిన అభిప్రాయాల ఆధారంగా తాము ఏ చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తామని అన్నారు.

### రాజ్యాంగంలో ఏ పదాన్ని తాకినా ఊరుకోం

రాజ్యాంగంలో ఏ పదాన్ని అయినా తాకితే కాంగ్రెస్ పార్టీ దానికి వ్యతిరేకంగా పోరాడుతుందని ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. రాజ్యాంగ ప్రవేశికలోని 'సోషలిస్ట్', 'లౌకిక' పదాలను సమీక్షించాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే చేసిన పిలుపుపై ఆయన స్పందించారు. బెంగళూరులోని తన ఇంట్లో విలేకరులతో ఖర్గే మాట్లాడుతూ హోసబాలేను 'మనుస్మృతి వ్యక్తి' అని పిలిచారు. 'పేద తరగతి ప్రజలు పైకి రావాలని ఆయన కోరుకోరు. వేల సంవత్సరాల క్రితం ఆచరించబడినది ఇప్పుడు కూడా అదే కొనసాగాలని ఆయన కోరుకుంటున్నారు. అందుకే ఆయనకు సోషలిజం, లౌకికవాదం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం ఇష్టం లేదు' అని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు.

### జంతువులకు 'పశు' అనే పద ప్రయోగం అనుచితం...
## 'జీవన్‌ధన్'గా సంబోధించాలి
### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్బోధ

**బరేలీ :** జంతువులకు 'పశు' అనే పదం ఉపయోగించడం 'అనుచితమని' వాటిని 'జీవన్‌ధన్' లేదా జీవిత సంపద అనడం సముచితం అని తాను భావిస్తున్నానని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆమె సోమవారం ఇక్కడి భారతీయ పశువైద్య పరిశోధన సంస్థ (ఐవిఆర్ఐ) 11వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తూ పశువులు లేని జీవితాన్ని ఊహించలేమని ముర్ము చెప్పారు. ఇజత్ నగర్‌లోని ఐసిఎఆర్ (ఐకార్)ఐవిఆర్ఐ పరిశోధన, పశువైద్య, జంతుశాస్త్రాల రంగంలో అభివృద్ధికి అంకితం చేయబడింది.'మీరు (వెటర్నరీ) డాక్టర్‌గా పనిచేస్తున్నప్పుడు జంతువల సంక్షేమాన్ని మనస్సులో ఉంచుకోవాలి. ప్రకృతికి సన్నిహితంగా ఉండే వాతావరణం నుంచి నేను వచ్చాను. అడవులు, అడవిజంతువులతో మానవులకు అనుబంధం ఉన్నది' అని ముర్ము వివరించారు. ఈ రోజు మనకు సాంకేతికపరిజ్ఞానం ఉంది. కానీ గతంలో అవి (జంతువులు) రైతుల కోసం మన 'సాధన్' (రవాణా కోసం), 'బల్'గా ఉపయోగపడ్డాయి. కాబట్టి జీవన్‌ధన్‌గా ఉన్నటువంటి జంతువులకు 'పశు' అనేది సముచితమైన పదం కాదు.అవి లేకుండా మన జీవితాన్ని ఊహించుకోలేం' అని ముర్ము చెప్పారు. భారతీయ సంస్కృతి గురించి ఆమె చెబుతూ, 'దేవుడి ఉనికి అన్ని జీవులలోనూ కనిపిస్తుందని ముర్ము తెలిపారు. 'మన దేవుళ్లు, ఋషులు, జంతువులతో సంభాషించారనే నమ్మకం కూడా అదే తరహా తత్వశాస్త్రంపై ఆధారపడి ఉంటుంది' అని ద్రౌపది ముర్ము చెప్పారు. అనే క రకాల జంతువులు అంతరించిపోయాయని, లేదా విలుప్త అంచున ఉన్నాయని, జీవ వైవిధ్యం, భూఆరోగ్యానికి పరిరక్షణ చాలా కీలకమని , దేవుడు ఇచ్చిన ఆలోచన, అవగాహనా శక్తిని అన్ని జీవుల సంక్షేమం కోసం ఉపయోగించాలని ముర్ము పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ఒక ఉదాహరణను ఉటంకించారు. తన బాల్యంలో రాబందువులు ఒక సాధారణ దృశ్యమన్నారు. అయితే ఈ రోజు ఆ పరిస్థితి లేదన్నారు. 'పక్షి జాతుల సంఖ్య తగ్గడానిక పశువైద్య మందులలో ఉపయోగించే రసాయనాలు కావచ్చు . అలాంటి మందులను నిషేదించడం రాబందుల సంరక్షణకు ప్రశంసనీయమైన చర్య' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. వినియోగంపై ఆధారపడిన సంస్కృతి మానవజాతికే కాకుండా, ఇతర జీవులకు, వాతావరణానికి ఊహించలేని నష్టాన్ని కలిగిస్తుందని కోవిడ్ మహమ్మారి మనలను హెచ్చరించిందని రాష్ట్రపతి ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. జీవ వైవిధ్యాన్ని పెంచడం, జునోటిక్ వ్యాధుల నివారణ, నియంత్రణ, స్వదేశీ, తక్కువ ఖర్చుతో కూడిన చికిత్సలు, జంతువుల పోషణను కనుగొనడంలో ఐవిఆర్, ఇతర సంస్థలు కీలకపాత్ర పోషించాలని ముర్ము విజ్ఞప్తి చేశారు. కాగా రాష్ట్రపతి ముర్ము తెల్లవారుజామునే బరేలీకి చేరుకున్నారు.

## మణిపూర్‌లో నలుగురిని కాల్చిచంపిన దుండగులు

**చురచందాపూర్/ఇంఫాల్ :** మణిపూర్‌లోని చురాచంద్‌పూర్ జిల్లాలో సోమవారం గుర్తు తెలియని దుండగులు 72 ఏళ్ల మహిళతో సహా కనీసం నలుగురు వ్యక్తులను కాల్చి చంపినట్లు పోలీసులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో బాధితులు కారులో ప్రయాణిస్తుండగా మోంగ్‌జాంగ్ గ్రామ సమీపంలో ఈ దాడి జరిగిందని ఒక పోలీసు అధికారి తెలిపారు. మోంగ్‌జాంగ్ చురాచంద్‌పూర్ పట్టణం నుండి ఐదు కి.మీ దూరంలో ఉంది. ప్రాథమిక నివేదికల ప్రకారం, వారిని పాయింట్‌బ్లాంక్ రేంజ్ నుండి కాల్చి చంపినట్లు చురాచంద్‌పూర్ జిల్లా ప్రధాన కార్యాలయంలోని మరొక అధికారి తెలిపారు. సోమవారం సాయంత్రం విడుదల చేసిన ఒక ప్రకటనలో, యునైటెడ్ కుకి నేషనల్ లిబరేషన్ ఆర్మీ (యుకెఎన్ఎల్ఎ) ఈ దాడికి బాధ్యత వహించింది. మృతులను థెన్‌ఖోథాంగ్ హావోకిప్ అలియాస్ థాపి (48), సీఖోగిన్ (34), లెంగౌహావో (35) మరియు ఫాల్హింగ్ (72)గా గుర్తించినట్లు వర్గాలు తెలిపాయి. ఘటన స్థలం నుండి 12కి పైగా ఖాళీ బుల్లెట్ షెల్స్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## అధిక ఫీజులు తగ్గించాలి



**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని వివిధ ప్రైవేటు విద్యాసంస్థల్లో నడిపిస్తున్న అధిక ఫీజులను తగ్గించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం మండల విద్యాధికారి ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు గోపగోని ఉదయ్ మాట్లాడుతూ మండలం లోని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీసులను వసూలు చేస్తూ పేద ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ఫీజుల నియంత్రణ చట్టం ప్రకారం పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులచే కమిటీలు వేసి ఫీజులు నిర్ణయం చేయాలన్నారు. కానీ ఏ ఒక్క పాఠశాలలో కూడా తల్లిదండ్రుల కమిటీలు వేయడం లేదన్నారు. అట్లాగే సిబిఎస్ఈ పాఠ్యాంశాలు బోధించకుండా తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ దాని పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాగరాజు,శివ,పవన్‌లు ఉన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/దేవరకొండ :** ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం మండలంలోని గన్యానాయక్ తండా గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే బాలునాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరాలనే ఉద్దేశ్యంతో సిఎం రేవంత్‌రెడ్డి రూ. 5లక్షల నిధులతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ డానియల్, మాజీ జెడ్పిటిసి అరుణసురేష్‌గౌడ్, మాజీ ఎంపిటిసి జీవన్‌రెడ్డి, లోక నర్సింగ్, టిపిసిసి మీడియా కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ బాలు పాల్గొన్నారు.



## ఛాయా సోమేశ్వర దేవాలయానికి ఎంతో చరిత్ర ఉంది

రాష్ట్ర దేవాదాయ, చేనేత, జౌళీ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్

**ప్రజాపక్షం/నల్లగొండ:** ఎంతో చరిత్ర కలిగిన పానుగల్ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయ ప్రాముఖ్యతను భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయ, చేనేత, జౌలి శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ అన్నారు.సోమవారం ఆమె నల్గొండ సమీపంలోని పానుగల్ లో ఉన్న శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ఛాయా సోమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాక అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయ ప్రత్యేకత పై ఏమైనా సాహిత్యం ఉంటే ఇవ్వాలని అడిగారు.దేవాలయ చరిత్ర ను తెలుసుకున్న ఆమె దేవాలయ ప్రాముఖ్యతను, అదేవిధంగా శిల్ప విశిష్టత, చరిత్ర అన్నింటిని భద్రపరిచేలా చూడాలని ఆర్కిటెక్చర్ సూర్యనారాయణమూర్తి, అలాగే ధార్మిక పరిషత్ సలహాదారు గోవింద హళ్లితో అన్నారు.ఆలయ అర్చకులు ప్రిన్సిపల్ సెక్రటరీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికి విశేష పూజల అనంతరం వేద ఆశీర్వచనం అందించి,తీర్థ ప్రసాదాలు అందజేశారు.అనంతరం ఆమె దేవాలయంలో ఉన్న కొనేరును సందర్శించారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ,నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సోమవారం మొత్తం 122 ఫిర్యాదులు రాగా, జిల్లా అధికారులకు 67 ,రెవెన్యూ శాఖకు 55 ఫిర్యాదులు వచ్చాయి.వీటిలో ఎప్పటిలాగే ఎక్కువ ఫిర్యాదులు వ్యక్తిగత విషయాలకు సంబంధించి, భూములకు సంబంధించి ,ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించి ఉన్నాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని ,ప్రజావాణి ఫిర్యాదుల తో పాటు, ముఖ్యమంత్రి ఫిర్యాదులు, తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కరించాలని సూచించారు.స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

## సుదీర్ఘకాలం పోలీస్‌శాఖలో సేవలు అందించడం అభినందనీయం




**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా పోలీస్‌శాఖ స్పెషల్ బ్రాంచ్ నందు పనిచేస్తున్న ఎస్ఐ ఖాజామొయినుద్దీన్, ఆర్మ్డ్ రిజర్వ్ నందు పనిచేస్తున్న ఎఆర్ ఎస్ఐ వెంకటనారాయణ లు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఇరువురు అధికారులను వారి కుటుంబ సభ్యుల, స్నేహితుల సమక్షంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి కె.నర్సింహా ఘనంగా సన్మానించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సుదీర్ఘకాలం సేవలు అందించడం గొప్ప విషయమని, అభినందనీయమని వారి సేవలను కొనియాడారు. క్లిష్టమైన పోలీస్ ఉద్యోగ విధుల నిర్వహణలో గృహిణిగా భర్తకు సహాయ సహకారాలు అందించడంలో భార్య సేవలు విలువైనవి అన్నారు. ఇంటిని,పిల్లల ప్రయోజకులను చేయడంలో భార్య పాత్ర కిలమైందని అన్నారు. ఇరువురు కూడా కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి ఎస్ఐ స్థాయి పొందారు. జీవిత ప్రయాణంలో సంపూర్ణ సంతోషకరమైన ఉన్నత కుటుంబాన్ని ఏర్పాటు చేసుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి జనార్ధన్‌రెడ్డి, ఎఆర్ డిఎస్‌పి నర్సింహాచారి, ఎవో మంజు భార్గవి, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శివ కుమార్, డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ హరిబాబు, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షులు రామచందర్‌గౌడ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నారాయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థలను బ్యాన్ చేయాలి



**ప్రజాపక్షం/భువనగిరి :** అధిక ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ శ్రీ చైతన్య పాఠశాలలను రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ డిమాండ్ చేశారు. భువనగిరిలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజుల నియంత్రణ చట్టం తుంగలో తొక్కి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థి తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పేద విద్యార్థి తల్లి దండ్రులను ప్రైవేట్ కార్పోరేట్ విద్యా సంస్థలు ఆసరాగా చేసుకొని కాసులు వసూలుకు పాల్పడుతున్న విద్య హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా విద్యా శాఖ అధికారులు ప్రైవేట్ కార్పోరేట్ విద్యాసంస్థలపై దాడులు నిర్వహించి పర్మిషన్ లేనటువంటి విద్యాసంస్థలను తక్షణమే సీజ్ చెయ్యాలని లేనిపక్షంలో దాడులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుల వంశీ, శివ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్‌ప్లాన్ ప్రకారం చెర్వుగట్టు అభివృద్ధి చేస్తాం

దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** తెలంగాణ శ్రీశైలంగా ప్రసిద్ధిగాంచిన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు శ్రీపార్వతి జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానమును మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసి పెద్దపెద్ద దేవాలయల వరుసలో ఉంచుతామని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, చేనేత, జౌళిశాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ అన్నారు. సోమవారం ఆమె చెరువుగట్టు దేవస్థానాన్ని ఎండోమెంట్ కమిషనర్ ఎస్ వెంకట్రావు, స్థపతిలతో కలిసి సందర్శించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు , దేవస్థాన సిబ్బంది ఆలయానికి విచ్చేసిన ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ ,ఎండోమెంట్ కమిషనర్ వెంకట్రావు , జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,స్థానిక శాసనసభ్యుడు వేముల వీరేశంలకు అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. గర్భాలయంలో వారిచే ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ముఖ్య కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో దేవాలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్ వెంకట్రావు, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇతర సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రాష్ట్రదేవాదాయ శాఖ కమిషనర్ దేవాలయానికి సంబంధించి44 ఎకరాల స్థలం గుట్టపైన ఉండగా, కింద 90 ఎకరాల స్థలం ఉందని, ప్రస్తుతం దేవాలయ నిధులు 24కోట్లు ఉన్నాయని, సంవత్సర ఆదాయం 14 నుండి 16 కోట్లు వస్తున్నదని, రెండు కిలోల 640 గ్రాముల బంగారం, 241 కిలోల వెండి ఉన్నట్లు వివరించారు. దేవాలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలను ప్రస్తుతం ఉన్న అస్తవ్యస్త నిర్మాణాలు, భవిష్యత్తులో దేవాలయ, భక్తుల అవసరాలు, తదితర వాటిపై వివరించారు. తర్వాత ప్రిన్సిపాల్ సెక్రెటరీ మాట్లాడుతూ చెర్వుగట్టు శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి మహాత్యం, దర్శనానికి ఇతర జిల్లాల నుండి ప్రత్యేకించి అమావాస్య రోజు లక్షల సంఖ్యలో వచ్చే ప్రజలు, ఆదాయం అన్ని తెలుసుకున్న తర్వాత రాబోయే 20,30 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తే బాగుంటుందనే విషయంపై సమీక్ష నిర్వహించమన్నారు. ఆదాయం పెరుగుతున్న నెపథ్యంలో దేవాలయాన్ని గ్రేడ్‌పోస్టు పెంచడానికి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ చెర్వుగట్టు దేవాలయంపై ప్రజలు ఎంతో విశ్వాసంతో వస్తారని, సరైన వసతులు లేనందున ఇబ్బందులు పడుతున్నారని, పరిశుభ్రత లేదని, అమావాస్య రోజు సుమారు 60 వేల మంది నిద్ర చేస్తున్న సరిపడ టాయిలెట్లు సౌకర్యం కల్పనపై ఆయన సమీక్షించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థపతి వళ్ళీనాయగం, ఆర్కిటెక్చర్ సూర్యనారాయణమూర్తి, నల్లగొండ ఆర్డీవో వై అశోక్ రెడ్డి, డిఎస్‌పి శివరాంరెడ్డి, దేవాదాయ శాఖ ఎస్‌ఈ ఓంప్రకాష్,ఈఈ శ్రీనివాస్ శర్మ, స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపిడివో ఉమేష్ కుమార్, ఆర్ఐ , ఎంపిఒ పాల్గొన్నారు.

## వేగవంతంగా ప్రజావాణి అర్జీల పరిష్కారం

పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నివారణ కోసం కార్యాలయంలో ఇంటర్నల్ కమిటీలు : కలెక్టర్



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నివారణ కోసం కార్యాలయంలో ఇంటర్నల్ కమిటిలు ఏర్పాటు చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ప్రజలనుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల్లో జిల్లా, మండల స్థాయి కార్యాలయాలలో ఇంటర్నల్ కమిటీలు ఏర్పాటు చేస్తూ వారం రోజుల్లో సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. కమిటి ఏర్పాటు చేయకపోతే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజావాణిలో పరిష్కరించిన దరఖాస్తులు మరల జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో అధికార్లతో కలిసి ఏర్పాటైన కమిటి ప్రతి శాఖకి సంబంధించి పరిశీలించిన ప్రజావాణి దరఖాస్తులు యాదృచ్ఛికంగా కొన్ని దరఖాస్తులు మరల పరిశీలించి దరఖాస్తులను పరిష్కరించటంలో నాణ్యత పాటిస్తున్నారా లేదా అని పరిశీలిస్తున్నామని, అర్జీలు పరిష్కరించడంలో ఏమైనా తప్పులు దొర్లితే చర్యలు తీసుకుంటామని అదేశించారు. జిల్లా అధికారులు తమ శాఖ పరిధిలో ఉన్న లోకాయుక్తా, మానవహక్కుల కమిషన్, ఎస్‌సి, ఎస్టీ కమిషన్, స్థానిక కోర్టు కేసులకి సంబంధించి కౌంటర్ ఫైల్, కేసు క్లోజ్, కోర్టు ఆర్డర్ అమలు లాంటివి తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. జిల్లా అధికారులు తమ పరిధిలోని సిబ్బందికి పరిపాలనకి సంబంధించి పలు సూచనలు చేస్తూ పనుల త్వరగా అయ్యేలా చూడాలని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులలో భూ సమస్యలపై 62, ఎంపీడీవోలకు 26, మున్సిపల్ కమిషనర్‌కు 5, డిపివో4, ఇతర శాఖలకు సంభంధించినవి 22 మొత్తం 123 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పిడి వివి అప్పారావు, డిపివో యాదగిరి, వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, డిఈవో అశోక్, సిపివో కిషన్, సంక్షేమ అధికారులు దయానందరాణి, శంకర్, శ్రీనివాస్‌నాయక్, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసి రిజర్వేషన్ల రద్దుకు బిజెపి కుట్ర




డిహెచ్‌పిఎస్ జిల్లా ఇన్‌చార్జి బొలుగూరి నరసింహ్మా

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డీహెచ్‌పీఎస్ నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి బొలుగూరి నర్సింహా అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వల్లంపట్ల వెంకన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన డీహెచ్‌పీఎస్ మిర్యాలగూడ నియోజకవర్గ మహాసభలో పాల్గొని ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో దళితులకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కేంద్రం కుట్రలు చేస్తుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేసి ఆస్తులను కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తుందన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలన్నారు. ఉపాది హామి పథకానికి కోతలు పెట్టి పథకాన్ని రద్దు చేయాలని చూస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు కావొస్తున్నా చేవెళ్ల డిక్లరేషన్‌ను ఎందుకు అమలు చేయడం లేదని ఆరోపించారు. సంక్షేమ పథకాల్లో దళితులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎన్నికల మానిఫెస్టోలో దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షులుగా అందుగుల సైదులు, ప్రధాన కార్యదర్శిగా వల్లంపట్ల వెంకన్న, సహాయ కార్యదర్శిగా పాల్వాయి సుందర్, ఉపాధ్యక్షులుగా పోలేపల్లి సైదులు, కోశాధికారిగా పోలేపల్లి లతలు ఎన్నికయ్యారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయీద్, సీపీఐ మండల కార్యదర్శి ఎ.రామలింగయ్య, దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి లింగానాయక్, డీహెచ్‌పీఎస్ నాయకులు అందుగుల సైదులు, పీ.సైదులు, పాల్వాయి సుందర్, పోలేపల్లి లత, కొండేటి సుధాకర్ పాల్గొన్నారు.

## దేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతున్న మోదీ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** భారత దేశ ప్రయోజనాలను, ప్రతిష్టను అమెరికాకు తాకట్టు పెడుతున్న నరేంద్రమోదీ విధానాలపై ఉద్యమించాలని, భారతీయులపై అమెరికా దుర్మార్గపు చర్యలను ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జూలై 2న ఛలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి పిలుపుణిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి పేరబొయిన మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా చలో అమెరికా రాయబారి కార్యాలయం ముట్టడి గోడ పత్రికను యాదగిరిగుట్టలో విడుదల చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబొయిన మహేందర్ మాట్లాడుతూ నరేంద్రమోదీ విధానాలు దేశానికి ప్రమాదకరమని, దేశాన్ని తిరోగమన దిశలో తీసుకెళ్లే విధానాలను అనుసరిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వత్తాసు పలుకుతూ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రతిష్టను నష్టపరిచే చర్యలను దేశ పౌరులు తిప్పి కొట్టాలని వారు అన్నారు. ఈ విడుదల కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పేరబొయిన పేంటయ్య,పేరబొయిన బంగారు ఎఐవైఎఫ్ నాయకులు అనంతుల నర్సింహ్మా, కంబాల రాజు, కంబా ల నర్సింహ్మా, కల్యాణ్, బాను తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి, మెడికల్ కాలేజీల నిర్వహణలో ఇబ్బందులు ఉండొద్దు

ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/యాదాద్రి :** భువనగిరి జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వైద్య కళాశాలను జిల్లా కలెక్టర్ హనుమంత రావు, మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీ సభ్యులు డిఎంఇ నరేందర్, మహేశ్వరం మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ నాగేంద్ర, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, చిన్నా నాయక్‌లతో కలసి, ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధ్యక్షతన జిజిహెచ్ సూపరింటెండెంట్ ఛాంబర్‌లో మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీ సభ్యులు డియంఈ నరేందర్, మహేశ్వరం మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ నాగేంద్ర ఆయా విభాగాల అధిపతులతో సమావేశమై అన్ని అంశాలపై కులకశంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఒక్కో విభాగం వారీగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, డాక్టర్లు, సిబ్బంది ఖాళీలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఇంకనూ కొత్తగా సమకూర్చాల్సిన సదుపాయాలు తదితర వాటి గురించి కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ విభాగాలను సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. సేవలు, డాక్టర్లు, సిబ్బంది ఖాళీలు, అందుబాటులో జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ నివేదికను అనుసరిస్తూ సదుపాయాల మెరుగుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఆసుపత్రి, మెడికల్ కాలేజీల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, తమ దృష్టికి తేవాలని సూచించారు. వైద్య విద్యార్థులు సంఖ్యకు అనుగుణంగా ప్రొఫెసర్ లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది ఉండాలన్నారు. ఆయా విభాగాలలో ఖాళీలు ఉంటే, వాటి వివరాలను తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సిపిఐ వలిగొండ మండల పార్టీ కార్యదర్శిగా వీరస్వామి ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల సిపిఐ పార్టీ మండల కార్యదర్శిగా సలిగంజి వీరస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నర్సాపురంలో ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జరిగిన 14వ మండల మహాసభలో సలిగంజి వీరస్వామి ని నూతన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో 23 మంది కౌన్సిల్ సభ్యులు 9 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నుకోవడం జరిగింది సహా కార్యదర్శిగా ఎల్లంకి మహేష్ గారిని ఎన్నుకున్నారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి మాట్లాడుతూ సిపిఐ బలోపేతానికి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా రానున్న స్థానిక ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను ఎన్నికలలో గెలిపించుకోవడానికి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని ప్రకటించారు. మండలంలో ప్రధాన సమస్య అయిన సాగునీటి కోసం త్రాగునీటి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానని వాటిని సాధించే వరకు పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, యానాల దామోదర్ రెడ్డి, బోద సుదర్శన్ , సత్యనారాయణ , ఇమ్రాన్ , ఎలగందుల అంజయ్య , బండి జంగమ్మ మండల కార్యవర్గ సభ్యులకు కౌన్సిల్ సభ్యులకు పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





## మా భూములు మాకు ఇవ్వండి...

లేకుంటే ఉద్యోగమైన ఇవ్వండి

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ బాధితుల ఆవేదన

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మా భూములైనా ఇవ్వండి... లేదా ప్లాంట్‌లో ఉద్యోగ అవకాశాలై కల్పించాలని నినదిస్తూ నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామస్థులు సోమవారం కలెక్టర్ కార్యాలయం నిరసన చేపట్టి కార్యాలయ అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ సమయంలో అప్పటి ప్రభుత్వం, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారంతో ఉద్యోగ భద్రత కల్పిస్తామని అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో తీర్మాణం చేశారని చెప్పారు. ఏండ్లు గడుస్తున్నా సమస్యను పరిష్కరించకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం బాధాకరమన్నారు. అదేవిధంగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, హెల్త్‌కార్డులు, ఐటీఐ, పారిశ్రామిక కళాశాలలు ఏర్పాటు చేస్తామని తీర్మాణం చేసిన సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దాపురించిందని వాపోయారు. పవర్‌ప్లాంట్ పూర్తయి విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఈ విషయమై పలుమార్లు ప్రభుత్వ ఉన్నతాధికారులకు విన్నవించుకున్న ఫలితం శూన్యమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి బాధితులకు న్యాయం చేయాలని వేడుకున్నారు. వినతిపత్రం అందచేసిన వారిలో ఎన్.నాగేందర్, నూనావత్ శివనాయక్, నాగేంద్ర, హనుమంతు, కె.బాలునాయక్, ఆర్.వెంకటేష్ పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 86 అర్జీలు

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 86 అర్జీలను, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు కలసి అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందు లో రెవిన్యూ శాఖ 54, జిల్లా పంచాయతీ శాఖ 8, జిల్లా వ్యవసాయ శాఖ 4, ఈఈ ఇరిగేషన్ 3, జిల్లా సంక్షేమ శాఖ 3, హౌసింగ్ 2, కోపరేటివ్ 2, విద్యా శాఖ 2, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 2, ఎస్సీ కార్పొరేషన్ 2, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఎస్సీ సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ సంక్షేమ శాఖ లకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ పాల్గొన్నారు.

## కన్నతల్లిపై కొడుకుల కర్కశత్వం

ఇంటి నుంచి గెంటివేత

అన్నం పెట్టడం లేదని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన తల్లి



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** నేటి సమాజంలో మానవ సంబంధాలు రోజు రోజుకి దిగజారుతున్నాయి. నవ మాసాలు మోసి కనిపెంచిన తల్లీని నిర్ధాక్షిణ్యంగా వదిలివెళ్లారు కసాయి కొడుకులు వృద్ధురాలైన కన్నతల్లిని, కడుపులో పెట్టుకుని చేసుకోవాల్సిందే పోయి. అనాథగా వదిలేశారు కన్న కొడుకులు ఉన్న ఆస్తి లాక్కొని, కన్నతల్లికి అన్నం పెట్టకుండా రోడ్డును వదిలేయడంతో జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయం మెట్లు ఎక్కిన ఘటన చోటుచేసుకుంది. మల్దకల్ మండల కేంద్రనికి చెందిన పాపమ్మ (70) కు నలుగురు కుమారులు కాగా పాపయ్య భర్త చనిపోవడంతో నలుగురిలో ముగ్గురు అన్నదమ్ములు మంచిగా చూసుకుంటామని నీ బాగోగులకు ఎలాంటి డోకా ఉండదని మాయమాటలు చెప్పి తన పేరిట ఉన్న 2.37 ఎకరాల భూమిని గిఫ్ట్ డిడి కింద బలవంతంగా వారి భార్యలు, పిల్లల పేరు మీద రిజిస్టర్ చేయించుకున్నారని ఆ వృద్ధ మహిళ కన్నీరు మున్నీరయ్యారు. నేను అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నానని, నా కుమారులు పట్టించుకోవడం లేదని, నాభూమిని తిరిగి నా పేరిట చేయాలని జిల్లా కలెక్టర్ సంతోష్ కుమార్, అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణకు మొరపెట్టుకుంది వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని సంబంధిత ఆర్డిఓ అధికారికి రిఫర్ చేశారు.

## ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**ప్రజాపక్షం/కమలాపూర్:** గత ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన 250 గజాలు ఇంటి స్థలం , పెన్షన్, ఉద్యమకారులుగా గుర్తింపు కార్డుల హామీలను నెరవేర్చాలని కోరుతూ టియుఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు సోమవారం కమలాపూర్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట శాంతియుత దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి కత్తి రమేష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని లేని యెడల ఉద్యమకారుల హక్కులకై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చే వరకు ఊరుకునేది లేదని తెలిపారు. మండల కోశాధికారి తమ్మ శోభన్, ఉద్యమ నాయకులు నాకిర్త ఓదేలు, ఎండి. నలీం, వల్లంపట్ల నర్సయ్య, ముప్పు కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్‌లో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలి

రైల్వే డిఆర్ఎంకు ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ వినతి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** రైల్వే మూడవ లైన్ పనుల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని, మానుకోటలో సూపర్‌ఫాస్ట్ రైళ్ల నిలుపాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్ డిఆర్ఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గంలో వానాకాలం దృష్టిలో పెట్టుకుని కేసముద్రం మండలం అన్నారం గ్రామంలో అండర్ బ్రిడ్జి మరమ్మతులకు సంబంధించిన పనులు చేయాలని, అలాగే మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రైలుగేట్ మూసివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనికి శాశ్వత పరిష్కారంగా రైల్వే అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డిఆర్ఎం భారతేష్ కుమార్ జైన్‌ను కోరారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ళు, జిటి, ఎపి ఎక్స్‌ప్రెస్, వందేభారత్, ఎక్స్‌ప్రెస్ రైళ్ళు నిలపాలని కోరగా డిఆర్ఎం స్పందించి హాల్ట్ అనుమతి హామీ ఇచ్చారు.


## ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్‌కు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ప్రతిభావంతులైన వెనుకబడిన వర్గాలకు చెందిన ఎస్సి, ఎస్టి, బిసి వర్గాల అభ్యర్థుల నుండి తెలంగాణ షెడ్యూల్ కులాల స్టడీ సర్కిల్, బంజారా హిల్స్, హైదరాబాద్ సంస్థ ద్వారా 2025 26 విద్యా సంవత్సరానికి ఉచిత సివిల్ సర్వీసెస్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ కోచింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. దరఖాస్తు చేయు అభ్యర్థులు ఏదైనా డిగ్రీ చేసి ఉండాలని తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షల కంటే తక్కువగా ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేయుటకు చివరి తేది జూలై 7 వరకు ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు జూలై 13వ తేదీన ఎంపిక ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. టీజీ ఎస్సి స్టడీ సర్కిల్‌ను 1980లో స్థాపించారని, ఇప్పటివరకు 433 మంది విద్యార్థులు ఈ సంస్థ ద్వారా ఎంపికయ్యారని, వారిలో 52 మంది ఐఏఎస్, 56 మంది ఐపీఎస్, 325 మంది ఇతర సెంట్రల్ సర్వీసుల్లోకి ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి యం.వెంకటేశ్వర్లు, ఆర్డిఓ రవి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగికి పదవీ విరమణ సహజం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమని భూపాలపల్లి ఎమ్మెల్యే గాండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి ఆర్టీసీ బస్సు డిపోలో జరిగిన డ్రైవర్ అంబాల సాంబయ్య పదవీ విరమణ సన్మాన మహోత్సవంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా సాంబయ్య దంపతులకు ఎమ్మెల్యే పూలమాల వేసి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గణపురం మండలం కరకపల్లి గ్రామానికి చెందిన సాంబయ్య గత 28 ఏళ్లుగా ఆర్టీసీలో బస్సు డ్రైవర్ గా పనిచేసి భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలతో పాటు అధికారుల, తోటి ఉద్యోగుల మన్ననలను పొందారని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని.. అయితే ఇన్ని రోజులు వారు ఎలాంటి సేవలందించారన్నది చాలా రోజుల పాటు గుర్తుంటుందన్నారు. ముఖ్యంగా ఆర్టీసీలో సుదీర్ఘ కాలం పాటు చేయడం చాలా శ్రమతో కూడుకున్నదన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, డిపోలో పని చేసే ఇతర సిబ్బంది శారీరక శ్రమ అంతా ఇంతా కాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పుప్పాల రాజేందర్, అంబాల శ్రీనివాస్, అప్పం కిషన్, సాంబమూర్తి, పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, ఆర్టీసీ కార్మికులు ఉన్నారు.

## అర్హులందరికీ కొత్త పెన్షన్లు విడుదల చేయాలి

సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** కొత్త పెన్షన్లు తక్షణమే విడుదల చేయాలని, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలని సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని లెనిన్ నాగర్,ఇందిరా కాలనీ,యాదవ నగర్,నరసింహ నగర్ శాఖ మహాసభలు బేతమల్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ గత బిఆర్ఎస్ హయాంలో నిలిచిపోయిన నూతన పెన్షన్లను నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెటనే విడుదల చేసి ఆదుకోవాలన్నారు.గత బిఆర్ఎస్ 2018 తర్వాత ఒక్క నూతన పెన్షన్ కూడా ఇవ్వాలేదన్నారు. వితంతువులు, వికలాంగులు, వృద్ధులు పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపి నూతన పెన్షన్లను విడుదల చేసి ఆదుకోవాలని ఆయన కోరారు. సంక్షేమ పథకాలన్నీ శివారు కాలనీల ప్రజలకు అందించాలనికోరారు. ఈ శాఖా మహాసభల్లో సిపిఐ నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, 24వ వార్డు కన్వీనర్ చింతకుంట్ల వెంకన్న, బేతమల్ల శ్రీనివాస్, మార్నేని మోహన్‌రావు, బిక్షపతి, సమ్మెట రవి, ఆలేటి మహేష వల్లెం శ్రీకాంత్‌చజడల నటరాజ్, పులి యాకయ్య, జన్ని లక్ష్మి నారాయణ, రామనర్సు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** సీజనల్ వ్యాధుల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. వెంకటాపూర్ మండల కేంద్రంతో పాటు తిమ్మాపూర్, నర్సాపూర్ గుర్రంపేట, రాజేశ్వరరావు పల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి 284 మంది ని పరీక్షించారు. 15 మంది జ్వర పీడితులను గుర్తించి వారికి మలేరియా డెంగ్యూ వంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రభలె అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు నివాస ప్రాంతాలలో నీరు నిలవకుండా చూడాలని అన్నారు మీరు నిల్వ ఉంటే అక్కడ దోమలు మలేరియా డెంగ్యూ చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రజల అవకాశం ఉంటుందన్నారు టైఫాయిడ్, పచ్చకామెర్లు, కలరా వంటి వ్యాధులు నిర్మూలించడానికి కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్థానిక ఆరోగ్య కార్యకర్తను కానీ, సబ్ సెంటర్లలో సంప్రదించి అవసరమైన మందులను తీసుకోవాలన్నారు. పరిస్థితి విషమంగా ఉంటే వెంటనే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి అవసరమైన రక్త పరీక్షలు చేయించుకొని మందులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పార్వతి చందన నవీన్ ఎం ఎల్ హెచ్ పి,ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణకు కేంద్రం మొండిచెయ్యి



ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు ధ్వజం

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** జూలై 4న గ్రామ స్థాయి నాయకులతో ఏర్పాటు చేసిన బహిరంగ సభను విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ పార్లమెంట్ అసెంబ్లీ నియోజవర్గాలకు ఇంచార్జ్‌లుగా నియమితులైన టిపిసిసి ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, టిపిసిసి ప్రధాన కార్యదర్శులు దుద్దిళ్ల శ్రీనుబాబు, పల్లె శ్రీనివాస్‌గౌడ్, మోత్కూరి ధర్మారావుతో కలిసి ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయి కార్యకర్తలతో నేరుగా మాట్లాడాలనే ఆలోచనతో నిర్వహించ తలపెట్టిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రతి నియోజవర్గం నుంచి టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చిన సంఖ్యలో క్షేత్ర స్థాయి కార్యకర్తలను తరలిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధికి సహరించాల్సిన కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు తమ అక్కసును వెళ్లగక్కడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి కడుతున్న నిధులలో మా రాష్ట్ర వాటా మనకు ఇవ్వకుండా బిజెపి పాలిత రాష్ట్రాల్లో, మిత్రపక్ష రాష్ట్రాల్లో అధిక నిధులు కేటాయిస్తూ తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి చూపడం పట్ల ధ్వజమెత్తారు. రెండో దశ మెట్రో, ఆర్‌ఆర్‌ఆర్, మూసి నది ప్రక్షాళనపై నిధులు కేటాయించాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు,పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యం

కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావులు పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ త్వరగా పరిష్కరించాలని, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 85 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 39, గృహ నిర్మాణ శాఖకు 16, ఉపాధి కల్పనకు 3, పెన్షన్ 6, ఇతర శాఖలకు సంబంధించినవి 21 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని, పరిష్కరించుటకు వీలు కాని సమస్యలను ఎందుకు పరిష్కరించబడవో దరఖాస్తుదారునికి వివరించే ప్రయత్నం చేయాలని, ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించిన వివరాలు దరఖాస్తుదారుడి మొబైల్‌కి సమాచారం అందించేలా చూడాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. 15 రోజుల్లో 5వేల ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, అందుకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్ సింగ్‌లలో కలిసి ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 59 ధరఖాస్తులు రాగా శాఖల వారిగా పంపిణీ చేసి వెంటనే ప్రజావాణి ధరఖాస్తుల్ని పరిశీలించాలని ఆదేశించారు. కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామానికి చెందిన సోమారపు అమని తన 9 ఎకరాల భూమి ఉందని అందులో నుండి మూడు ఎకరాలు తన పేరు మీద పట్టా చేసి పట్టాదార్ పాస్‌పుస్తకం ఇవ్వమని కోరారు.జనగామ మండలంలోని వడ్లకొండ శివారులు భూములు కొనుగోలు చేసి ప్లాట్ చేసుకున్ననిరుపేదల ప్లాట్లను కొందరు గుంజుకోవాలని చూస్తున్నారని వివరించారు.అనంతరం కలెక్టరేట్‌లో మొట్టమొదటగా నిర్మాణంచేసిన ఇంకుడు గుంతను అన్ని శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటి కలెక్టర్ సుహాసిని, ఆర్డిఓ గోపిరాం, వెంకన్న, ఆర్‌డిడిఏ పిడితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/రాయపర్తి:** ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద దేవి అన్నారు. శనివారం మండలంలో మైలారం, రాగన్నగూడెం గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. అనంతరం తిర్మలాయపల్లి గ్రామంలో కస్తూర్బా గాందీ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి కౌసల్యా దేవి, ఇందిరమ్మ హౌసింగ్ డీఈ గణేష్, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్, ప్రకాశ్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుకు వెంటనే పరిష్కారం

కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి:** ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్వో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డిఆర్డిఓ కౌసల్యాదేవి, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణిలు పాల్గొని ప్రజలనుండి స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ త్వరగా పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 130 దరఖాస్తులు రాగా ఎక్కువగా రెవెన్యూ 54, హౌసింగ్ 20 దరఖాస్తులు వచ్చాయని, మిగతా శాఖలకు సంబందించిన దరఖాస్తులు 56 వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలి ఆదేశించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని, పరిష్కరించుటకు వీలుకాని సమస్యలను ఎందుకు పరిష్కరించబడవో దరఖాస్తు దారునికి వివరించే ప్రయత్నం చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టిఐ, గ్రీవెన్స్ పెండేల్సి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఈ ఫైలింగ్ లో ఫైల్స్ సర్క్యులేట్ చేయాలని జిల్లా అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, కలెక్టరేట్ పరిపాలన అధికారి విశ్వప్రసాద్, వరంగల్ ఖిలా వరంగల్ తహసిల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్ రావు, హార్టికల్చర్ అధికారి అనసూయ, డిబిసిడివో పుష్పలత, జిల్లా విధ్యా శాఖ అధికారి జ్ఞానేశ్వర్ సంబంధిత అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌తో ఆర్థిక పురోగతి

కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ:** స్వయం సహాయక సంఘానికి చెందిన మహిళల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ విజయవంతంగా ఏడాది ని పూర్తి చేసుకోవడం అభినందనీయమని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటై విజయవంతంగా సాగుతుండగా జిల్లా కలెక్టర్ సందర్శించారు. మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పంలో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రుల సమక్షంలో గతేడాది జూన్ 29వ తేదీన ప్రారంభించారు. ప్రారంభోత్సవం నుండి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ మహిళా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఇతర అధికారులతో కలిసి క్యాంటీన్ ను సందర్శించి అక్కడ ఉన్న వసతులను పరిశీలించారు. నిర్వాహకులు నికితాంజలి బృందంతో కలెక్టర్ సంభాషించారు. క్యాంటీన్ నిర్వహణ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించిందని, తద్వారా మహిళలు పురోగతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, మెప్మా కోఆర్డినేటర్ రజిత రాణి, తదితరులతోపాటు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఆనుమతి లేకుండా నడుస్తున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు

ఫీజులు తగ్గించి, పాఠ్యపుస్తకాలు, షూ, టై, బెల్టు వ్యాపార దందా బంద్ చేయాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉట్కూరి ప్రణీత్, భాషబోయిన సంతోష్




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా కేంద్రంలో నారాయణ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యాశాఖ నిబంధనలు పట్టించుకోకుండా అనుమతి లేకుండా పాఠశాల నిర్వహణ చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, బాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ హరిత కాకతీయ గల్లీలో ఉన్న నారాయణ పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తకాలు అమ్ముతున్నారని డిఈఓ, ఏం ఈఓ కి సమాచారం ఇచ్చినా పట్టించుకోకుండా ఉండడం విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారు అనడానికి ఇది నిదర్శనమని వారు అన్నారు. నారాయణ పాఠశాలలు రాష్ట్రవ్యాప్తంగా, హనుమకొండ జిల్లాలో ఎలాంటి ప్రభుత్వాల అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు బుక్కులు, పెన్నులు, షూ, టై వంటి వాటిని అక్రమంగా అమ్ముతూ లాభార్జనే ధ్యేయంగా నడిపిస్తున్నారని అన్నారు. జీవో 1,10,92,42.. లను ఉల్లంఘించి జిల్లాలో ఇష్టానుసారంగా ఫీజులు పెంచి, పెంచిన ఫీజులను నోటీస్ బోర్డులో పెట్టకుండా, స్మార్ట్ పేర్లను జోడిస్తూ, గ్రౌండ్, నిబంధనలకు అనుగుణంగా విశాలమైన తరగతి గదులు లేకుండా నడిపిస్తున్నారనీ, అయినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. వెంటనే అధికారులు మొద్దు నిద్ర వదిలి విద్యా వ్యాపారం చేస్తున్న నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యా శాఖ అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని జిల్లా అధ్యక్షుడు ప్రణీత్, కార్యదర్శి భాషబోయిన సంతోష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, కుమార్, వేల్పుల చరణ్, జిల్లా సమితి సభ్యులు శ్రీపతి వినయ్, చిర్ర సాయి చందు, కొండ చరణ్, బన్నీ అభిలాష్ లతోపాటు తదితర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## నెల రోజుల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** కళ్యాణ మంటపం పెండింగ్ పనులు నెల రోజులలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర కళ్యాణ మంటపాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ మంటపం పనులు ఇంకా పూర్తి కాలేదని మిగిలిన పెండింగ్ పనులు ఆగష్టు మొదటి వారం వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. అదనంగా రూ.47లక్షలతో వివిధ పనులు పూర్తి చేయాలని సూచించారు. శుభకార్యాలు చేసుకునే వారికి కళ్యాణ మంటపం సౌకర్యంగా ఉంటుందన్నారు. ఆయన వెంట డీపీఎం రాజేంద్ర ప్రసాద్, డీఆర్డీవో ఏపీడీ నూరోద్దిన్, ఎంపీడీవో ఆవుల రాములు, ఎంపీవో రవీందర్, ఏపీఎం నరేందర్, వెంకన్న, మండల సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి , కార్యదర్శి సుమలత, తదితరులున్నారు.

## పదవీ విరమణ అనంతరం సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పదవీవిరమణ అనంతరం పోలీస్ అధికారులు తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ సుధీర్ఘ కాలం పని చేసి పదవీవిరమణ చేసిన పోలీస్ అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ సొమవారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేసారు.పదవీ విరమణ పొందిన వారిలో ఎస్.ఐలు విద్యాసాగర్, గాలిబ్, సూర్యనారాయణ, పిలిప్ రాజు, యాకుబ్, ఏఎస్ఐ లు గౌస్ పాషా, నాగేందర్ సింగ్, సంపత్, శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ వున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మీ సేవలు నేటి తరం పోలీసులకు అదర్శంగా నిలుస్తుందని, నేటి ఈ ప్రశాంత వాతావరణానికి మీ సేవలే కారణమని, మీ అందించిన సేవలు మరువమని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమములో అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసిపిలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పదవీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గోన్నారు.

## ఇండ్ల పట్టాలకు స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కాటాపూర్ గ్రామంలో గత రెండు సంవత్సరాల క్రితం 2023 సంవత్సరంలో ఒక్కొక్కరికి 75 గజాల ఇంటి స్థలాన్ని 108 మంది లబ్దిదారులకు అందజేశారని వాటిని ఎవరికి వారికి అందిస్తే వారు గుడిసెలు వేసుకుంటారని మాజీ జడ్పిటిసి రామ సహాయం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం ఇంటి పట్టాలు ఇచ్చిన లబ్దిదారులతో కలిసి ములుగు జిల్లా కలెక్టర్‌కు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామ సహాయం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల క్రితం బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఒక్కొక్కరికి 75 గజాల చొప్పున 108 మంది లబ్దిదారులకు ఇంటి పట్టాలు అందించారని ఎప్పుడు అధికారులు ప్రభుత్వం దానిని తాత్కారం చేస్తున్నారని మండిపడ్డారు. అప్పుడు ఇంటి స్థలాలు ఇవ్వడంతో లబ్దిదారులు ఎంతో సంతోషించారని అయితే అధికారులు తిరిగి ఆ స్థలాలను ఎందుకు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. అనేకసార్లు ఎంఆర్ఓ, కలెక్టర్‌ను కలిసిన కూడా వారి సమస్యలు విన్నవించిన కూడా పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో దిడ్డి మోహన్‌రావు, మాజీ సర్పంచ్ పూలూరి గౌరమ్మ, నరసింహారావు, సత్యం, సాయిరి లక్ష్మి నరసయ్య, వహీద్, లంజబెల్లి రాంబాబు, వెంకటేష్, లబ్దిదారులు, పాల్గొన్నారు.

## నేడు సిపిఐ మండల మహాసభ

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం :** మండల పరిధిలోని గంగోలు గ్రామం వివి ఆర్ పంక్షన్ హాల్‌లో సిపిఐ 20వ మండల మహాసభ మండల కార్యదర్శి రావుల పల్లి రవికుమార్ అధ్యక్షతన నేడు జరగనుంది. ఈ మహాసభకు జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య హాజరు కానున్నారు. ఈ సభా వేదిక ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ వాగ్దానాల అమలు కోసం పోరాటాలు నిర్వహించేందుకు ఈ సభాప్రాంగణం వేదిక కావాలని మండల కార్యదర్శి రావుల పల్లి రవికుమారు సోమవారం పిలుపునిచ్చారు. మండలంలో పోడు సాగు రైతులకు సిపిఐ అండగానిలిచి పట్టాలు ఇప్పించడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. అయినప్పటికీ మరికొంతమందికి పోడు పట్టాలు అందలేదని వారు తెలిపారు. మండలంలో మిగిలిన పోడు సాగు దారులకు పట్టాలు అందేలా కృషి చేస్తుందని తెలిపారు.

## కాల్వపూడికతీసి పునరుద్ధరణ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద గల ఈదుల చెరువు అలుగుకాల్వ పూడికతీసి సోమవారం పుణరుద్ధరించారు. 100రోజుల ప్రణాళికలో భాగంగా..కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కాలువలో చికెన్, చేపలు, మటన్‌షాపుల వ్యర్థాలను వేస్తున్నట్లు గుర్తించారు. తక్షణమే మున్సిపాలిటీ అధికారులను కాలువలో వేయకుండా చూడాలని ఆదేశించారు. పట్టించుకోకుండా వ్యర్థాలను పడేసినవారిపై చట్టపరంగా జరిమాన విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బానోత్ హరి, దివ్య ఉన్నారు.




## కమ్యూనిస్టు పార్టీకి అంతం లేదు

సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

**ప్రజాపక్షం/ఇల్లందు :** టేకులపల్లి మండల సిపిఐ పార్టీ 13వ మహాసభ సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి అంతం లేదన్నారు. ప్రజలు బూర్జువా పార్టీల పట్ల విముఖత చూపుతూ కమ్యూనిజం వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ప్రజల సమస్యలే ఎజెండాగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.సారయ్య, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జములయ్య, కొత్తగూడెం పట్టణ నాయకుడు రమేష్, సిపిఐ జిల్లా నాయకుడు గూగులోత్ రామ్‌చందర్, మండల నాయకులు అయిత శ్రీరాములు, ఎజు భాస్కర్, గూగులోత్ శ్రీను, కిర్లపూడి సుందర్‌పాల్, ఐల నాగార్జునచారి, దేగల రమేష్, గూగులోత్ సోనీ, రాయల ఇందిరా, వీరన్న, జోగ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాని మోదీ విధానాలపై ఉద్యమిద్దాం

ఎఐవైఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ

జులై 2న హైదరాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** భారత దేశ ప్రయోజనాలను, ప్రతిష్ఠను అమెరికాకు తాకట్టు పెడుతున్న ప్రధాని నరేంద్రమోదీ విధానాలపై ఉద్యమించాలని, ఎఐవైఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధానకార్యదర్శి నానబాల రామకృష్ణ యువతకు పిలుపునిచ్చారు. సోమవారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్డు వద్ద గల డిబిఆర్ సర్కిల్లో అమెరికా భారతీయుల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ప్లకార్డులతో ఆందోళన నిర్వహించారు. తొలుత అక్కడి సిపిఐ పార్టీ కార్యాలయంలో జులై 2న హైదరాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వత్తాసు పలుకుతూ దేశ సార్వభౌమత్వాన్ని ప్రతిష్టను నష్టపరిచే చర్యలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల భారత్, పాకిస్తాన్ యుద్ధాన్ని తానే ఆపానని చెప్పడం చూస్తే మన దేశ ప్రతిష్టను మోదీ ఎంతలా తాకట్టు పెట్టాడనడానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ప్రజల సొమ్ముతో చేసుకుంటూ దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. యువతకు అవసరమైన నిర్దిష్ట ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలేదని ధ్వజమెత్తారు. ట్రంప్‌ను ప్రపంచ అధ్యక్షుడిగా చేసేందుకే మోదీ విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధనాలకు వ్యతిరేకంగా ఆమెరికా రాయబార కార్యాలయ ముట్టడికి జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున్న యువజన సంఘం శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు ఉసికల రవి, జిల్లా సహాయకార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా కోశాధికారి కొల్లి రవి, 28వ డివిజన్ అధ్యక్షుడు రెబ్బగొండ్ల గోపి, కార్యదర్శి అక్కినపల్లి దేవయ్య, 29వ డివిజన్ అధ్యక్షుడు సన్నీ, కార్యదర్శి మిరియాల నరుణ్‌తేజ్, 30వ డివిజన్ కార్యదర్శి బంక అశోక్, యువజన సంఘం సభ్యులు మామిడాల కిరణ్, గుడిమెట్ల శ్రీకాంత్, సిపిఐ నాయకులు మేళ్లచెర్వు గురవయ్య, లగిశెట్టి రమేష్, బూర్ల రాము తదితరలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సైకోపాలన

మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

'చలో పూసుగూడెం' కార్యక్రమం అడ్డుకున్న పోలీసులు



**ప్రజాపక్షం/ములకలపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో సైకో పాలన నడుస్తుందని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వర రావు అన్నారు. సోమవారం సీతారామ ప్రాజెక్ట్ సాగు నీళ్ళను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని ప్రాంతాలకు అందించాలనే డిమాండ్‌తో బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతా రావు నేతృత్వంలో తలపెట్టిన 'చలో పూసుగూడెం' కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమానికి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును అరెస్ట్ చేసి ములకలపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70శాతం పనులు బిఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే పూర్తి చేశామని, మిగిలిన పనులు కూడా పూర్తి చేయడం చేతకావడంలేదని విమర్శించారు. పూర్తి చేయడం చేతకాకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజలను గాలికి వదిలేసి దోచుకునే పనిలోనే కాంగ్రెస్ వారు ఉన్నారని ఆరోపించారు. ముగ్గురు మంత్రులు ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు అన్యాయం జరుగుతుందని, రైతుల తరుపున మాట్లాడితే అక్రమ అరెస్టులు చేస్తారా అని విమర్శించారు. బిఆర్‌ఎస్ పరిపాలనలో తెలంగాణ సస్యశ్యామలంగా ఉంటే, కాంగ్రెస్ పరిపాలనలో పొలాలు ఎండిపోతున్నాయని అన్నారు. అరెస్టులకు భయపడే పార్టీ బిఆర్‌ఎస్ కాదని, ప్రజల తరుపున నిలబడుతాం, కోట్లాడుతామని అన్నారు. వెంటనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు నీళ్ల ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## రైతుల ఆర్థికాభివృద్ధికి ఏలూరి కృషి

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం సొసైటీ పరిధిలో రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు తిరుమలాయపాలెం సొసైటీ కార్యదర్శి ఏలూరి ఆనందరావు కృషి చేశారని సొసైటీ చైర్మన్ చావా వేణుగోపాలకృష్ణ అన్నారు. తిరమలాయపాలెం సొసైటీలో చిరు ఉద్యోగిగా 1984 సంవత్సరంలో చేరి ఎంతోమంది రైతుల మన్ననలు పొందిన ఏలూరి ఆనందరావు పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం తిరుమలాయపాలెం సహకార పరపతిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉండేటి దానయ్యకు సొసైటీ కార్యదర్శిగా పదోన్నతిని కల్పించారు. దీంతో ఆయన సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాలేరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారామరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ చామకుమారి రాజు, డైరెక్టర్లు కమ్మకొమటి నాగేశ్వరరావు, ఎడ్లపల్లి నవీన్, చల్ల వెంకటేశ్వర్లు, చావా విజయలక్ష్మి, వెంకట్రావు, సొసైటీ మాజీ చైర్మన్ పుసులూరి పుల్లయ్య, సిపిఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ, దానయ్య బీరోలు సొసైటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతో హక్కులు సాధించుకున్న కార్మికులు

జులై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు పిలుపు




**ప్రజాపక్షం/కల్లూరు :** 100 సంవత్సరాలుగా అనేక పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ, మోదీ నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా జులై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చారు. కల్లూరులో జరిగిన ఎఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కార్మికులకు ఈ రోజు హక్కులుగా ఏ చట్టాన్ని కూడా ఏ ప్రభుత్వము దయతోను, ఇష్టంతోనో చేయలేదన్నారు. ఆ చట్టాలన్నీ కార్మికులు తమ రక్తాన్ని చిందించి పోరాడి సాధించుకున్నవని వారు గుర్తుచేశారు. అటువంటి చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావాల్సిన అవసరమేంటన్నారు. నిజంగా మోదీకి కార్మికుల మీద అంత ప్రేమ ఉంటే, వారి సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి ఉంటే ఉన్న కార్మిక చట్టాలను పట్టిష్టంగా అమలు చేయాలన్నారు. కానీ కార్మికుల హక్కులను కాలరాసే విధంగా చట్టాలను తొలగించి యాజమాన్యానికి అనుకూలంగా ఉండే లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి తన వక్రబుద్ధి చూపించారన్నారు. 2014–19, 2019 నుండి 24 మధ్యలో మోదీ ప్రభుత్వం సంఘటిత సంఘటితంగా కార్మికుల కొరకు ఖర్చు చేసిన మొత్తం లక్ష కోట్లు కూడా లేదన్నారు. పది సంవత్సరాల కాలంలో లక్ష కోట్లు కూడా లేవంటే సంవత్సరానికి కేవలం పది వేల కోట్ల రూపాయలు మాత్రమేనన్నారు. 10 సంవత్సరాల కాలంలో కార్పొరేట్ల శక్తులకు 16 లక్షల 53 వేల కోట్ల రుణాలను మాఫీ చేసినట్లు వారు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లాఉపాధ్యక్షులు వేము రాంబాబు, జిల్లా సమితి సభ్యులు దామాల దయాకర్ పాల్గొన్నారు.



## ఆదివాసీ మహిళలు చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పాలి

ఎమ్మెల్యే డా.తెల్లం

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆదివాసీ గిరిజన మహిళలు ఇంటిపట్టున ఖాళీగా ఉండకుండా చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి ఆర్థికంగా నిలదొక్కుకుని పదిమందికి ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం ఐటిడిఎలోని గిరిజన దర్బారుకు హాజరై గిరిజనుల సమస్యలపై ప్రాజెక్టు అధికారి బి.రాహుల్‌తో చర్చించిన అనంతరం చిన్న తరహాపరిశ్రమల ద్వారా న్యూట్రీషియన్ ఫుడ్ అమ్మకాలు జరిపే స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీ మహిళలు వారి సొంతగా తయారు చేసిన ఆరు రకాల సబ్బులు, షాంపులు, మిల్లెట్ బిస్కెట్లు, ఇప్పపువ్వు లడ్డు, ఇతర పచ్చళ్లను ఐటిడిఎ కార్యాలయానికి వచ్చే వారికి సరసమైన ధరలకు విక్రయించాలన్నారు. గిరిజన మహిళలకు ఉపాధి కల్పించేందుకు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ప్రతీ ఒక్కరూ కొనుగోలు చేసి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ మహిళలు విజయలక్ష్మి, సమ్మక్క, సున్నం ఈశ్వరి, స్వాతి, బేబి, రాణి, జగ్గాకుమారి పాల్గొన్నారు.

## బోనకల్‌లో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

పనిచేయని ట్రాన్స్‌ఫార్మర్లు ఇబ్బందులు పడుతున్న రైతులు




**ప్రజాపక్షం/బోనకల్ :** బోనకల్ మండలంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రైతుల పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి ఎస్సీ కార్పొరేషన్ లిఫ్టుకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ గత రెండు నెలలుగా పనిచేయటంలేదు. దీంతో రైతులు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగు చేయాలని సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవటంలేదని రైతులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగుచేయాలని లైన్‌మెన్‌ను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పటమే కాకుండా ప్రైవేట్ వ్యక్తులకు పనిచేయిస్తున్నాడని రైతులు ఆరోపించారు. రైతులకు సరైన గిట్టుబాటు ధర లేక ఏదో ఉన్నంతలో ఎంతోకొంత వ్యవసాయం చేసుకుందామని ఆశపడుతున్న రైతులకు లైన్‌మెన్ వలన సరైన సమయానికి నార్లుపోసుకోక, పంటలు దిగుబడి రాక రైతన్నలు అప్పులు పాలు కావాల్సివస్తుంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను బాగుచేసి రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

## ఉద్యోగులుగా నిర్విరామ సేవలు అభినందనీయం

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజలకు నిర్విరామంగా సేవలు అందించిన ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జూన్ నెలలో పదవీ విరమణ పొందుతున్న 22మంది ఉద్యోగుల కోసం సన్మాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు తమ జ్ఞాపకాలను, అనుభవాలను ప్రస్తుత ఉద్యోగులతో పంచుకోవాలని కలెక్టర్ కోరారు. 30 నుండి 40 సంవత్సరాల పాటు ప్రభుత్వ రంగంలో సేవలు అందించడం చాలా గొప్ప విషయం అని, జీవితంలో ఒక ముఖ్యమైన భాగం ముగిసి, మరో అంకం ప్రారంభం అవుతుందని అన్నారు. జీవితంలో మనం చేసిన మంచి పనులు శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. ప్రజలకు వివిధ ప్రభుత్వ శాఖలలో దశాబ్దాల పాటు సేవలు అందించిన ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు భగవంతుని అశీస్సులు ఉండాలని, మిగిలిన జీవితం ఆరోగ్యంతో, ఆనందంతో, ప్రశాంతంగా గడవాలని కోరుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. దశాబ్దాల కాలంగా ప్రజలకు సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఎ.పద్మశ్రీ, డిఆర్డీ ఎన్ సన్యాసయ్య, చింతకాని తహసీల్దార్ కె అనంతరాజు, డిప్యూటీ తహసీల్దార్ సిహెచ్. సత్యనారాయణ, జిల్లా అధికారులు, పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు, వివిధ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారుల కృషి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావాణిలోవచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చొరవచూపాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. ఐడిఒసిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఆయన హాజరై ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ప్రతీ దరఖాస్తులను పరిశీలించన ఆయన ఆయాశాఖల అధికారులకు బట్వాడా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వ్యయప్రయాసలకు ఓర్చి ప్రజలు ఇక్కడికి వచ్చి ఎంతో నమ్మకంతో దరఖాస్తులు సమర్పిస్తుంటారని చెప్పారు. వాటిని మాములుగా వదిలేయకుండా ప్రతిదాన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిష్కారానికి నోచుకోనివాటిపై సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. గిరిజన దర్భారులో ఐటిడిఎ పరిధిలోని గ్రామాలకు చెందిన గిరిజనులు వారివారి సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఐటిడిఏలో నిర్వహించిన గిరిజన దర్బారుకు హాజరై పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వాటిని స్వీకరించిన పిఒ సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, వర్షాలు పడుతున్నప్పటికీ గిరిజనులు వారి సమస్యల పరిష్కారం కోసం వ్యయ ప్రయాసలకు ఓర్చి ఇక్కడికి వచ్చారన్నారు. అధికారులు వారి నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా అందిన ప్రతి దరఖాస్తు సమస్యను పరిష్కరించేందుకు కృషిచేయాలని ఆదేశించారు. పరిష్కరించడానికి వీలుకాని వాటిపై సహేతుకమైన నివేదికలు అందించాలన్నారు. ప్రభుత్వపథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందుతాయని, అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ గిరిజన దర్భారులో ఎపిఒ జనరల్ డేవిడ్ రాజ్, ఎఒ సున్నం రాంబాబు, ఆర్‌సిఒ గురుకులం అరుణకుమారితో పాటు పలుశాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కెజిబివి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/బోనకల్ :** కెజిబివి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టిఎస్‌యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైమ్స్ స్కేల్ ఇవ్వాలని, ఆప్షన్ హాలీడేస్ వినియోగించుకునే సౌకర్యం కల్పించాలని, సమ్మెకాలపు జీతాన్ని చెల్లించాలని మే నెల వేతనాలు చెల్లించాలని, హెల్త్ కార్డ్స్ మంజూరు చేయాలని, వ్యాయామ ఉపాధ్యాయులకు సిఆర్టీలతో పాటు వేతనం చెల్లించే విధంగా జీవో విడుదల చేయాలని, కేర్‌టేకర్ నియమించాలని, గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సదాబాబు, మండల అధ్యక్షులు చిన్న రంగారావు, మండల కార్యదర్శి పి.నర్సింహారావు, ఎం.లవకుశ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఒఎఫ్‌ఆర్ హక్కులు ఎవరికో పిఒ తేల్చాలి

పాయం సత్యనారాయణ

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆర్‌ఒఎఫ్‌ఆర్ హక్కులు గిరిజనులకా, గిరిజనేతరులకు చెందుతాయా అనేది ఐటిడిఎ పిఒ తేల్చాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఐటిడిఎ పిఒకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం పాయం మాట్లాడుతూ చర్ల మండలం కుదునూరు పంచాయతీ పరిధిలోని పోడుభూముల సమస్య గిరిజనేతరులతో తలెత్తుతోందని, ఈ సమస్యకు పిఒ పరిష్కారం చూపాలన్నారు. తాలిపేరు కెనాల్ పక్కన గల పోడుభూములు నరికిన సందర్భంగా 1993 సంవత్సరంలో దేవరపల్లి ఆదివాసీలైన 14 మందిపై అటవీ అధికారులు కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. ఆ భూములను 2008లో కుదునూరు గ్రామానికి చెందిన పవన్ అనే గిరిజనేతరుడు ఆ భూముల విషయంలో జోక్యం చేసుకుని గొడవలు సృష్టిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడని అన్నారు. 2018లో అదే గ్రామానికి చెందిన బుటారి రాఘవయ్య అనే వ్యక్తిని అతి కిరాతకంగా హత్య చేసిన వలస గిరిజనేతరులు మళ్లీ ఆ పోడు భూముల విషయంలో ఆదివాసీలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో ఐటిడిఎ అధికారులు చొరవ చూపి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారం సాయమ్మ, కారం శాంతి, తెల్లంస రోజ, కారం సుధా, కారం లక్ష్మీ తదితరులున్నారు.

## కాంగ్రెస్, బిజెపి ఒకే తాను గుడ్డలు

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం

**ప్రజాపక్షం/చింతకాని :** కాంగ్రెస్, బిజెపి పార్టీలు రెండూ ఒకే తాను గుడ్డలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం చింతకానిలో జరుగుతున్న పార్టీ శిక్షణా తరగతుల్లో పొన్నం మాట్లాడుతూ కేంద్రంలో మోదీ తీసుకువచ్చిన నల్లచట్టాలతో అటు రైతులు, ఇటు శ్రామికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్పొరేట్లకు దోచిపెడుతూ పేదలపై పన్నుల భారం మోపుతున్నారన్నారు. మోదీ చెప్పిన అచ్చే దిన్ అదానీ, అంబానీలకు మాత్రమేనని సామన్యులకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీనీ అమలు చేయడంలేదన్నారు.రైతు రుణమాఫీలో పూర్తిగా విఫలమైందన్నారు. కేవలం మహిళలకు ఉచిత బస్సు తప్ప అంతా తుస్సేనన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై త్వరలోనే ప్రజా ఉద్యమాలు చేపడాతామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో చింతకాని మండలంలో ఎర్ర జెండా ఎగరడ ఖాయమన్నారు. ఈసమావేశంలో పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండలకార్యదర్శి రాచబంటి రాము, మండలకమిటీ సభ్యులు వత్సవాయి జానకిరాములు, తోటకూరి వెంకటనర్సయ్య, పులి యజ్ఞనారాయణ, దేశబోయిన ఉపేందర్, షేక్ మౌలానా, సత్యం తదితరులు పాల్గొన్నారు.




## శేషజీవితం ప్రశాంతంగా గడపాలి

ఎస్‌పి రోహిత్ రాజ్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పదవీ విరమణ పొందిన పోలీసులు తమ శేష జీవితాన్ని సంతోషంగా హాయిగా గడపాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. సోమవారం పదవీ విరమణ పొందిన పోలీసులను ఆయన తన కార్యాలయంలో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ 41 సం. పాటు పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రస్తుతం ఏడూళ్లబయ్యారంలో విధులు నిర్వహిస్తూ ఎస్సైగా పదవీ విరమణ పొందిన మొహమ్మద్ షఫీ, 36సం. నుండి పోలీసు ఉద్యోగంలో సేవలు అందిస్తూ భద్రాచలం ట్రాఫిక్ ఎఎస్సై సత్యనారాయణ, అశ్వాపురంలో విధులు నిర్వహిస్తూ హెడ్ కానిస్టేబుల్‌గా పదవీ విరమణ పొందిన చిన్న వెంకటేశ్వర్లు నిబద్ధతతో ఇంతకాలం విధులు నిర్వహించారన్నారు. పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బంది సంతోషంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకోవాలని సూచించారు. క్రమంగా వ్యాయామం, యోగా, ధ్యానం చేయాలని, తద్వారా మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి సత్యనారాయణ, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్‌ఐ కృష్ణారావు, ఏఓ మంజ్యానాయక్, జిలాల్ పోలీస్ అధికారుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ జలాలను జిల్లా రైతులకు ఇవ్వాలి


* బిఆర్‌ఎస్ నాయకులు అరెస్ట్

**ప్రజాపక్షం/పాల్వంచ :** సీతారామ ప్రాజెక్టు జలాలకు ఇవ్వాలని శనివారం బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ములకలపల్లి మండలం పూసుగూడెంలో నిర్మించిన పంప్‌హౌజ్ దగ్గర కాంగ్రెస్ పార్టీకి పిండ ప్రధాన కార్యక్రమం చేపట్టింది. దీనికి హాజరయ్యేందుకు వెళుతున్న పినపాక, కొత్తగూడెం, ఇల్లందు మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియా నాయక్‌లతో పాటుగా ఏనుగుల రాకేష్ రెడ్డి, దిండిగాల రాజేందర్, పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ వైస్ చైర్మన్, కాంపల్లి కనకేష్, కొత్తగూడెం మున్సిపాలిటి మాజీ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, పాల్వంచ పట్టణ, మండల అధ్యక్షులు మంతపురి రాజుగౌడ్, పూసల విశ్వనాధం, కాలేరు సింధు, వనమా రాఘవేందర్ రావు తదితరులను పాల్వంచ పట్టణ పోలీసులు కుంటినాగులగూడెం వద్ద అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేక మాయమాటలతో కాలం వెల్లదీస్తుందని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ జిల్లాను సస్య శ్యామలం చేయటానికి సీతారామ ప్రాజెక్టును 18 వేయిల కోట్ల నిర్మించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడ

## 'వింబుల్డన్'.. షురూ

### రికార్డు స్థాయిలో ప్రైజ్ మనీ



ప్రతిష్టాత్మక వింబుల్డన్ టెన్నిస్ టోర్నమెంట్ –2025 సోమవారం నుండి ప్రారంభమైంది. ఈ సంవత్సరం వింబుల్డన్ టోర్నమెంట్ సరికొత్త టెక్నాలజీతో జరగబోతోంది. 147 సంవత్సరాల వింబుల్డన్ చరిత్రలో మొదటిసారిగా మానవ లైన్ జడ్జీలు లేకుండా నిర్వహించనున్నారు. జడ్జీల స్థానంలో 450 కంటే ఎక్కువ ట్రాకింగ్ కెమెరాలతో కూడిన పూర్తిగా ఆటోమేటెడ్ ఎలక్ట్రానిక్ లైన్‌కాలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. అయితే, లైన్ జడ్జిలు లేకపోవడం, కొత్త ఎలక్ట్రానిక్ వ్యవస్థ దోషరహిత తీర్పు వచ్చే అవకాశం కూడా ఉందని విమర్శలు వస్తున్నాయి. జూన్ 30 నుంచి జూలై 13 వరకు ఈ మెగా టోర్నమెంట్ 14 రోజుల పాటు కొనసాగనుంది.

**భారీగా ప్రైజ్ మనీ**

ఈసారి వింబుల్డన్ ప్రైజ్ మనీని రికార్డు స్థాయిలో రూ.622 కోట్లకు (53.5 మిలియన్ పౌండ్లు) పెంచారు. ఇది, గత సంవత్సరం కంటే దాదాపు రూ.41 కోట్లు ఎక్కువ. మొదటి రౌండ్‌లో ఓడిపోయిన ఆటగాడికి దాదాపు రూ.76.80 లక్షలు (66,000 పౌండ్లు) లభిస్తాయి. ఇది గతసారి కంటే 10శాతం ఎక్కువ. డబుల్స్ విజేతలు రూ.6,80,000 (రూ.7.87 కోట్లు) అందుకుంటారు. అలాగే, మిక్స్‌డ డబుల్స్ విజేతలు రూ.1,35,000 (రూ. 1.56 కోట్లు) లభించనుంది.

**హ్యాట్రిక్ టైటిల్ కోసం బరిలోకి అల్కరాజ్**

రెండుసార్లు డిఫెండింగ్ పురుషుల ఛాంపియన్ అయిన స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్.. హ్యాట్రిక్ టైటిల్ కోసం బరిలోకి దిగుతున్నాడు. వింబుల్డన్ మొదటి రోజు సోమవారం పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో ఇటలీకి చెందిన ఫాబియో ఫోగ్నినితో అల్కరాజ్ తలపడనున్నాడు. ఇక, మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్ వన్ అరినా సబలెంకా తన తొలి రౌండ్ మ్యాచ్‌లో కెనడా క్రీడాకారిణి కార్సన్ బ్రాన్‌స్టెయిన్‌ను ఢీకొనబోతోంది.



## దుబాయ్ వేదికగా వరల్డ్ సూపర్ కబడ్డీ లీగ్

### ఫిబ్రవరిలో తొలి సీజన్

ఐపిఎల్ రాకతో పొట్టి క్రికెట్ దశ మారినట్టే అన్ని ఆటల రూపరేఖలు కూడా మరిపోతున్నాయి. ఇంతకు ముందు మట్టికోర్టు ఆటగా పేరొందిన కబడ్డీకి ప్రో కబడ్డీ లీగ్‌తో ప్రపంచవ్యాప్తంగా ఎనలేని గుర్తింపు సాధ్యమైంది. పీకేఎల్ తరహాలోనే మరో లీగ్ ఫ్యాన్స్‌ను అలరించనుంది. అయితే.. భారత గడ్డపై కాకుండా విదేశీ నేలపై ఈ లీగ్ జరుగనుంది. వరల్డ్ సూపర్ కబడ్డీ లీగ్ తొలి సీజన్ దుబాయ్ వేదికగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. మొత్తం 30 జట్లు పాల్గొనే ఈ టోర్నీ వచ్చే ఏడాది ఫిబ్రవరి – మార్చి మధ్యలో జరుగనుందని సమాచారం. పీకేఎల్ విజయవంతం కావడంతో వరల్డ్ సూపర్ కబడ్డీ లీగ్ కూడా హిట్ అవుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. ఇందుకు అంతర్జాతీయ కబడ్డీ సమాఖ్య కూడా పచ్చజెండా ఊపింది. దాంతో, ఎనిమిది ఫ్రాంచైజీ జట్లతో ఈ లీగ్‌ను జరపాలనే ఆలోచనతో ఉన్నారు ఆర్గనైజర్స్. 'కబడ్డీకి ప్రేక్షకాదరణ చాలా ఎక్కువ. అందుకే ఈ ఆటను భారత్‌లోనే కాకుండా విశ్వమంతా వ్యాప్తి చేయాలనుకుంటున్నాం. అందుకే.. వరల్డ్ సూపర్ కబడ్డీ లీగ్‌ను నిర్వహించాలనుకుంటున్నాం. ఈ లీగ్‌లో వరల్డ్ స్టేజిపై కబడ్డీ అనే మా లక్ష్యం నెరవేరుతుంది. ఈ టోర్నీతో ప్రతిభావంతులను వెలుగులోకి తేవడంతో పాటు ఈ ఆటకు ఒలింపిక్ గుర్తింపు కూడా తీసుకురావాలని భావిస్తున్నాం. ఎనిమిది జట్లతో జరుగబోయే తొలి ఎడిషన్ వేలంలో ఆటగాళ్లను కొనేందుకు రూ.48 కోట్ల పరిమితి విధించాలని అనుకుంటున్నాం' అని ఎస్‌జే అప్‌లిఫ్ట్ కబడ్డీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సంభవ్ జైన్ వెల్లడించాడు. డబ్ల్యూఎస్కేఎల్ ప్రతిపాదనకు పలు దేశాలు మద్దతు తెలుపుతున్నాయి. కబడ్డీని ఎంతో ఇష్టపడే దక్షిణ కొరియా, ఇరాన్, థాయ్‌లాండ పాకిస్థాన్, మలేషియా, జపాన్, కెనడాలతో పాటు అమెరికా సైతం కొత్త లీగ్ తొలి సీజన్ కోసం ఎదురుచూస్తున్నాయి.

## విశ్వ వేదికపై మెరిసిన ఆయుష్..

### కెరియర్‌లో తొలి టైటిల్ కైవసం!



భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి కెరియర్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ టూర్ టైటిల్ సాధించాడు. యూఎస్ ఓపెన్ సూపర్ 300 టోర్నీలో విజేతగా అవతరించాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో మూడో సీడ్‌కు షాకిచ్చి.. మువ్వన్నెల జెండాను రెపరెపలాడించాడు. ఈ సీజన్‌లో భారత షట్లర్ల తరఫున మొదటి టైటిల్ దేశానికి అందించాడు. అయితే.. మహిళల సింగిల్స్‌లో ఫైనల్ చేరిన తన్వీ శర్మ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. యూఎస్ ఓపెన్ సూపర్ 300 టోర్నీలో ఆయుష్ సంచలన విజయాలతో ఔరా అనిపించాడు. సెమీ ఫైనల్లో చౌ థియెన్ చెన్‌పై అద్భుత విక్టరీతో ఫైనల్‌కు దూసుకెళ్లాడు ఆయుష్. అతడిపై భారత షట్లర్‌కు ఇది మూడో విజయం. టైటిల్ పోరులో 20 ఏళ్ల ఆయుష్ ధాటికి యాంగ్ నిలవలేకపోయాడు. 47నిమిషాల పాటు సాగిన పోరులో 21–18, 21–13తో ప్రత్యర్థిని మట్టికరిపించి కలల ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. 'ఈ విజయం నాకు చాలా అమూల్యమైంది. సీనియర్ విభాగంలో నేను గెలుపొందిన తొలి టైటిల్ ఇది. సో నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ టోర్నీ ద్వారా ఎన్నో సానుకూలాంశాలు నేర్చుకున్నా. ఇక్కడ నేను అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాను. వచ్చేవారం మొదలవ్వనున్న కెనడా ఓపెన్ మీద దృష్టి సారించాలనుకుంటున్నా' అని ఆయుష్ భావోద్వేగంతో చెప్పాడు.

## ఫోకస్ యువతరంగం

## వెర్రితలలు వేస్తున్న మోడర్న్ కల్చర్



అత్యాధునికత పేరుతో విచ్చలవిడితనం పెచ్చరిల్లుతున్నది. ప్రేమ... అక్రమ సంబంధాలు వంటి కారణాలతో తల్లిదండ్రులను, కట్టుకున్న జీవిత భాగస్వామిని హత్య చేసే దిక్కుమాలిన సంస్కృతి ప్రవేశించింది. 'సహజీవనం' పేరుతో కొనసాగుతున్న విశృంఖలత్వం జుగుప్సాకరంగా మారుతున్నది.

ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాదు వంటి మెట్రో నగరాల్లో ఇప్పటికే సహజీవన సంసారాలు (లివిన్ రిలేషన్‌షిప్), డేటింగ్ కల్చర్స్, సిచువేషన్‌షిప్ రిలేషన్స్ లాంటి పాశ్చాత్య పోకడలు పెరిగిపోతున్నాయి. మహానగరాల్లో విద్యార్థినీవిద్యార్థులు, ఉద్యోగాలు చేస్తున్న యువత జనాభా దినదినం పెరగడం జరుగుతోంది. డిజిటల్ యుగపు యువత జీవనశైలిపై పాశ్చాత్య దేశాల ప్రభావం క్రమంగా పెరుగుతున్న వేళ నేడు మెట్రో నగరాల్లో మరో అంకానికి తెరలేస్తున్నది. దీనినే ఆధునిక పరిభాషలో కోలివింగ్ పిజీ (పేయింగ్ గెస్ట్) కల్చర్ అని పిలుస్తున్నాం. మహానగరాల్లో స్టూడెంట్స్, యువ ఉద్యోగుల సంఖ్య విపరీతంగా పెరిగి పోవడంతో గృహ వసరులు, హాస్టల్ వసతులు తగ్గుతూ, మరో సంస్కృతికి తెర లేస్తున్నది. యువత అభిరుచులకు అనుగుణంగా సహజీవన పేయింగ్ గెస్ట్ (లేదా నగదు చెల్లించే అతిథి) లేదా కోలివింగ్ పిజీ రూమ్‌లు నేడు పుట్టుకురావడం చూస్తున్నాం. మహానగరాల్లో చదువుతున్న లేదా ఉద్యోగాలు చేస్తున్న 20 నుంచి 30 ఏండ్ల వయస్సు కలిగిన యువతీ యువకులు పూర్తి స్వేచ్ఛను, తమ అభిరుచులకు అనుగుణంగా జీవితాలను గడపడం లాంటి విషయాలు పరిగణనలోకి తీసుకుని మహానగర భవన యాజమాన్యాలు లేదా వ్యాపారవేత్తలు లేదా ఔత్సాహికులు సహజీవన పిజీ గదులను నడపడం, వాటికి క్రమంగా ఆదరణ పెరగడం జరుగుతున్నది. ఒక్కొక్కరికీ తమకు ఇష్టమైన వారితో ఒకే రూంలో కొన్ని నెలలు లేదా ఏండ్లు తమ జీవితాలను గడపడం నేటి కల్చర్ అయిపోయింది. ఇలాంటి సహజీవన పిజీ అకామడేషన్ లాంటి విలాసవంతమైన సదుపాయాలతో గృహ వసతులు అందుబాటులోకి రావడం, వీటికి యువత నెలకు రూ.20,000 నుంచి రూ. 45,000 వరకు కిరాయి చెల్లించడం జరుగుతున్నది. మంచి సదుపాయాలు కలిగిన ఒకే రూంలో ఇద్దరు యువకులు లేదా ఇద్దరు యువతులు లేదా వివాహం కాని ఒక యువకుడు ఒక యువతి ఒకే గదిలో సహజీవన పిజీ సౌకర్యాలను పొందడం చూస్తున్నాం. ఇలాంటి కోలివింగ్ పిజీ గదుల్లో అసాంఘీక కార్యకలాపాలకు కూడా ఆస్కారం ఉండడం, కొన్ని సందర్భాల్లో పోలీసుల దీవెనలు కూడా అందడం, మరి కొన్ని సందర్భాల్లో అవసరమైన యువకులకు అమ్మాయిలను ఏర్పాటు చేయడం (అరేంజ్ ఏ గర్ల్) లాంటి వసతులు కూడా ఇలాంటి గదుల్లో జరుగుతున్నానే వార్తలు వింటున్నాం. సహజీవన పిజీ గదుల్లో ఉచిత వైఫై, టివీ, వాషింగ్ మెషీన్, ఫ్రిజ్ లాంటి అన్ని సౌకర్యాలను కల్పిస్తూ అధిక మొత్తంలో డబ్బు లాగడం జరుగుతోంది. కరోనా కాలం నుంచి పెరిగిన ఇలాంటి సంస్కృతులతో తల్లిదండ్రులకు దూరంగా యువత విచ్చలవిడిగా, అపరిమిత స్వేచ్ఛతో పెళ్లి ముందే ఆడ మగ కలిసి ఒకే గదిని పంచుకోవడం, అన్ని రకాల అనుభవాలను పొందడం సాధారణంగానే జరుగుతోంది. కోలివింగ్ పిజీ కల్చర్ ద్వారా ఎక్కువ కాలం పాటు యువత ఒకే గదిలో సహజీవనం చేస్తూ తమ తమ పనులను చేసుకుంటూ, హద్దులు లేని పూర్తి స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. నేటి యువత పెళ్లికి ముందే అన్ని అనుభవాలను రుచి చూడడానికి పరుగులు పెడుతూ భారతీయ సంస్కృతి, సంస్కారం, శీలం లాంటి పదాలను పరిహాసం చేయడం ఆక్షేపణీయం. ఇలాంటి విపరీత ధోరణి పెరగడంతో రానున్న రోజుల్లో యువత మరే విచిత్ర ప్రపంచంలోకి అడుగుపట్టనున్నారో అంటూ నిన్నటి తరం పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం మాదక ద్రవ్యాల అలవాటుకు వ్యతిరేకంగా భారీ క్యాంపెయిన్‌ను నిర్వహించింది. గ్రామం నుంచి నగరం వరకూ అన్ని స్థాయిల్లోనే భారీగానే కార్యక్రమాలు జరిగాయి. యువతలో మదక ద్రవ్యాల వినియోగం పెరగడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని చేపట్టడం ముదావహం.

### మార్పు రావాలి..

దేశవ్యాప్తంగా 10 నుంచి 17 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు 1.58 కోట్ల మంది మాదక ద్రవ్యాల దురలవాటు కోరల్లో చిక్కారని ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దాదాపు 16 కోట్ల యువత ఆల్కహాల్ సేవనానికి అలవాటు పడ్డారని, 5.7 కోట్ల మంది ఆల్కహాల్ సేవనంతో తీవ్ర అనారోగ్యాలపాలు అవుతూ చావుకు దగ్గరయ్యారని ఈ నివేదికల సమాచారం. మాదక ద్రవ్యాల దురలవాటు చికిత్స పొందిన వారితో 63.6 శాతం మందికి 15 ఏండ్ల లోపే ఈ దురలవాటు బారిన పడ్డారు. ఆల్కహాల్, కన్నాబిస్, ఓపియం దురలవాటు ఉన్న వారిలో 18 ఏండ్ల లోపు వారే అధికంగా ఉండడం బాధాకరం. ఇకనైనా మార్పు వచ్చి, యువ మాదక ద్రవ్యాలను దరిచేయనీయకుండా ఉంటే వ్యక్తిగతంగా వారికి, స్థూలంగా దేశానికి ప్రయోజనకరం. ఈ యజ్ఞంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధుల వరకూ అందరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## నరేంద్రమోదీ విధానాలపై ఉద్యమిద్దాం

### ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ




**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** దేశ ప్రయోజనాలను, ప్రతిష్టను అమెరికాకు తాకట్టు పెడుతున్న నరేంద్రమోదీ విధానాలపై ఉద్యమించాలని, భారతీయులపై అమెరికా దుర్మార్గపు చర్యలను ఆపాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జూలై 2న ఛలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను వరంగల్‌లోని ఎల్బీనగర్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ నరేంద్రమోదీ విధానాలు దేశానికి ప్రమాదకరమని, దేశాన్ని తిరోగమన దిశలో తీసుకెళ్లే విధానాలను అనుసరిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వత్తాసు పలుకుతూ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రతిష్టను నష్టపరిచే చర్యలను దేశ పౌరులు తిప్పికొట్టాలన్నారు. భారత పౌరులపై అమెరికా దుర్మార్గంగా వ్యవహరించడాన్ని అభ్యంతరం చెప్పడంలో విఫలమవడం ద్వారా మరోసారి తన క్రూరమైన వైఖరిని బహిర్గతం చేసిన మోదీ ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటన్నారు. దేశరక్షణకు ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చామన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, వేణు, గోపాల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలు

### ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** విద్యా హక్కు చట్టాన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు తుంగలో తొక్కి, విద్యా వ్యాపారం చేస్తున్నాయని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్ల పేరిట అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ధనార్జనే ధ్యేయంగా విద్యార్థుల నుండి 2000 నుండి 5000రూపాయల వరకు అడ్మిషన్ ఫీజుల పేరిట వసూలు చేస్తున్నారని, ఫీజు చెల్లించకుంటే అడ్మిషన్లు లేదని తల్లిదండ్రులను ఇబ్బందుల గురిచేస్తున్నారన్నారు. ఫీజుల నియంత్రణ చట్టం అమలు కాకపోవడంతో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు దొరికినంత ఫీజులు దోచుకుంటున్నాయన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు దోపిడీని అరికట్టాల్సిన విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పాఠశాలలను నడిపినా, అక్రమంగా ఫీజులు వసూలు చేసినా ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దాడులు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మొలుగూరి నితిలేష్, జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, రామగుండం మండల అధ్యక్షులు మాతంగి సాగర్, ధనాల దినేష్, తడిగొప్పుల సాయి అనుప్, గంగ్రెటి శివ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామిక ఉద్యమాలు తీవ్రతరం

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి భిక్షపతి




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి:** సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని, పాలకవర్గాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజాస్వామిక ఉద్యమాలను తీవ్రతరం చేయాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ హనుమకొండ ఉత్తర మండల 2వ మహాసభ గుంటి రాజేందర్ అధ్యక్షతన జరి గింది. సమావేశానికి ముఖ్య అతిధిగా భిక్షపతి హాజరై మాట్లాడుతూ పేద ప్రజల అండ ఎర్రజెండా అని అని, ఇండ్ల స్థలాలు, పక్కా ఇండ్ల కోసం ఏండ్ల తరబడి సిపిఐ పోరాడుతూనే ఉన్నారన్నారు. పేదల కోసం పోరాటం చేసేది కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇండ్ల స్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చార ని, హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హనుమకొండ మండలంలో సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో ఉద్యమాలు ఉదృతం చేస్తామన్నారు. మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎన్ఎ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెంకట్రాజం, దామెర సుదర్శన్, అలువాల రాజు, రాముగోపాల్‌చారి, జూకంటి పద్మ, రమేష్, బాబు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక :** మహాసభలో సిపిఐ హనుమకొండ ఉత్తర మండల కమిటీని 25 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎన్ఎ స్టాలిన్, సహాయ కార్యదర్శులుగా గుంటి రాజేందర్, దామెర సుదర్శన్, కోశాధికారిగా అలువాల రాజులతో పాటు 25 మంది కౌన్సిల్ సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

## నక్సలైట్లను అంతం చేస్తామనడం దారుణం

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి




**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** దేశంలో సమస్యలు పరిష్కరించకుండా, నక్సలైట్లను అంతం చేస్తామని ప్రకటించడం దారుణమని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి విమర్శించారు. సోమవారం కెఎల్ మహేంద్ర నగర్ సిపిఐ శాఖ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరై మేకల రవి మాట్లాడుతూ నక్సలైట్లను అంతం చేస్తామని డెడ్‌లైన్ పెట్టిన అమిత్‌షా దేశంలోని నిరుద్యోగ సమస్యకు, పేదరిక నిర్మూలనకు ఎందుకు డెడ్‌లైన్ పెట్టి పరిష్కారం చేయట్లేదన్నారు. పదకొండు సంవత్సరాల మోదీ సర్కారు హయాంలో పెట్రోల్, డిజిల్, నిత్యావసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగాయని, రూపాయి విలువ పతనం అయ్యిందని, ద్రవ్యోల్బణం పెరిగిందని, ఇలా అసమర్థ పాలన కొనసాగిస్తున్న మోదీ సర్కారు వైఫల్యాలను కప్పిపుచ్చి ప్రచార ఆర్భాటాలతో పాలన కొనసాగిస్తున్నాడన్నారు. ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉదృతం చేస్తామన్నారు. అనంతరం మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా పరికిరాల రమేష్ తోపాటు పదిహేను మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మహాసభలో అధ్యక్ష వర్గంగా ఎస్.కె రషీద్, జన్ను శారద వ్యవహరించగా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కె బాషుమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు బుస్స రవీందర్, గుండె భద్రి, గన్నారపు రమేష్, ఎండి ఖాసిం, మండల సహాయ కార్యదర్శి సంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షాన పోరాటాలు

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల సిపిఐ 13వ మహాసభలు సోమవారం మండల కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో జరిగాయి. మహాసభకు ముఖ్య అతిధులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి కొల్లు రాజయ్యలు హాజరై అమరవీరుల స్థూపం వద్ద జెండా ఆవిష్కరించారు. మహాసభలో గోద శ్రీరాములు మాట్లాడుతూ పేదల పక్షాన పోరాటాలు చేసేది కేవలం కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. నాటి నుండి నేటి వరకు బడుగు బలహీన వర్గాలు, కార్మిక, కర్షక హక్కుల సాధనకు పోరాటం చేసిన పార్టీ సిపిఐ అన్నారు. దేవాదుల కాలువను పూర్తి చేసి మండలంలోని ప్రతి ఎకరాకు తాగు, సాటు నీరు ఇవ్వాలని ఆ బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, ఎన్నికల హామలను అమలు చేయాలని కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా నిత్యవసర సరుకుల ధరలు, వంట గ్యాస్, పెట్రోల్, డిజిల్ ధరలు పెంచి పేద వాడి నడ్డీ విరిచారన్నారు. గుర్రం మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, సత్యనారాయణ, రాష్ట్ర సమితి సభ్యులు ఆదిసాయిలు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజయ్య, కృష్ణ, జంగమ్మ, దయాకర్‌రెడ్డి, లక్ష్మీ, సత్యనారాణయచారి, వెంకన్న, జోసేఫ్, కొమురయ్య, బిక్షం, యాదయ్య పాల్గొన్నారు. సభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా అనంతుల రామచంద్రయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 30మంది కౌన్సిల్ సభ్యులతో మండల కమిటీని ఎన్నుకున్నారు.



## అర్హులకు సంక్షేమ పథకాలు వర్తింపు

### సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌గౌడ్

### ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ తన్నేరువరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**ప్రజాపక్షం/గన్నేరువరం :** అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం గన్నేరువరం మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్‌కు ప్రజాసమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ధర్నాలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో కొత్త మండలమైన గన్నేరువరంపై వివక్ష చూపడం తగదన్నారు. మండలంలో ప్రజాసమస్యలను ప్రభుత్వం గాలికొదిలేసారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల విషయంలో గన్నేరువరం మండలంలోని అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మండలంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని, ఇండ్లు కట్టని పక్షంలో వాటిని రద్దు చేసి అర్హులైన వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొందరు ఇండ్లున్న వారికే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మండలంలో రుణమాఫీ పూర్తిస్థాయిలో కాలేదని, వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి ఆ రైతుల విషయంలో సాంకేతిక లోపాలను సవరించి వెంటనే రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. మండల కేంద్రంలో గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలాయని, వాటిని పూర్తిస్థాయిలో నిర్మించి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని కోరారు. గన్నేరువరం మండల కేంద్రంలో కొత్తదైనప్పటికీ కొన్నేళ్లుగా మండల ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేకుండా ప్రజలు, అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. మండలంలోని గురుకుల పాఠశాలను తరలించడం జరిగిందని, దానిని వెంటనే మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలన్నారు. గన్నేరువరం మండలంలో అనేక ప్రాంతాల్లో రోడ్డు పక్కన బావులకు సైడ్ గోడలు లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో వెంటనే సైడ్ వాల్ నిర్మించి ప్రమాదాలను నివారించాలని కోరారు. గుండ్లపల్లి, జంగపల్లి, గన్నేరువరంలో మత్తడిపై కల్వర్ట్‌లు నిర్మించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి విధ్యార్థులకు దూరభారం తగ్గించాలన్నారు. డబుల్ రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోకపోతే సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని, తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చొక్కల్ల శ్రీశైలం, సహాయకార్యదర్శి కూన మల్లయ్య, పిప్పల్ల కనుకయ్య, నాయకులు కాంతాల అంజిరెడ్డి, బోయిని కనకయ్య, యువజన నాయకుడు మొలుగూరి ఆంజనేయులు, ఎఐఎస్ఎఫ్ మండల నా యకుడు ముల్కల పవన్, బోయిని తిరుపతి, బొమ్మకంటి ఆంజనేయులు, లింగం గణేష్, చెరు కు ఆంజనేయులు, బోయిని మల్లయ్య, ఎండి నయీం, చిటవేణి రాము, లక్ష్మణ్, న్యాత కొమురయ్య, జాలి గోపయ్య, బోయిని మల్లయ్య, కూన సంపత్, దామ సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/సారంగాపూర్:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం మండలానికి చెందిన 47 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 12 లక్షల 48 వేల రూపాయల విలువ గల చెక్కులను , 31 మంది ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా మంజూరైన 31 లక్షల రూపాయల విలువల గల చెక్కులను లబ్ధిదారులకు జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వహీద్, ఎంపీడీవో చౌడాపు గంగాధర్, ఎస్సై గీత, నాయకులు రాజేందర్‌రెడ్డి, సురేందర్, శేఖర్‌గౌడ్, నరసింహారెడ్డి, బాపిరాజు, అధికారులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు , నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

## అందరికీ పిఎం బీమా చేయించాలి

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** పిఎంజెజెబివై, ఎస్‌బివై, ఎపివై వంటి బ్యాంకు ఖాతాదారుల బీమా పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి అందరికీ బీమా చేయించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బ్యాంకర్లను, జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా అధికారులు, బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతి తక్కువ ప్రీమియంతో రెండు లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉన్న పిఎం బీమా యోజన పట్ల ప్రజలందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. 17 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల వరకు అర్హత ఉన్న ఈ ప్రీమియం వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబ సభ్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో బ్యాంకర్ల సహకారంతో ఇంటర్ విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. వారందరూ పిఎం జెజెబివై బీమా చేసేలా చూడాలన్నారు. ప్రధానమంత్రి సూరజ్ ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లాలో ఒక రెవెన్యూ గ్రామాన్ని సోలార్ మోడల్ విలేజ్‌గా ఎంపిక చేయనున్నారని తెలిపారు. ఎంపికైన గ్రామానికి కోటి రూపాయల నిధులు కేటాయించి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఐదువేలకు పైగా జనాభా ఉన్న గ్రామాల్లో ప్రతి ఇంటికి, ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి సోలార్ ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలందరూ పదవ తరగతి, ఇంటర్ ఓపెన్ స్కూల్‌లో చేరేలా ప్రోత్సహించాలన్నారు. ఎంపిడిఓలు, ఎంపిఓలు ప్రత్యేక చొరవ తీసుకుని వీలైనంత ఎక్కువ మందిని ఓపెన్ స్కూల్‌లో చేర్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ పిడిని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డిఆర్‌ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబులు పాల్గొన్నారు.

## రోగుల పాలిట సిఎంఆర్ఎఫ్ వరం

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** ముఖ్యమంత్రి సహాయనిధి రోగుల పాలిట వరంలా మారిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 10మంది లబ్ధిదారులకు సిఎం ఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.4.50 లక్షల విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

భార్యాభర్తల గొడవతో ఆత్మహత్యాయత్నం





**ప్రజాపక్షం / ధర్మపురి :** భార్య భర్తల గొడవ నేపథ్యంలో ఓ వ్యక్తి సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యకు ప్రయత్నిస్తూ హల్‌చల్ చేయగా సిఐ రాం నర్సింహ రెడ్డి చొరవతో సెల్ టవర్ దిగి రావడంతో ఉత్కంఠకు తెరదించింది. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన గడిపెల్లి గోపాల్ అలియాస్ గోపి(42) స్థానికంగా ఓ టెంట్ హౌస్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. కాగా సోమవారం అతని భార్య నర్సమ్మతో ఇంట్లో గొడవ పడ్డాడు. మద్యం సేవించి సమీపంలోని జియో సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యా యత్నం చేయబోగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చా రు. వెంటనే ధర్మపురి సిఐ రాం నర్సింహ రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక శకటంతో సిబ్బందిని రప్పించి గోపాల్‌ను టవర్ దిగి రావాల్సిందిగా అతని కూతురు పింకీతో పాటు సిఐ మైక్ సెట్ ద్వారా కోరుతూ నచ్చజెప్పగా ఎట్టకేలకు గోపాల్ టవర్ దిగడంతో రెండు గంటల ఉత్కంఠకు తెరపడి ఊపిరిపీల్చుకున్నారు. కుటుంబ గొడవలో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని సిఐ చాకచక్యంగా సెల్ టవర్ ఘటన నుండి రక్షించిన వైనాన్ని పట్టణ వాసులు అభినందించారు.

## ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించిన 'సుడా' చైర్మన్ నరేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** ప్రజాపాలనలో భాగంగా ప్రతి రోజు ఇద్దరు కార్పోరేషన్ చైర్మన్లు గాంధీభవన్‌లో కూర్చుని ధరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేసే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల ప్రకారం గాంధీభవన్ నుంచి గత 20 రోజుల క్రితం షెడ్యూల్ విడుదల చేశారు. అందులో భాగంగా సోమవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో పాటు సాంస్కృతి సారథి చైర్మన్ వెన్నెల పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ముప్పై వరకు వివిధ సమస్యలతో వచ్చిన ధరఖాస్తులు స్వీకరించి అక్కడికక్కడే కొన్ని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడం జరిగిందని, మిగిలిన ధరఖాస్తులు సంబంధిత శాఖలకు పరిష్కారానికి పంపడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి సంక్షేమం ఒకవైపు కొనసాగుతూనే ప్రజల సమస్యలపై నాయకులు ఎక్కడికక్కడ పరిష్కరించడానికి కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంత మంచి కార్యక్రమంలో భాగస్వాములైనందుకు సంతోషంగా ఉందని నరేందర్ రెడ్డి, వెన్నల లు తెలిపారు.

## యాదవ సోదరులకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వం

రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** యాదవ సోదరులకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం ధర్మారం మండలంలోని బొమ్మరెడ్డిపల్లి, చామనపల్లి గ్రామాల్లో మరణించిన గొర్రెలకు నష్టపరిహారం చెల్లింపు, విద్యుత్ రంగంలో పలు వంటి అభివృద్ధి పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి శంకుస్థాపన చేశారు.అనంతరం మాట్లాడుతూ బొమ్మరెడ్డిపల్లి, చామనపల్లి గ్రామాల్లో యాదవ సోదరులను ఆదుకోవాలనే ఉద్దేశంతో మరణించిన మేకలు గొర్రెలకు నష్టపరిహారం కింద రాష్ట్ర ప్రభుత్వం తరఫున 8 లక్షల 70 వేల రూపాయల పరిహారం పంపిణీ చేస్తున్నామని అన్నారు. ధర్మారం మండలంలో యాదవ సోదరులకు విపత్కర సమయంలో ఆదుకునేందుకు పరిహారం త్వరగా మంజూరు చేసిన కలెక్టర్‌కు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ధర్మారం మండలంలో యాదవ సోదరులకు ప్రత్యేక కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. యాదవ కుర్మా గౌడ మున్నూరు కాపు సోదరులకు కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులను నియోజకవర్గ నిధుల నుంచి కేటాయిస్తామని అన్నారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని మంత్రి తెలిపారు. ధర్మారం మండలంలో నూతనంగా ఐటిఐ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ధర్మారం మండల ప్రజల ఆశీర్వాదంతో నేడు క్యాబినెట్ మంత్రి స్థాయికి ఎదిగానని అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ 15 రోజుల క్రితం చామనపల్లి గ్రామంలో 52 గొర్రెలు విద్యుత్ షాక్ తో ,20 రోజుల క్రితం బొమ్మ రెడ్డి పల్లి గ్రామంలో 100 గొర్రెలు అనారోగ్యంతో మరణించగా మంత్రి సంబంధిత పాడి రైతులను ఓదార్చి ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారని , మంత్రి ఆదేశాల మేరకు చామనపల్లి గ్రామంలో 9 మంది లబ్ధిదారులకు 3.64 లక్షల రూపాయల, బొమ్మరెడ్డిపల్లి గ్రామంలో 5 మంది లబ్ధిదారులకు 5.1 లక్షల పరిహారం నేడు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, రెవెన్యూ డివిజన్ అధికారి బి .గంగయ్య , ధర్మారం తహసిల్దార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరికి సన్మానం



**ప్రజాపక్షం/జమ్మికుంట:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని అల్గునూర్‌లో ఆదివారం రాత్రి మాదిగ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ ఆద్వర్యంలో జరిగిన మాదిగ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ వికలాంగుల, వృద్ధుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్‌లను జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, సర్పంచులు, మున్సిపల్, సహకార సంఘాల ఎన్నికల్లో అన్ని పార్టీల్లో పనిచేస్తున్న మాదిగ జాతి బిడ్డలు కష్టపడి గెలవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంబాల రాజు, శాయంపేట మాజీ సర్పంచ్ ఆకనపల్లి సుజాత భద్రయ్య, నగరం గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకు సంపత్‌లు పాల్గొన్నారు.

## దేశ ప్రయోజనాలను మోదీ అమెరికాకు తాకట్టు

ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బామండ్లపల్లి యుగంధర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** భారతదేశ ప్రయోజనాలకు, ప్రతిష్టను అమెరికాకు తాకట్టుపెడుతున్న ప్రధాని నరేంద్రమోదీ విధానాలపై ఉద్యమించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బామండ్లపల్లి యుగంధర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు భారతీయులపై అమెరికా దుర్మార్గపు చర్యలను ఆపాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో జులై 2న చలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సోమవారం కరీంనగర్ బస్టాండ్ సమీపంలో సంబంధిత గోడప్రతిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ విధానాలు దేశానికి ప్రమాదకరమని, దేశాన్ని తిరోగమన దిశలో తీసుకెళ్లే విధానాలను అనుసరిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వత్తాసు పలుకుతూ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రతిష్టను నష్టపరిచే చర్యలను దేశ పౌరులు తిప్పికొట్టాలన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల భారత్ పాక్ యుద్దాన్ని తానే ఆపానని చెప్పడం చూస్తే మన దేశ ప్రతిష్టను మోదీ తాకట్టు పెట్టాడనడానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. మోదీ, ట్రంప్ మాటలను సైతం ఖండించలేదన్నారు. భారత పౌరులపై అమెరికా దుర్మార్గంగా వ్యవహరించడాన్ని అభ్యంతరం చెప్పడంలో విఫలమవడం ద్వారా మరోసారి తన క్రూరమైన వైఖరిని బహిర్గతం చేసిన మోదీ ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటన్నారు. కఠినమైన బహిష్కరణ చర్యల నేపథ్యంలో తన సొంత ప్రజలకు కనీస గౌరవాన్ని అందించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా ముందు లొంగిపోయారని మండిపడ్డారు. మోదీ అమెరికా సందర్శించినప్పుడు కోట్లాది రూపాయలు ప్రచారం కోసం ఖర్చు చేస్తూ ప్రజా దుర్వినియోగ కార్యక్రమాలు చేపడుతున్నారే తప్ప భారతదేశంలో యువతకు అవసరమైన నిర్దిష్ట ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదన్నారు. ట్రంప్‌ను ప్రపంచ అధ్యక్షుడుగా చేసేందుకే మోడీ విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలోఎఐవైఎఫ్ నాయకులు కనకం ప్రవీణ్, వినయ్, చరణ్, మధు, రాజేష్, కిరణ్, రాఘవేంద్ర, కుమార్, వినయ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## డిస్మిస్ ఐన జెఎంఇటిలకు త్వరలో ఉద్యోగ ఆర్డర్

ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** సింగరేణిలో వివిధ కారణాల వల్ల డిస్మిస్ ఐన 143 మంది జెఎంఇటిలకు తిరిగి ఉద్యోగాలు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందని గుర్తింపు సంఘం ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. సోమవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 27న కొత్తగూడెంలో గుర్తింపు సంఘం ఎఐటియుసితో యాజమాన్యం జరిపిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాల వివరాలను వెల్లడించారు. సింగరేణిలో గత ఐదారు సంవత్సరాల నుండి స్ట్రక్చర్ కమిటీ సమావేశాలు జరుగక కార్మికుల సమస్యలు పరిష్కారం కాక పెండింగ్‌లో ఉన్నాయని, ఎఐటియుసి గుర్తింపు సంఘంగా గెలిచిన తరువాత యాజమాన్యంతో క్రమ పద్ధతిలో స్ట్రక్చర్ సమావేశాలు ఏర్పాటు చేయించి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ముఖ్యంగా సింగరేణిలో క్లరికల్ విభాగంలో ఖాళీగా ఉన్న 360 పోస్ట్‌ల భర్తీ కోసం యాజమాన్యం నోటిఫికేషన్ విడుదల చేయడం వల్ల దాదాపు ఐదు వేల మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారని, వాటిని మెరిట్ ఆధారంగా పరీక్షలు నిర్వహించి భర్తీ చేయాలని యాజమాన్యాన్ని కోరడం జరిగిందని ఆయన అన్నారు, యాజమాన్యం పరీక్షలు నిర్వహించి అట్టి పోస్టులను భర్తీ చేస్తామని అంగీకరించారని ఆయన అన్నారు. అదే విధంగా యాక్టింగ్ క్లర్క్‌లు అట్టి పోస్టులను భర్తీ చేయాలని కోర్టుకు వెళ్ళారని, ఇంకా ఏమైనా ఖాళీలు ఉంటే యాక్టింగ్ క్లర్క్‌లకు అవకాశం కల్పించాలని కోరడం జరిగిందని ఆయన అన్నారు. అదే విధంగా మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, యాక్టింగ్ చేసిన వారికి అర్హులకు ప్రమోషన్‌లు ఇవ్వాలని కోరితే యాజమాన్యం అంగీకరించిందని ఆయన పేర్కొన్నారు. క్యాంటీన్ లలో కార్మికులకు ఇస్తున్న సబ్సిడీని పెంచాలని అడిగితే ఒప్పుకున్నారని ఆయన పేర్కొన్నారు. వివిధ కారణాల వల్ల డిస్మిస్ ఐన కార్మికులకు తిరిగి ఉద్యోగాలు కల్పించాలని ఏదైనా సంవత్సరం లో వంద మస్టర్లు ఉంటే తీసుకోవాలని కోరితే యాజమాన్యం పరిశీలిస్తామని చెప్పారని ఆయన అన్నారు. యూనియన్ పేర్కొన్న పలు సమస్యల్ని పరిష్కరించడానికి యాజమాన్యం అంగీకరించిందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, బ్రాంచి ఆఫీస్ బేరర్ సిర్ర మల్లికార్జున్, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

సింగరేణి జెఎసి సంఘాల నేతల డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జులై 9 న జరిగే దేశ వ్యాప్త సమ్మె ను సింగరేణి లో జయప్రదం చేయాలని సింగరేణి జెఎసి సంఘాలైన ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు టిబిజికేఎస్ మరియు ఐఎఫ్‌టియు సంఘాల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, ఎస్.నర్సింహారెడ్డి, తుమ్మల రాజారెడ్డి, మాదాసు రాంమూర్తి, కె.విశ్వనాథ్‌లు కార్మికుల ను కోరారు. సోమవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన ప్రెస్ మీట్ లో వారు పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని వారు ఆరోపించారు. ముఖ్యంగా దేశంలో బ్రిటీష్‌వారి పాలనలో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి అమలు చేయాలని చూస్తుందని వారు విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లు ఒక వేళ సింగరేణిలో అమలు చేస్తే, హక్కుల కు భంగం కలిగి, కార్మికులకు తీరని నష్టం జరుగుతుందని వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న కొత్త లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, బొగ్గు గనుల వేలం ఆపి కోల్ ఇండియా, సింగరేణి సంస్థ కు కేటాయించాలని, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం, ప్రైవేటీకరణ విధానాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్ లు మార్చి 18 న న్యూఢిల్లీ లో సమావేశమై మే 20 న దేశ వ్యాప్తంగా ఒక రోజు టోకెన్ సమ్మె చేయాలని పిలుపునిచ్చాయని, కాని దేశంలో యుద్ధ పరిస్థితుల దృష్ట్యా, దేశ రక్షణ ముఖ్యం కాబట్టి, ఇట్టి సమ్మె ను వాయిదా వేసి, తిరిగి జూలై 9 న దేశ వ్యాప్తంగా సమ్మె చేయాలని పిలుపునివ్వడం జరిగిందని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో జెఎసి సంఘాల నాయకులు కే.స్వా మి, పి.ధర్మపురి, మెండె శ్రీనివాస్, పర్లపెల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన భాస్కర్ రావు 34 వర్ధంతి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) మాజీ ఉప ప్రధాన కార్యదర్శి అమరజీవి మాదిరెడ్డి భాస్కర్ రావు 34 వ ర్ధంతి సందర్భంగా సోమవారం ఆర్జీ వన్ జి.ఎం ఆఫీస్ చౌరస్తా వద్ద ఉన్న భాస్కర్ రావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎఐటియుసి నాయకులు గో దావరిఖనిలో భాస్కర్ రావు కార్మిక వర్గానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం భాస్కర్ రావు భవన్‌లో స్మారక సభ నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఉప ప్రధాన కార్యద ర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు ప్రసంగించగా, వేదికపై బ్రాంచి ఉపాధ్యక్షులు సంకె అశోక్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెం ట్ ఎం.ఎ. గౌస్, భాస్కర్ రావు కుమారులు శేషు కుమార్, శ్రీదర్‌లు ఆసీనులు కాగా, సిపిఐ, ఎఐటియుసి నాయకులు బోగ సతీష్ బాబు, గండి ప్రసాద్, ఎస్ వెంకట్ రెడ్డి, ఆకునూరి శంకరయ్య, చెప్యాల భాస్కర్, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, బలుసు రవి, బండి మల్లే ష్, రెడ్డి వెంకట స్వామి, విగ్రహా దాత పగడాల ప్ర తాప రెడ్డి, ఎఐటియుసి ఆర్జీ వన్ సోషల్ మీడియా ఇంచార్జీ చంద తిరుపతి, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ అభివృద్ధిపై ఇంత నిర్లక్ష్యమా?

బిఆర్‌ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ నగరంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై మాజీ కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అభివృద్ధి పనులు జరిగిన దాఖలాలే లేవన్నారు. 18 నెలలుగా పెండింగ్‌లోని 65 అభివృద్ధి పనులు జరగడం లేదని, వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు అధికారులకు ఆరు సార్లు విన్నవించినా పట్టింపు లేకపోవడం దురదృష్టకరమన్నారు. సమస్యలతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఎక్కడ లేని విధంగా తీగల వంతెన వద్ద వెలుగుల దివ్వెలు కనిపించేవని, ప్రస్తుతం అక్కడ కాకుండా మరెక్కడా ఒక్క బుగ్గ వెలగడం లేదన్నారు. పలు ఐలాండ్‌లు అంధకారంగా మారాయన్నారు. కరీంనగర్‌లో తాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. మున్సిపాలిటీలో అస్తవ్యస్తంగా మారిందన్నారు. కరీంనగర్ నగర ప్రజలకు 24 గంటల పాటు మున్సిపల్ నల్లాల ద్వారా నీరు అందివ్వాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మట్టి రోడ్డు లేకుండా అభివృద్ధి చేశామని తెలిపారు. బిఆర్‌ఎస్‌కు పోరాటం కొత్త కాదని, సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్లు, నాయకులు తదితరులున్నారు.

## నారాయణ విద్యాసంస్థలపై చర్యలు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ నగరంలోని నారాయణ పాఠశాలలో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యాశాఖ నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న వైనంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆద్వర్యంలో పాఠశాల ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చర మేష్‌లు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో నారాయణ విద్యాసంస్థలలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, పెన్నులు, షూ, టై వంటి అక్రమంగా అమ్ముతూ లాభార్జన ధ్యేయంగా నడిపిస్తున్నారని అన్నారు. ఇష్టానుసారంగా ఫీజులు పెంచి నోటీసు బోర్డులో పెట్టకుండా, స్మార్ట్ పేర్లను జోడిస్తూ గ్రౌండ్ నిబంధనలకు అనుగుణంగా విశాలమైన తరగతి గదులు లేకుండా నడిపిస్తున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నగర అధ్యక్ష కార్యదర్శులు కేశబోయిన రాము, మామిడిపల్లి హేమంత్, జిల్లా ఉపాధ్యక్షులు కనకం సాగర్, జిల్లా నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, సాయి, శ్రావణ్, మురళి, మోహన్, వెంకటేష్‌తదితరులున్నారు.

## నారాయణ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టిన ఎఐఎస్‌ఎఫ్



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల ప్రతినిధి:** అధిక ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కుర్ర రాకేష్, మంద అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఫీజుల నియంత్రణ చట్టాన్ని ఉల్లఘింస్తూ లక్షలాది రూపాయలు విద్యార్థుల తల్లి దండ్రుల నుండి వసూలు చేస్తున్న నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఎదుట బైటాయించి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఫీజుల నియంత్రణ చట్టం తుంగలో తొక్కి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థి తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న, విద్యాశాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పేద విద్యార్థి తల్లిదండ్రులను ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఆసరాగా చేసుకొని కాసులు వసూలుకు పాల్పడుతున్న విద్య హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు.వారం రోజుల క్రితం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి వినోద్ కుమార్‌కు నారాయణ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించామని నోటీసు పంపినప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై దాడులు నిర్వహించి పర్మిషన్ లేనటువంటి విద్యాసంస్థలను సీజ్ చేయాలని లేనిపక్షంలో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలలపై దాడులు తప్పవని హెచ్చరించారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షులు పెండెల ఆధిత్య, నాయకులు పున్ని పవన్, జామచెట్టి ఈశ్వర్, రగూడ ప్రణయ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం /ఆసిఫాబాద్ :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జి ల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## రైతులకు భారీ రాయితీలు..



**ప్రజాపక్షం/కుంటాల :** కుంటాల మండలంలోని అందకూరు గ్రామంలోని ఆయిల్ పామ్ తోటలను బైంసా డివిజన్ ఉద్యాన శాఖ అధికారి జావిద్ పాషా పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులు ఉద్యాన శాఖ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ ఏడాది పండ్ల తోటలైన మామిడి,జామ, బొప్పాయి, అరటి,సీతాపలం,నిమ్మ,డ్రాగన్ ఫ్రూట్‌ల సాగుకు 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు జావీద్ పాషా తెలిపారు.అంతేకాకుండా,తీగజాతి కూరగాయల కోసం శాశ్వత పందిళ్ల నిర్మాణానికి కూడా 50 శాతం రాయితీ ఉంటుందని చెప్పారు.అయిల్ పామ్‌కు ప్రత్యేక సబ్సిడీతో పాటు,రైతులకు డ్రిప్ పరికరాలు కూడా అందించబడతాయని ఆయన వివరించారు.ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వర్లు,మాజీ సర్పంచ్ సాగర్ రావు,ఆయిల్‌పామ్ క్లస్టర్ అధికారి ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎరువుల కోసం బారులు తీరిన రైతులు



**ప్రజాపక్షం /సిర్పూర్ టి:** మండలంలో ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న వేళ, సోమవారం స్థానిక వ్యవసాయ సహకార కేంద్రం వద్ద రైతులు పెద్ద సంఖ్యలో బారులు తీశారు. ప్రభుత్వం అందజేస్తున్న ఎరువులు పొందేందుకు తెల్లవారు జాము నుంచే రైతులు క్యూలో నిలిచారు. ఎరువులు లేనందుకు వేచి ఉండటం మాకు పెద్ద కష్టంగా మారింది. సకాలంలో వేయకపోతే పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఒక రైతు ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా, డిఎపి వంటి అవసరమైన ఎరువులు మార్కెట్‌లో అందుబాటులో లేకపోవడంతో రైతులు గంటల తరబడి దుకాణాల వద్ద నిలబడుతున్నారు. ఎక్కడెక్కడా సరఫరా జరుగుతుందన్న సమాచారం వచ్చిన వెంటనే రైతులు తండోపతండాలుగా అక్కడకు చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక వ్యవసాయ అధికారులు స్పందిస్తూ, ఈ విషయాన్ని పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

## పోక్సో కేసులో శిక్షపడుతుందని భయంతో ఆత్మహత్యాయత్నం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** పోక్సోలో తనకు శిక్ష పడుతుందని మనస్థాపం చెందిన వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శబాష్‌పల్లి గ్రామానికి చెందిన పానగారి సుధాకర్ (40) అనే వ్యక్తిపై గతంలో పోక్సో కేసు నమోదైంది. త్వరలోనే తీర్పు వెలువడనుండడంతో మనస్థాపం చెందిన సుధాకర్ తన భార్య, పిల్లలను మండలంలోని కొత్తపేట గ్రామంలో దించి నర్సాపూర్ శివారులో పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియో తీసి తన కుటుంబ సభ్యులకు పంపించాడు. దీంతో వెంటనే పోలీసులకు విషయం తెలిపి లోకేషన్ ఆధారంగా సుధాకర్‌ను గుర్తించి వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాను ఏ తప్పు చేయలేదని, తన భార్య, పిల్లలను వదిలివెళ్లడం బాధగా ఉందని సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు.

## వానాకాలం పంటలపై అవగాహన



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండల కేంద్రమైన శివ్వంపేట రైతువేదికలో వానాఆలం పంటలపై రైతులకు సోమవారం వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. ఇంచార్జ్ వ్యవసాయ సహాయ సంచాలకులు నర్సాపూర్ గంగమల్లు పాల్గొని నారుమడిలో తీసుకోవాల్సిన మెళుకువల గురించి పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు తమ వివరాలను వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు అందించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు వెన్నెల, భవాని, మౌనిక రైతులు ఉన్నారు.

## ఆర్‌టిసి బస్సు, ఆటో ఢీ..ఇద్దరు మృతి



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** ముందుగా వెళ్తున్న బైక్ ను ఓవర్ టెక్ చేసేందుకు వెళ్లగా ఆర్టీసీ బస్ ను ఆటో ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు. ఈ విషాదకర ఘటన మెదక్ మండలం మంబోజి పల్లి శివారులోని ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీ వద్ద సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు కోల్చారం మండలం పోతన్ శెట్టి పల్లికి చెందిన శ్రీకాంత్(26), కొడిపల్లికి చెందిన నరేష్(25) లో ఆటోలో మెదక్ వస్తున్నారు. ఆటో నడుపుతున్న శ్రీకాంత్ ఎన్ఎస్ఎఫ్ వద్ద ముందుగా వెళ్తున్న బైక్ ను ఓవర్ టెక్ చేసేందుకు ఆటో వేగం పెంచి నడిపాడు. కానీ ముందుగా వస్తున్న ఆర్‌టిసి బస్‌ను చూడకపోవడంతో దాన్ని ఢీ కొట్టాడు. రెండు వాహనాలు వేగంగా ఉండడంతో ఆటో బస్ ను ఢీ కొట్టి నుజ్జునుజ్జు అయింది. అందులో ఉన్న శ్రీకాంత్, నరేశ్ లు అక్కడిక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను మెదక్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. వేగం మూలంగానే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

# డ్రాపౌట్ బడులపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్





**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి ;** డ్రాపౌట్‌లు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి విద్యాధికారులకు సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అన్ని సర్కారు బడులలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగే చొరవ చూపాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ సోమవారం మండల విద్యాధికారులతో సమీక్ష జరిపారు. జూన్ 6 నుండి 12 వరకు నిర్వహించిన బడిబాట సందర్భంగా నూతనంగా నమోదైన ప్రవేశాలపై ఒక్కో మండలం వారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల పాటు విద్యార్థులు ప్రవేశాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని ,ప్రభుత్వ బడులలో మెరుగుపడిన మౌలిక సదుపాయాలు, ఉత్తీర్ణత, భర్తీ అయిన టీచర్ల ఖాళీలు, నాణ్యమైన విద్యాబోధన, ఉచితంగా యూనిఫామ్‌లు, టెక్స్ట్ బుక్‌లు సమకూరుస్తున్న విషయాలపై ఇంటింటికి వెళ్లి విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించేలా కృషి చేయాలని కాగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం చేపట్టిన మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయించాలని ఈ పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. అవసరమైన బడులలో కిచెన్ షెడ్‌లు వంటి వాటి నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి కళాశాలల్లో చేరేలా పర్యవేక్షణ జరపాలన్నారు. 10వ తరగతి పూర్తి చేసుకుని పై చదువులో చేరని వారిని గుర్తిస్తూ ఒక్కో విద్యార్థి వారిగా పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో పంపిణీ జరిగాయని, నోట్‌బుక్‌లు కూడా 80 శాతం వరకు పంపిణీ అయ్యాయని మిగతా వాటిని కూడా జిల్లాకు కేటాయించిన వెంటనే విద్యార్థులకు ఆయా పాఠశాలల వారిగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక జత ఏకరూప దుస్తులు ఇప్పటికే విద్యార్థులకు అందించామని, రెండవ జత యూనిఫామ్‌లను మహిళా స్వయం సహాయక సంఘాలు త్వరగా కు ట్టించి ఇచ్చేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, డిఇఒ అశోక్, ఎంఇఒలు అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ఆరోగ్యమే సింగరేణి ధ్యేయం

### శ్రీరాంపూర్ ఏరియా జిఎం శ్రీనివాస్



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ సింగరేణి సంస్థ ప్రధాన ధ్యేయమని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ అన్నారు. సోమవారం నస్పూర్ డిస్పెన్సరీలో డివై సిఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్పైరోమెట్రీ, ఆడియోమెట్రీ పరికరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా అవసరమైన అన్ని వైద్య సదుపాయాలను, ఆధునిక పరికరాలను సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. సుమారు మూడు లక్షల రూపాయల విలువైన స్పైరోమెట్రీ, ఆడియోమెట్రీ పరికరాలను డిస్పెన్సరీలో ఏర్పాటు చేయడం ఆనందదాయకమని తెలిపారు. ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. నేడు పదవీ విరమణ పొందుతున్న మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వేదవ్యాసు చేసిన సేవలు అభినందనీయమని అన్నారు. గత 27 సంవత్సరాలుగా ఆయన ఉద్యోగులు, వారి కుటుంబాల ఆరోగ్య సంరక్షణలో అందించిన సేవలు అమోఘమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం ఎన్ సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్లు మురళీధర్, లోకనాథ్ రెడ్డి, గుర్తింపు సంఘం నాయకులు కొట్టే కిషన్ రావు, చంద్రమోహన్, ఆర్‌కె 8 డిస్పెన్సరీ పిట్ కార్యదర్శి విజయలక్ష్మి , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## డిఎస్ విగ్రహానికి కాంగ్రెస్ నేతల ఘననివాళి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** నికార్సైన కాంగ్రెస్ వా ది ధర్మపురి శ్రీనన్న అని ప్రభు త్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో డిఎస్ విగ్రహానికి ప్రభు త్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిలు ఘనంగా నివాళులర్పించి మాట్లాడిరు. డిఎస్ జీవితం



మొత్తం కాంగ్రెస్ పార్టీ కోసం సేవ చేశారన్నారు. ఎప్పటికీ డిఎస్‌ను కాంగ్రెస్ వాదిగానే గుర్తిస్తామని కాంగ్రెస్ సేవలు మరువలేమన్నారు. ఆయన అనారోగ్యంతో చనిపోతే అంత్యక్రియలకు సిఎం రేవంత్‌రెడ్డి హాజరై నగరంలో డిఎస్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఆ రోజే చెప్పారన్నారు. డిఎస్‌కు కాంగ్రెస్ పార్టీ తరపున నేడు ఘననివాళి అర్పించామన్నారు. డిఎస్ విగ్రహానికి నివాళులర్పించిన వారిలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను తప్పనిసరిగా పరిష్కరించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/మెదక్‌ప్రతినిధి:** జిల్లా అధికారులు ప్రజా సమస్యలు తప్పనిసరిగా పరిష్కరించాలని, ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అదనపు కలెక్టర్ నగేష్ , జెడ్‌పిసిఇఒ ఎల్ల య్య, డిఆర్‌డిఒపిడి శ్రీనివాసరావు లతో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ప్రజల నుండి కలెక్టర్ వినతులను స్వీకరించారు. గ్రీవన్స్ కి 97 దరఖాస్తు లు రాగా.... భూ సమస్యలు.33, ఇందిరమ్మ ఇండ్ల కొరకు, 20, పింఛన్ కొరకు 05, ఇతర సమస్యలు 39 సమస్యలు ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసితో ఏడవ స్ట్రక్చర్ కమిటీ సమావేశం



**ప్రజాపక్షం/మందమర్రి:** గనుల కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రతి అంశంపై సానుకూల స్పందన ఇవ్వాలని ఎఐటియుసి నాయకులు అక్బర్ అలీ అన్నారు. మందమర్రిలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో జిఎం దేవేందర్ ఆధ్వర్యంలో గుర్తింపు సంఘం ఎఐటియుసితో ఏడవ స్ట్రక్చర్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందమర్రి ఏరియాలోని అన్ని గనుల సమస్యలపై సమగ్రమైన చర్చ జరిపినట్టు తెలిపారు. కార్మిక సంక్షేమం, వసతులపై యాజమాన్యం దృష్టి సారించాలన్న డిమాండ్లను ముందుంచామని, ముఖ్యంగా దీర్ఘకాలిక మందుల కొరతను నివారించేందుకు స్థానికంగా నాణ్యమైన మందులు కొనుగోలు చేయాలని కోరినట్టు చెప్పారు. ఈ సందర్భంగా జిఎం దేవేందర్ మాట్లాడుతూ, కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు, కోల్ డ్రిల్ రాడ్స్ సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్మికుల క్వార్టర్స్ మురిగిపోయిన స్థితిని దృష్టిలో ఉంచుకుని రిపేర్ పనులు, ఎలక్ట్రికల్ వైరింగ్ లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సివిల్, ఎలక్ట్రికల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు వెల్లడించారు. మిగతా సమస్యలను ఆయా గనుల మేనేజర్ల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో పిఎం శ్యాంసుందర్ పటేల్, ఎస్ఓటు జిఎం విజయ ప్రసాద్, ఐఇడి కిరణ్ కుమార్, డివైజిఎం సివిల్ రాములు, ఎజిఎం వెంకటరమణ, వర్క్ షాప్ డివైజిఎం ధూప్ సింగ్, డాక్టర్ నాగేశ్వరరావు, ఎఐటియుసి సెంట్రల్ సెక్రటరీ ఎండి అక్బర్ అలీ, మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, ఏరియా వైస్ ప్రెసిడెంట్ భీమనాధుని సుదర్శనం, బ్రాంచ్ సహాయ కార్యదర్శి సోమిశెట్టి రాజేశం, ఏరియా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించి... పిఎఫ్ వివరాలు వెల్లడించండి

### ఎఐటియుసి ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కాగజ్‌నగర్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రితో పాటు టివివిపి పరిధిలోని సిఎచ్‌సిల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాల ను వెంటనే చెల్లించాలని, కార్మికుల పిఎఫ్ వివరాలు వెల్లడించి ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆసిఫాబాద్ జిల్లా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి, అనంతరం, డిఎంహెచ్ఒ సీతారాం కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లాలో టివివిపి పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్ నిధులు చెల్లించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సరైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కార్మికులు చాలీచాలని వేతనాలతో హాస్పిటళ్లలో సేవలు అందిస్తుండగా, వేతనాలు లేక కుటుంబాలు పస్తులుంటున్న పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నిసార్లు అధికారులను, కాంట్రాక్టర్లను కలిసినా సమస్యలు పరిష్కారమవడం లేదని పేర్కొన్నారు. వేతనాలు చెల్లించని, ఇఎస్ఐ, పిఎఫ్ కట్టని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టి చర్యలు తీసుకోవాలని, ఇకపై కాంట్రాక్టర్ల ద్వారా కాకుండా ప్రభుత్వమే గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, నాయకులు దత్తు, సాయి, తిరుమల, పుష్ప, మారుతి, మీనాక్షి, దేవ్ రావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ చర్యలు

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదుపై తక్షణం స్పందించాలంటూ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె స్వయంగా పాల్గొని ప్రజలనుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి వెంటనే పరిష్కార మార్గాలు చేపట్టాలని ఆదేశించారు.వానాకాలం నేపథ్యంలో పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్ పనుల్లో నిర్లక్ష్యం జరుగకూడదని స్పష్టం చేశారు.వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలంటే అన్ని శాఖలు లక్ష్యంగా నిర్దేశించిన మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు .ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో అర్హులైన లబ్ధిదారులకు ఇం డ్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల సమస్యలు సకాలం లో పరిష్కరించేందుకు అన్ని శాఖలూ పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు.అనంతరం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీట్) గోడ ప్రతిని కలెక్టర్ అవిష్కరించారు.డీట్ యాప్ ద్వారా యువత ఉపాధి అవకాశాల సమాచారం పొందవచ్చని,విద్యార్హతలు,నైపుణ్యాలు నమోదు చేసుకుంటే,కంపెనీ నుంచి అవకాశాలు పొందగలుగుతారని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,ఆర్‌డిఒ,వివిధశాఖలజిల్లా అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నా రు.

## అంతర్జాతీయ టిఇఇపి
## తైవాన్ ఇంటర్న్ షిప్ నేషనల్‌కు బిబివి ఆర్ఐటి విద్యార్థి ఎంపిక




**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివి రాజు ఇంజనీరింగ్ కళాశాల లలో సాంకేతిక విద్య సంస్థ నందు కెమికల్ ఇంజనీరింగ్ చ దువుతున్న విద్యార్థి శ్రీ కె అనంతరావు, డైవర్స్ దేశంలోని నేషనల్ చెంగ్ కుగ్ విశ్వవిద్యాలయంలో ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ టిఇఇపి తైవాన్ ఇం టర్న్ షిప్ కు ఎంపికైనట్లు బివి రాజు సాంకేతిక విద్య సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దుబే, కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలియపరిచారు. విద్యార్థి శ్రీ అనంత రావు తన ఇంటర్న్ షిప్ సమయ ంలో రెడియేటివ్, కూలింగ్, మెటీరియల్స్, ఉత్ప్రే రకము మరియు సి ఓసెపరేషన్ఫొరలపై దృష్టి సారించి అధునాతన పరిశోధన ప్రాజెక్టులో పాల్గొంటారు అన్నారు. ఇంటర్న్ షిప్ జూలై ఒకటవ తేదీ నుండి సెప్టెంబర్ 30 తేదీ వరకు ఇంజనీరింగ్ సైన్స్ విభాగంలో జరుగుతుందన్నారు. శ్రీ విష్ణు విద్యా సంస్థల చైర్మన్ కె.వి విష్ణురాజు వైస్ చైర్మన్ శ్రీ రవిచంద్రన్ రాజగోపాల్ సెక్రెటరీ శ్రీ ఆదిత్య వీసం విద్యార్థి అనంతరావును అభినందించారు. విష్ణు విద్యాసంస్థల చైర్మన్ విష్ణు రాజు మాట్లాడుతూ, సాంప్రదాయ కోర్సెస్ అయిన కె మికల్, మెకానికల్ ,సివిల్ ,ఎలక్ట్రికల్ వంటి కోర్సులకు తమ కళాశాలలో ప్రాధాన్యత వల్ల ఇటువంటి మంచి అవకాశాలు తమ కళాశాలకు వస్తున్నాయని చెప్పారు. ఈ అభినందన కార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపా ల్ డాక్టర్ సంజయ్ దుబే, రీసెర్చ్ డాక్టర్ రాజు, కెమికల్ ఇంజనీరింగ్ హె డ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ భాను, రాధిక , అన్ని విభాగాల అధిపతులు, ఇం జనీరింగ్ ఫ్యాకల్టీ అన్ని విభాగాల అధ్యాపకులు, డిజిఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు, అసిస్టెంట్ మేనేజర్ సురేష్, విద్యార్థిని, విద్యార్థులు ఎంపికైన విద్యార్థిని అనంతరావును అభినందించారు.

## ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేదం

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టులో ఆగస్టు 31వ తేదీ వరకు చేపల వేటను నిషేదించినట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఢోలిసింగ్ తెలిపారు. ఆయన సోమవారం అచ్చంపేట్ మత్స్యశాఖ చేపపిల్లల విత్తనోత్పత్తి కేంద్రంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జూలై ఆగస్టు మాసాల్లో రిజర్వాయర్‌లోకి వర్షాల నేపథ్యంలో నీటి ప్రవాహం అధికమై జలాశయంలోని చేపలు సహజ ప్రేరణ పొంది కోట్ల సంఖ్యలో సంతానం చేయడం వలన ఈ చేపల ఉత్పత్తి పెరిగి చేపల వేటపై ఆధారపడే మత్స్యశాఖ కార్మికులకు ఉపాధి దొరుకుతుందని, ఆయన తెలిపారు. ఆదేశాలను బేఖాతరుచేస్తూ ఎవరైనా చేపలను వేటాడితే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డోలిసింగ్ హెచ్చరించారు.




# 'ఆల్కహాల్' ఫస్ట్ లుక్ అదుర్స్




తెలుగు చిత్ర పరిశ్రమలో అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ వైవిధ్యభరితమైన చిత్రాలతో సంచలన విజయాలను అందుకుంటోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న చిత్రాలు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటున్నాయి. ఇప్పుడు ఈ మూడు సంస్థలు కలిసి మరో విభిన్న చిత్రాన్ని ప్రేక్షకులకు అందించడానికి సిద్ధమవుతున్నాయి. హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న అల్లరి నరేష్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రం కోసం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. పోస్టర్‌అ లో అల్లరి నరేష్ ఆల్కహాల్‌లో మునిగిపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇది భ్రమ, వాస్తవికత మధ్య జరిగే కథ. రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు.




## 'కే-ర్యాంప్' ఫస్ట్ లుక్

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కేర్యాంప్'. కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న 11వ చిత్రమిది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద నిర్మాత రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. 'కేర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు.

## ఔరంగజేబుగా బాబీ డియోల్



పవన్ కళ్యాణ్ హీరోగా 'హరి హర వీరమల్లు' చిత్రానికి సంబంధించి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇది పవన్ కళ్యాణ్ మొదటి పాన్ ఇండియా సినిమా కావడం విశేషం. అలాగే పవన్ కళ్యాణ్ మునుపెన్నడూ కనిపించని విధంగా మొదటిసారి చారిత్రక యోధుడి పాత్రలో కనువిందు చేయనున్నారు. ఇక 'యానిమల్' సినిమాలో తనదైన నటనతో ఆకట్టుకున్న బాబీ డియోల్.. 'హరి హర వీరమల్లు'లో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పాత్ర పోషిస్తుండటం మరో ప్రత్యేకతగా చెప్పవచ్చు. నిజానికి బాబీ డియోల్ పాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ప్రారంభంలోనే చిత్రీకరించారు. కానీ, 'యానిమల్'లో బాబీ నటనను చూసిన తర్వాత దర్శకుడు జ్యోతి కృష్ణ 'హరి హర వీరమల్లు'లో ఆయన పాత్రను పునః రచించాలని నిర్ణయించుకున్నారు. ఆ పాత్రను సరికొత్తగా తీర్చిదిద్ది, మరింత శక్తివంతంగా మలిచారు అని దర్శకుడు జ్యోతి కృష్ణ చెప్పారు.

## 'కన్నప్ప' అద్భుతంగా ఉంది

### డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



విష్ణు మంచునటించిన 'కన్నప్ప' సినిమాను డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ వంటి వారు ప్రత్యేకంగా వీక్షించారు. వీరితో పాటుగా మోహన్ బాబు, విష్ణు కూడా ఈ స్పెషల్ స్క్రీనింగ్‌లో ఉన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ 'కన్నప్ప' చిత్రం ఊహకు మించి ఉంది. అర్జునుడిగా, తిన్నడిగా, కన్నప్పగా విష్ణు అద్భుతంగా నటించారు. ఇంత గొప్ప చిత్రం నిర్మించిన మోహన్ బాబుకి అభినందనలు. కథ, కథనం, విజువల్స్, యాక్టింగ్ అన్ని ఇలా గొప్పగా అనిపించాయి. ఇదొక మైల్ స్టోన్ చిత్రం అవుతుంది' అని అన్నారు. సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ 'చాలా రోజుల తరువాత మంచి చిత్రాన్ని చూశాను. ఇంత గొప్ప చిత్రాన్ని నిర్మించిన మోహన్ బాబుకి, విష్ణుకి ధన్యవాదాలు. శివ భక్తులంతా పరవశించి పోయేలా మూవీని తీశారు. మేం అంతా కలిసి ఈ మూవీని చూసి ఎంతో ఆనందించాం. మన కథను అందరికీ తెలిసేలా చేయాలి. ఇలాంటి చిత్రాల్ని అప్పుడప్పుడు అయినా తీయాలని సినిమాటోగ్రఫీ మినిస్టర్‌గా నేను అందరినీ కోరుతున్నాను' అని అన్నారు.

## 'ఆంధ్రా కింగ్ తాలూకా' షూటింగ్ షురూ




రామ్ పోతినేని హీరోగా, మహేష్ బాబు పి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. తాజాగా షూటింగ్ షెడ్యూల్ రాజమండ్రిలో ప్రారంభమైంది. రామ్ పోతినేనే, కన్నడ స్టార్ ఉపేంద్రలపై కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ ఆసక్తికరమైన కథాంశంలో రామ్ డై హార్డ్ అభిమాని పాత్రను పోషిస్తుండగా, ఉపేంద్ర సూపర్ స్టార్ గా పాత్రలో కనిపిస్తారు. ఇటీవల విడుదలైన 'ఆంధ్రా కింగ్ తాలూకా' టైటిల్ గ్లింప్స్ కు ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందన వచ్చింది. భాగ్యశ్రీ బోర్సే రామ్ సరసన కథానాయికగా నటిస్తోంది. వివేక్‌మెర్విన్ మ్యూజిక్ అందిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.






# కాళేశ్వరం అవకతవకలపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్‌కు వివరాలు అందజేసిన ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం మంత్రివర్గ సమావేశాల మినిట్స్‌ను సోమవారం సమర్పించింది. ఈ నివేదికలో ప్రభుత్వం పలు కీలక అంశాలను తెలియజేసినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం వద్ద ఉన్న వివరాలను ఈ నెల 30 నాటికి అందజేయాలని పిసిఘోష్ కమిషన్ గతంలో లేఖ రాసిన నేపథ్యంలో ప్రభుత్వం సోమవారం ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేసింది. తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టును రిడిజైన్ పేరుతో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, మేడిగడ్డ బ్యారేజ్, కేవలం పరిపాలన అనుమతుల ఆధారంగానే నిర్మించారని, ఇందుకు సబంధించి అప్పటి మంత్రివర్గ సమావేశంలో ఏలాంటి చర్చ జరగలేదని నివేదికలో పొందపర్చినట్లు తెలిసింది. 2016 మార్చి 1న మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణానికి పరిపాలన అనుమతి ఇవ్వగా, పనుల ప్రారంభ సమయానికి కూడా డిపిఆర్ సిద్ధం కాలేదని పేర్కొంది. ఏడాది తర్వాత, 2017లో మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రాజెక్టుపై తొలిసారి చర్చ జరిగినట్లు నివేదిక అందజేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాగ్ ఇచ్చిన నివేదికలో ప్రాజెక్టు వ్యయం రూ.1.47 లక్షల కోట్లకు పైగా ఉంటుందని నివేదిక ఇచ్చిందని వెల్లడించింది. నిర్మాణ లోపాల వల్ల మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు 2023 అక్టోబర్ 22న కుంగిపోయాయని, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు కూడా నీటి నిల్వకు పనికిరావని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) తేల్చినట్లు జసిస్ట్ పిసి ఘోష్ కమిషన్‌కు నివేదిక అందజేసినట్లు సమాచారం.


















### బుద్ధవనం ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్‌గా

# మల్లేపల్లి లక్ష్మయ్య



ప్రజాపక్షం/ హైదరాబాద్: బుద్ధవనం ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్‌గా మల్లేపల్లి లక్ష్మయ్యను నియమిస్తూ తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. లక్ష్మయ్య ఈ పదవిలో రెండు సంవత్సరాల పాటు కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొన్నారు.

# కెఎబి శాస్త్రి సేవలను కొనియాడిన ఎక్సైజ్ కమిషనర్



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎక్సైజ్ శాఖ పనితీరును మెరుగుపర్చడంలో జాయింట్ కమిషనర్ కెఎబి శాస్త్రీ సేవలు అమోఘమని ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ అన్నారు. ఎక్సైజ్ జాయింట్ కమిషనర్‌గా పనిచేసిన శాస్త్రి సోమవారం పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా అబ్కారీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో హరికిరణ్ మాట్లాడుతూ.. ప్రొహిబిషనర్ అండ్ ఎక్సైజ్ శాఖలో శాంతి పరులుగా గుర్తింపు పొందిన శాస్త్రీలాంటి అధికారులు చాల తక్కువ మంది ఉంటారన్నారు. అలాంటి కూల్ అధికారుల్లో జాయింట్ కమిషనర్ కెఎబి శాస్త్రి ఒకరు అని చెప్పవచ్చునని ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్, జాయింట్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, జాయింట్ కమిషనర్ సురేష్, డిప్యూటి కమిషనర్ పి.దశరథ్, అసిస్టెంట్ కమిషనర్లు అనిల్ కుమార్‌రెడ్డి, ప్రణవీ, ఆర్.కిషన్, చెంద్రయ్య, శ్రీనివాస్, టిజిబిసిఎల్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెట్లు కృష్ణ ప్రియ, ఉజ్వల రెడ్డి, పంచాక్షరి ఏఈఎస్‌లు, ఎస్‌టిఎఫ్, డిటిఎఫ్ టీమ్‌లు, ఇతర కుటుంబ సభ్యులు హాజరయ్యారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com